
రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం





చైనాతో అమెరికా వాణిజ్య ఒప్పందం

షియా ఇరాన్ చేతిలో అణ్వస్త్రంపై పాశ్చాత్య దేశాల ఆందోళన

అత్యంత వైభవంగా పూరీ జగన్నాథయాత్ర

లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 09 | శనివారం | 28-06-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


# గిగ్ వర్కర్లకు భద్రతా చట్టం











- 'గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఉపాధి, పని పరిస్థితుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యం
- చట్టం రూపకల్పనలో వేగవంతంగా ప్రభుత్వ చర్యలు

ప్రజాపక్షం/ హైదరాబాద్

''మీకు అన్నం కావాలా..? ఆర్డర్ చేస్తే పది నిమిషాల్లో మీ ఇంటికి వస్తుంది. పిల్లలకు పాలు కావాలా..?. ఆర్డర్ చేస్తే ఐదు నిమిషాల్లో మీ ముందుంటాయి''. ఇలాంటి సేవల వెనుక ఎంతో మంది కార్మికుల విలువైన శ్రమ దాగి ఉంది. ఎండనకా.. వాననకా... వాహనాలపై రోడ్ల మీద తిరుగుతూ ఈ సేవలు అందించే స్విగ్గీ, జొమాటో డెలివరీ కార్మికుల (బాయ్స్)కు ఇప్పటి వరకు భద్రత లేదు. తగిన సదుపాయాలు కూడా లేవు. వారి ఆరోగ్యం గురించి పట్టించుకునే నాథుడే లేడు. వారి వల్ల లబ్ధి పొందుతున్న ఫుడ్ తదితర సంస్థలు వారి గురించి పట్టించుకున్న దాఖలాలు కూడా నామమాత్రమే. ఆహార పదార్థాలను ఆర్డర్లపై అందించే స్విగ్గీ, జొమాటో లాంటి పెద్ద సంస్థలు వారి వద్ద డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్న కార్మికులు ప్రమాదాలకు గురైతే వారి కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. కోవిడ్19 మహమ్మారి కాలంలో ఆహార పదార్థాలను అందించడంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు క్రియాశీలపాత్ర పోషించినా అందుకు వారు తగిన గుర్తింపు కానీ, పరిహారం పొందలేదు. ఒక్కోసారి అత్యవసర పరిస్థితుల్లో రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు ఆహారపదార్థాలు అవసరమైతే సరఫరా చేసేది కూడా ఈ ఫుడ్ డెలివరీ కార్మికులే. దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్న ఈ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యలను దేశంలోని ఒకటి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తప్ప, కేంద్ర ప్రభుత్వంతో సహా ఏ రాష్ట్రమూ కూడా ఇప్పటి వరకు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు.ఈ నేపథ్యంలో తమ ఉద్యోగ భద్రత, ఆరోగ్యం, హక్కులు, సదుపాయాల కోసం గిగ్ కార్మికులు చేపట్టిన ఆందోళనలు పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ పార్టీ వారి సమస్యలపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఫుడ్ డెలివరీ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వారి సమస్యలపై గిగ్ కార్మికులతో చర్చించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో తరువాయి 2లో

### గిగ్ వర్కర్లకు ది బెస్ట్ పాలసీ తీసుకొస్తాం
### మంత్రి వివేక్ వెంకటస్వామి


''గిగ్ కార్మికులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారికి హక్కులు కల్పించాల్సిన అవసరం ఉంది. గిగ్ వర్కర్ల క్షేమం కోసం అప్పట్లో రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక చట్టం తెచ్చింది. అదే మాదిరిగా తెలంగాణలో కూడా గిగ్ వర్కర్ల కోసం ఒక బోర్డు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో గిగ్ వర్కర్లకు రిజిస్ట్రేషన్ విధానం తీసుకొస్తాం. తెలంగాణలో గిగ్ వర్కర్లకు ది బెస్ట్ పాలసీ తీసుకువస్తాం. తెలంగాణ గిగ్ వర్కర్ పాలసీ' దేశానికే రోల్ మోడల్ అయ్యేలా చూస్తాం. యాజమాన్యాలు, గిగ్ వర్కర్ల నుంచి 66 సూచనలు, సలహాలు వచ్చాయి. వాటిపై ఎలాంటి సాయం చేయాలన్నదానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటికే గిగ్ వర్కర్ల సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డి వారితో చర్చించారు. గిగ్ వర్కర్ల పాలసీపై మంత్రివర్గంలో చర్చించి అసెంబ్లీలో చట్టం చేస్తాం. గిగ్ వర్కర్లకు కనీస వేతనం వచ్చేలా కృషి చేస్తాం. తెలంగాణలో ఉన్న 4.5 లక్షల మంది గిగ్ కార్మికులకు కొత్త చట్టం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం'' అని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శుక్రవారం సచివాలయంలో మీడియా సమావేశంలో ప్రకటించారు.

# క్షుణ్ణంగా పరిశీలించాకే...

- ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపు యోచన
- మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు, ఎఐసిటిఇ మార్గదర్శకాల ప్రాతిపదికన పెంచాలన్న భావనలో ప్రభుత్వం
- ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు, ఏఐసిటిఇ మార్గదర్శకాల ప్రాతిపదికన ఫీజులను నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయం పట్ల హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. గత విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను పరిశీలించి, ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి, ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు.. ఇతర వసతులు, ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్టుగా కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లేలా విద్యా వ్యవస్థను రూపకల్పన చేయనుంది. కృత్రిమ మేధ (ఎఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీపడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు,ఎఐసిటిఇ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని సిఎం ఆశిస్తున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని, ఈ విషయమై ఇది వరకే విద్యా నిపుణులతో చర్చించినట్టు తెలుస్తోంది. ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్నాటక, పిఎ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసులలో ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబులను, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తరువాయి 2లో






## టిజిఇఎపిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

నేటి నుంచి జులై 7 వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిఇఎపిసెట్ కౌన్సెలింగ్‌ను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. శనివారం నుంచి జూలై 7వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. జూలై 6 నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేన తెలంగాణ ఇఎపిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. జూలై 14, 15 తేదీల్లో తొలి విడత మాక్ సీట్ల కేటాయింపు ప్రక్రియ ఉండగా, 18వ తేదీలోపు మొదటి విడత సీట్లను కేటాయిస్తారు. జూలై 25వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్ చేపట్టి, 26వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన, 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తారు. జూలై 30వ తేదీలోపు తరువాయి 2లో



## జూనియర్ డాక్టర్ల సమ్మెబాట


- తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 30 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరిక
- డిఎంఇకి సమ్మె నోటీసు అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజుడా) సమ్మెబాట పట్టనుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని, వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ఈ నెల 30వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు టిజూడా అధ్యక్షుడు డాక్టర్ జె.ఇసాక్ న్యూటన్, తరువాయి 2లో

## రాజ్యాంగ వ్యతిరేకి ఆర్‌ఎస్‌ఎస్

'సోషలిస్ట్, సెక్యులర్' తొలగింపు డిమాండ్‌పై వామపక్షాలు




**న్యూఢిల్లీ:** రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్', 'సెక్యులర్' పదాలను తొలగించాలన్న ఆర్‌ఎస్‌ఎస్ డిమాండ్‌ను సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఎ బేబి, దీపాంకర్ భట్టాచార్య శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ రెండు పదాలు రాజ్యాంగానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలని, తమ ప్రాణాలు త్యజించిన స్వాతంత్ర్య సమరయోధుల విలువలను ప్రతిబింబిస్తాయని నొక్కిచెప్పారు. హిందూ దేశ స్థాపన కోసం రాజ్యాంగాన్ని అణచి వేయాలనే ఈ పదాల తొలగింపునకు ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. ఆర్‌ఎస్‌ఎస్‌ది మతోన్మాద, విభజన, ఫాసిస్టు సిద్ధాంతమని తరువాయి 12లో


రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ అంగీకరించలేదు 12


# విద్య, వైద్యం, నైపుణ్యంతో సమాజంలో మార్పు



- ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ
- మంత్రులు పొన్నం , తుమ్మల, కోమటిరెడ్డితో కలిసి హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

సమాజంలో మార్పు రావాలంటే విద్య, వైద్యం, నైపుణ్యం ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం తన బాధ్యత, ప్రభుత్వబాధ్యత అని అన్నారు. గత 18 నెలల కాలంలో హుస్నాబాద్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, తెలంగాణ గొంతుకను, తెలంగాణ హక్కును పార్లమెంట్‌లో యావత్ దేశానికి వినిపించిన ఒక గొప్ప ప్రజాప్రతినిధి పొన్నం ప్రభాకర్ అని ప్రశంసించారు. ఒకప్పుడు తాలుకా కేంద్రంగా ఉన్న హుస్నాబాద్‌లో తరువాయి 2లో





కులహింస, మానవాళిపై ప్రత్యక్ష దాడి 03

ఐఎంసికి భూమి కేటాయింపు రద్దు : హైకోర్టు తీర్పు 06


# భయంతో పారిపోయా

- రెండువారాల పాటు బెంగళూరులో తలదాచుకున్నా..
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌కు సాక్ష్యం ఇచ్చిన ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- గత ప్రభుత్వ హయాంలో తనను, తన కుటుంబాన్ని వేధించారని వాంగ్మూలం
- బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై, కెసిఆర్, కెటిఆర్‌లపై సంచలన ఆరోపణలు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం రేకెత్తిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో బాధితుడిగా ఉన్న చేవెళ్ల బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి శుక్రవారం సిట్ అధికారుల ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. గంటన్నరకు పైగా సాగిన విచారణ అనంతరం ఆయన బయటకు వచ్చి, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా కెసిఆర్, కెటిఆర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. కెసిఆర్ పాలనలో తనకు ఎదురైన వేధింపుల కారణంగా, ఉద్యమకారుడినైన తానే భయపడి తరువాయి 2లో



# అమెరికాతో అణు చర్చలు ఇప్పట్లో ఉండవు

స్పష్టం చేసిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్

**దుబాయ్ :** అమెరికాతో అణు చర్చలు ఇప్పట్లో ఉండబోవని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరగ్చీ స్పష్టం చేశారు. ఇరాన్‌తో అణు చర్చలు ప్రారంభమవుతాయని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో, అబ్బాస్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అగ్రరాజ్యం ఏకపక్షంగా వ్యవహరించి, ఇటీవల దాడులు చేసిన విషయాన్ని ఇరాన అధికారిక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్బాస్ ప్రస్తావించారు. అణ్వస్త్ర తయారీ ప్రయత్నాలు, యురేనియం సేకరణ వంటి అంశాలపై చర్చలకు అమెరికా వైఖరివల్ల విఘాతం ఏర్పడిందని పేర్కొన్నారు. తపకర జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, అణు కార్యక్రమం పునరుద్ధరణపై నిపుణులు అధ్యయనం చేస్తున్నారని ఆయన చెప్పారు. 'చర్చల పునఃప్రారంభంపై ఎలాంటి అవగాహనకు రాలేదు. చర్చలకు సమయం కూడా ఖరారు కాలేదు. ఈ విషయంలో మేము ఎలాంటి హామీ ఇవ్వలేదు. చర్చల పునరుద్ధరణపై ఇప్పటి వరకూ అసలు మేము మాట్లాడనే లేదు' అని అబ్బాస్ తేల్చి చెప్పారు. అమెరికా జోక్యం కారణంగా పరిస్థితి గందరగోళంగా మారిందని అన్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా, జర్మనీ, ఇరాన్ మధ్య 2015లో ఉమ్మడి సమగ్ర కార్యాచరణ (జెసిపిఒఎ) ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం తరువాయి 12లో




## లా కాలేజీ విద్యార్థినిపై అత్యాచారం

కోల్‌కతాలో మళ్లీ షాకింగ్ ఘటన

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో మళ్లీ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. దక్షిణ కోల్‌కతా కస్బా ఏరియాలోని లా కాలేజీ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరగడం సంచలనమైంది. దీంతో మరోసారి రాష్ట్రంలోని విద్యా సంస్థలలో విద్యార్థుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి కాలేజీ మాజీ విద్యార్థితో పాటు, ప్రస్తుతం కాలేజీలో చదువుతున్న మరో ఇద్దరు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 25వ తేదీ రాత్రి 7.30–8.50 గంటల మధ్య కస్బా లా కాలేజీ క్యాంపస్‌లో సామూహిక అత్యాచార ఘటన చోటుచేసుకుంది. దీనిపై బాధిత విద్యార్థిని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముగ్గురు అనుమానితులను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణను ప్రారంభించిన పోలీసులు మరింత తరువాయి 2లో

# మూడేళ్లలో ఆదాయం రూ.59,884 కోట్లు



- సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు..
- జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ స్పష్టీకరణ
- అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయమే కారణమని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

భారతీయ రైల్వేలలో అత్యంత సమర్థవంతమైన జోన్లలో ఒకటిగా దక్షిణ మధ్య రైల్వే నిలిచిందని.. గడిచిన మూడేళ్లలో సరుకు రవాణాలో రూ.59,884 కోట్ల ఆదాయం సాధించామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. రైల్వే నిలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వేలో సరుకు రవాణాలో రికార్డు సాధించడం గర్వంగా ఉందన్నారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు.గడచిన మూడు సంవత్సరాలలో, దక్షిణ మధ్య రైల్వే ఆదాయం, సరుకు రవాణాలో రికార్డు గరిష్టాలను సాధించిందని తెలిపారు. స్థూల మూలాధార ఆదాయం 2022–23లో రూ.18,976 కోట్లకు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## చర్చించి.. పరిష్కరించుకుందాం..

### అపరిష్కృత సమస్యలపై చైనాకు రాజనాథ్ సూచన



**క్వింగ్‌డావో/ న్యూఢిల్లీ:** ఇరు దేశాల మధ్య చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించి, వాటిని పరిష్కరించుకోవాల్సిన అవసరంఉందని చైనాకు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) సమావేశాల కోసం క్వింగ్‌డావో వచ్చిన ఆయన, చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్‌తో కాసేపు భేటీ అయ్యారు. ఇరు దేశాల వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసి) వద్ద నెలకొన్న ఉద్రిక్తతలు, 2020లో తూర్పు లఢాఖ్‌లో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో వీరి సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇద్దరు మంత్రులు అధికారికంగా ప్రకటన చేయలేదు. అయితే, రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా చైనాతో చర్చల అంశాన్ని ప్రస్తావించారు. సరిహద్దు వెంట పలు అంశాలతో ముడిపడిన అభిప్రాయభేదాలను తొలగించుకుంటేనే, అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. డాంగ్‌తో జరిపిన సంభాషణలు 'నిర్మాణాత్మకం'గా ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

# చైనాతో అమెరికా వాణిజ్య ఒప్పందం

### భారత్‌తో 'బిగ్ డీల్' ఉంటుందని ప్రకటించిన ట్రంప్



బ్యాంకాక్: చైనాతో ఎంతోకాలంగా కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం తీవ్రత కనీసం కొంతవరకైనా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరిందని బ్లూమ్‌బెర్గ్ టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు. అయితే, వివరాలు వెల్లడించలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం చైనాతో రెండు రోజుల క్రితమే ఒప్పందం జరిగిందని వెల్లడించారు. ఆయన కూడా ఎలాంటి అదనపు సమాచారాన్ని ఇవ్వలేదు. భారత్‌తో త్వరలోనే 'బిగ్ డీల్' ఉంటుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నట్టు ట్రంప్ ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. చైనాతో కీలక ఒప్పందం కుదిరిందని, భారత్‌తో 'అతిపెద్ద ఒప్పందం' కుదుర్చుకోనున్నామని ట్రంప్ తెలిపారు. తమతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోని దేశాలపై ట్రంప్ సర్కారు పన్నుల రూపంలో మోయలేని భారాన్ని మోపుతున్న విషయం తెలిసిందే. ఒప్పందానికి రాకపోతే, 25 శాతం లేదా 35 శాతం లేదా 45 శాతం పన్ను చెల్లించడానికి సిద్ధంగా ఉండాలంటూ ట్రంప్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కాగా, చైనాతో కుదిరిన ఒప్పందం వివరాలు వెల్లడి కాలేదు. అయితే, అమెరిఆకు చైనా ఎంతోకాలంగా అరుదైన ఖనిజాలను సరఫరా చేస్తున్నది. గతంలో జనీవాలో కుదిరిన ఒప్పందంలోని అంశాల ఆధారంగానే తాజా వాణిజ్య ఒప్పందం కుదిరిందని అంతర్జాతీయ మీడియాలో వార్తా కథనాలు వస్తున్నాయి. కాగా, చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో అమెరికాతో ఒప్పందం అంశాన్ని ప్రస్తావించింది. అమెరికాకు అవసరమైన కొన్ని ఖనిజాలు లేదా వస్తువులను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది. కానీ, శాస్త్రసాంకేతిత రంగాల్లో కీలకమైన కొన్ని ముఖ్య ఖనిజాలపై ఎలాంటి వివరాలు ఇవ్వలేదు. ఇలావుంటే, ట్రంప్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కలిశారని, ఆ సందర్భంగా పలు వాణిజ్య అంశాలు ప్రస్తావనకు వచ్చాయని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రెండు దేశాలు పరస్పర లాభదాయకమైన ఒప్పందాన్ని కుదర్చుకునే దిశగా చర్చలు జరుగుతున్నాయని భారత వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. జరగబోయే ఒప్పందం ఇరు దేశాల వ్యాపార, వాణిజ్య రంగాల్లో విస్పష్టమైన అవగాహనకు, పరస్పర సహకారానికి అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

# చైనా నావికాదళ అధిపతిపై వేటు



బీజింగ్: చైనాలో రక్షణ, భద్రతా వ్యవహారాల వ్యవస్థల్లో అవినీతికి, బాధ్యతారాహిత్యానికి పాల్పడుతున్న వారిని తొలగించే ప్రక్షాళనా కార్యక్రమం కొనసాగుతున్నది. అందులో భాగంగా చైనా నావికాదళ అధిపతితోపాటు, ఒక అగ్రశ్రేణి అణు శాస్త్రవేత్తను కూడా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌సిపి) నుంచి బహిష్కరించారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ (పిఎల్‌ఎఎన్/ ప్లాన్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ లి హంజున్, చైనా నేషనల్ న్యూక్లియర్ కార్పొరేషన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ లియు షిపెంగ్‌లను దేశ శాసనసభ సభ్యత్వం నుండి తొలగించినట్టు హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదించింది. కాగా, శుక్రవారం ఇక్కడ తన సమావేశాన్ని ముగించిన ఎన్‌పిసి స్టాండింగ్ కమిటీ, అధ్యక్షుడు జి జిన్‌పింగ్ నేతృత్వంలోని చైనా సైన్య హైకమాండ్ అయిన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సిఎంసి) సభ్యత్వం నుంచి టాప్ జనరల్ మియావో హువాను తొలగించాలని ఓటు వేసిందని ప్రభుత్వ నిర్వహణలోని జిన్‌షువా వార్తా సంస్థ తెలిపింది. చైనా సైనిక సోపానక్రమంలో అతి పిన్న వయస్కుడైన జనరల్ మియావో, గత సంవత్సరం నవంబర్ నుండి తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనలకు సంబంధించి విచారణలో ఉన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ఆయనను ఎన్‌పిసి నుండి తొలగించారు. మియావో సిఎంసి పొలిటికల్ వర్క్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ)లో కమ్యూనిస్టు పార్టీ భావజాలం, సిబ్బంది మార్పులను నిర్వహించడంలో సిఎంసి కీలక పాత్ర పోషిస్తుంది. చైనా అధ్యక్షుడిగా జిన్‌పిన్ అధికారం చేపట్టిన తర్వాత మియావో కెరీర్ గణనీయంగా అభివృద్ధి చెందింది. చైనా నేవీలో రాజకీయ కమిషనర్ స్థాయికి చేర్చింది. చివరికి పిఎల్‌ఎకు అడ్మిరల్‌గా ఎంపికైన అత్యంత పిన్నవయస్కుడిగా గుర్తింపు సంపాదించారు. మియావోపై వచ్చిన తీవ్ర స్థాయిలో వచ్చిన క్రమశిక్షణ ఉల్లంఘనల ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. 2012 చివరి నాటికి ఆయన అధికారాన్ని చేపట్టినప్పటి నుండి, 72 ఏళ్ల జిన్‌పింగ్ సైన్యంలో భారీ ప్రక్షాళనలు చేపట్టారు. అవినీతి, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన కొంత మంది సీనియర్ జనరల్స్‌ను కూడా పదవి నుంచి తొలగించారు. నేరాలు రుజువు కావడంతో వీరిలో కొందరికి శిక్షలు కూడా పడ్డాయి. సైద్ధాంతిక నియంత్రణను బలోపేతం చేయడానికి, సైనిక సూపర్ పవర్ కావాలనే చైనా లక్ష్యానికి మద్దతు ఇవ్వడానికి పిఎల్‌ఎ అధికారులలో పార్టీ విధేయత యొక్క ప్రాముఖ్యతను జిన్‌పింగ్ పదే పదే చెప్తున్నారు.



లెబనాన్ దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయెల్ శుక్రవారం తెల్లవారు జామున వైమానిక దాడులు చేసింది. హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపినట్టు తెలుస్తున్నది. ఇజ్రాయెల్ అధికార ప్రతినిధిని ఉటంకిస్తూ పిటిఐ కథనం ప్రకారం, హిజ్బొల్లా కీలక ఆయుధాగారాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సుమారు 14 నెలలు కొనసాగిన ఇజ్రాయెల్‌–హిజ్బొల్లా మధ్య యుద్ధానికి గత ఏడాది నవంబర్‌లో తెరపడింది. ఇరువర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, తాజా దాడులతో ఇజ్రాయెల్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. హిజ్బొల్లా ఆయుధాగారాలు ఉన్నాయని పేర్కొంటూ, వైమానిక దాడులు జరిపింది. కాగా, ఇజ్రాయెల్ చర్యపై హిజ్బొల్లా, లెబనాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# కాంగో – రువాండా మధ్య శాంతి ఒప్పందం



డకర్ (సెనెగల్): డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్‌సి), రువాండా మధ్య శాంతి ఒప్పందం కుదరనుంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇప్పటికే ఈ రెండు దేశాలు వివిధ అంశాలను చర్చించుకొని, ఒక అవగాహనకు వచ్చాయి. ఒప్పందంపై సంతకాలు చేయడమే తరువాయి. గత రెండు దశాబ్దాలుగా ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. 1994లో రువాండాలో జరిగిన మారణహోమం తర్వాత లక్షలాది శరణార్థులు కాంగోలోకి ప్రవేశించారు. అప్పటి నుంచి అటు శరణార్థుల సమస్య, ఇటు బండా ప్రాంతాల్లోని తిరుగుబాటు గ్రూపులు వంటి సమస్యలు ఆగ్నేయ కాంగోను అస్థిరపరుస్తున్నది. ఎం23 తిరుగుబాటు గ్రూపు కూడా కాంగో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి. దీనికి రువాండా మద్దతునిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. తమ భూభాగంలో తిరుగుబాటుదారులకు రువాండా మద్దతు ఇస్తోందని కాంగో ఆరోపిస్తున్నది. కాంగోపై రువాండా కూడా ఇలాంటి ఆరోపణలే చేయడం గమనార్హం. మొత్తం మీద గత కొన్ని దశాబ్దాలుగా లక్షలాది మంది రువాండా నుంచి కాంగోకు లేదా కాంగో నుంచి రువాండాకు చేరుకొని, శరణార్థులుగా ఉన్నారు. 2022–2023 మధ్య కాలంలో ఇరు దేశాల మధ్య ఘర్షణలు తీవ్రతరంకాగా, ఆఫ్రికన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి, అమెరికా దౌత్యపర జోక్యంతో పరిస్థితి క్రమంగా మెరుగుపడుతున్నది. కాగా, ఇప్పుడు కుదరనున్న ఒప్పందంలో తక్షణ కాల్పుల విరమణ అంశం కీలకంగా మారింది. అదే విధంగా ఎం23 తిరుగుబాటు గ్రూప్ వెనక్కు వెళ్లాలని, తిరుగుబాటుదారులు ఆక్రమించిన ప్రాంతాలను ఖాళీ చేయాలని కాంగో కోరుతున్నది. కాల్పుల విరమణ ఒప్పందం అమలు పర్యవేక్షణ ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో జరగాలన్న నిబంధన కూడా ఈ ఒప్పందంలో ఉంటుందని తెలుస్తోంది. శరణార్థులకు స్వదేశంలో రక్షణ కల్పించాలని ఒప్పందంలో పేర్కొన్నారని సమాచారం. తిరుగుబాటుదారులతో కాంగో ప్రభుత్వం చర్చలకు సిద్ధమవ్వాలన్నది కూడా ఒక కీలక అంశం.

## పారిపోయా

(మొదటి పేజీ తరువాయి)

రెండు వారాల పాటు బెంగళూరులో తలదాచుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సిట్ అధికారులు తనకు కొన్ని కీలక ఆధారాలను చూపించారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీడియాకు తెలిపారు. గతంలో తాను జితేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణను అప్పటి అధికారి ప్రణీ త్ రావు రికార్డ్ చేశారని, ఆ ఆడియో క్లిప్‌ను సిట్ అధికారులు తన కు వినిపించారని ఆయన వెల్లడించారు. కొన్ని ఫోన్ కాల్స్‌ను ఉద్దేశపూర్వకగా డిలీట్ చేశారని ఆరోపించారు. కేవలం తమ పదవులను కాపాడుకోవడం కోసమే కేసీఆర్, కేటీఆర్ ఇంత నీచమైన ఫోన్ ట్యాపింగ్ చర్యలకు పాల్పడ్డారని, వారికి చట్టంపైన గానీ, వ్యక్తుల గోప్యతపైన గానీ ఏమాత్రం గౌరవం లేదని ఆయన తీవ్రస్థాయి లో ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో తన పై జరిగిన వేధింపులను కొం డా విశ్వేశ్వర్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. 'ఎన్నికల సమయంలో ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు నా ఇంట్లోకి చొరబడి కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తనిఖీ చేశారు. ఎందుకు తనిఖీ చేస్తున్నారని ప్రశ్నించినందుకు, నాపైనే రివర్స్‌లో దాడి చేశానంటూ కేసు బనాయించారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. నాపై నాన్‌బెయిల బుల్ కేసులు పెట్టి, ఎన్నికల తర్వాత అరెస్టు చేయాలని కుట్ర పన్నారు' అని ఆయన వివరించారు. అప్పటి డీజీపీనే తనను అరెస్టు చేస్తారని చెప్పడంతో, భయంతో రెండు వా రాల పాటు బెంగళూరులో తలదాచుకోవాల్సి వచ్చిందని కొండా తెలిపారు. 'ఒక తెలంగాణ ఉద్యమకారుడిగా ఉన్న నాకే ఈ పరిస్థితి ఎదురైంది. నా కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. నన్ను కలవడానికి వస్తున్న నా భా ర్య ఫోన్‌ను సైతం ట్యాప్ చేసి, ఆమెను ఫాలో చేశారు' అని ఆయన ఆరోపించారు. 2018 ఎన్నికల్లో ఓడిపోతామని ముందే గ్రహించిన కేసీఆర్, ఫోన్ ట్యాపింగ్ ద్వారా బెదిరింపులకు పాల్పడి గెలిచారని అన్నారు. ఇక భవిష్యత్తులో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రారని జోస్యం చెప్పారు. ఆంధ్రజ్యోతి దిన ప్రతిక అధిపతి రాధాకృష్ణ నుంచి కూడా సిట్ అధికారులు వాంగ్మూలం సేకరించారు.

## సమ్మెబాట

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి. అజయ్‌కుమార్‌తో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని డిఎంఇకి శుక్రవారం సమ్మె నోటీసును అందజేశారు. స్టైఫండ్‌ను పెంచి, గ్రీన్ ఛానల్ ద్వారా సమయానికి అందజేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల మౌలిక సదుపాయాల కల్పన విషయంలో సమీక్ష సమావేశంలో విద్యార్థుల నుంచి ఒక ప్రతినిధి ఉండాలని, కేలండర్ ప్రకారం ఫ్యాకల్టీలను తీసుకోవాలని, ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ వైద్య విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్‌మెంట్ సమయానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇది వరకే జూడా ప్రతినిధులు మంత్రి దామోదర రాజనర్సింహాతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేదని వారు వాపోయారు. మంత్రివర్గ సమావేశంలో తమ సమస్యలను చర్చించి పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేదని, అందుకే తాము సమ్మెబాట పట్టాల్సి వస్తుందని జూడాలు స్పష్టం చేశారు.

## అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం కోసం కాలేజీ ఆవరణలోని సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. కాలేజీ యాజమాన్యం ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో వివిధ వర్గాల ప్రజల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, బాధితురాలి ఫిర్యాదుతో జయిబ్ అహ్మద్ (19), మనోజిత్ మిశ్రా (31) అనే ఇద్దరు కాలేజీ వి ద్యార్థులను గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. వారిని విచారించిన అనంతరం ఇదే కాలేజీలో చదువుకున్న మాజీ విద్యార్థి ప్రమిత్ ముఖోపాధ్యాయ్ (20) ను పోలీసులు అతని నివాసంలో అరెస్టు చేశారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రమిత్ ముఖోపాధ్యాయ్‌ను ఈ కేసులో కీలక నిందితుడిగా చెబుతున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం చిత్తరంజన్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు.

### నిందితులకు రిమాండ్

ఈ కేసులో నిందితులను అలిపోర్ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, వచ్చే మంగళవారం వరకూ వారిని కోర్టు రిమాండ్‌కు పంపింది. నిందితుల్లో ఒకరైన మనోజిత్ మిశ్రా తృణ మూల్ కాంగ్రెస్ నాయకుడని చెబుతున్నారు. ఈ ఘ టనపై బిజెపి తీవ్ర విమర్శలు చేసింది. లా కాలేజీ వి ద్యార్థినిపై సామూహిక అత్యాచారం భయానకమని బిజెపి ఐటి సెల్ హెడ్ అమిత్ మాలవీయ పేర్కొన్నారు.

## భద్రత చట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రాష్ట్రాలలో గిగ్ వర్కర్లకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక, రాజస్థాన్ రా ష్ట్రాలలో ఇటీవల గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చా యి. కాగా హైదరాబాద్‌లో జరిగిన 'భారత్ సమ్మిట్'లో గిగ్ వర్కర్ల సమస్యలపై రాహుల్ స్పందిస్తూ గిగ్ వర్కర్లకు న్యాయం చేయాలని తెలంగాణ ప్ర భుత్వానికి సూచించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గిగ్ వర్కర్లకు చట్టం తీసుకువచ్చే దిశగా అడుగులు వేసింది. 'గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఉపాధి, పని పరిస్థితుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమ చర్య లు' లక్ష్యంగా ''తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) బిల్లు– 2025'' ముసాయిదాను రూపొందించి ప్రజ ల అభిప్రాయం కోసం పబ్లిక్ డోమెయిన్‌లో పెట్టింది. ''తెలంగాణ రాష్ట్రంలో గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఉపాధి, పని పరిస్థితుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమ చర్యలు చేపట్టడం, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సం క్షేమ బోర్డును స్థాపించడం, కార్మికుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయ డం, రాష్ట్రంలో గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్, అగ్రిగేటర్లను నమోదు చేయడం, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులను రక్షించడం, అవసరమైతే సామాజిక భద్రత, వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రతకు సంబంధించి ఆటోమేటెడ్ పర్యవేక్షణ, నిర్ణయం తీసుకునే వ్యవస్థలలో పారదర్శకత విషయంలో అగ్రిగేటర్ల (సంస్థలు)పై బాధ్యతలను ఉంచడం, వివాద పరిష్కార యంత్రాంగాలను ఏ ర్పాటు చేయడం, తీవ్ర దుర్బలత్వం, అనిశ్చిత పరిస్థితులలో పనిచేస్తున్న గి గ్, ప్లాట్‌ఫ్లామ్ కార్మికులకు తగిన పరిహారం అందించడం'' తదితర అంశాలను ఈ ముసాయిదాలో పొందుపర్చింది. ఈ ముసాయిదాపై గిగ్ వర్కర్లు, వారి సంఘాలు, ఫుడ్ డెలివరీ సంస్థల నుంచి వచ్చిన 66 సూచనలు, సమస్యలపై సంబంధిత అధికారులు, గిగ్‌వర్కర్ల సంఘాలు, ఫుడ్ డెలివరీ సంస్థ ల ప్రతినిధులతో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి చర్చలు జరిపారు. తద్వారా సమగ్రమైన ''తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫా మ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) బిల్లు– 2025'' రూపొందించే చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసింది.

### గిగ్ కార్మికులందరికీ కనీస వేతన హామీ ఇవ్వాలి : టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సలాఉద్దీన్

''తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు కొత్త విధానా న్ని తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే డ్రైవర్లు, డెలివరీ, వర్కర్స్, హోమ్ బేస్డ్ కార్మికులు అధిక శాతం అనిశ్చిత వేతనాలు, భద్రతా సమస్యలు, ఆరోగ్యం తదితర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిగ్ పాలసీలో వీటన్నింటికీ ప్రభుత్వం పరిష్కారాన్ని చూపాలి. గిగ్ డ్రైవర్లు, డెలివరీ వర్కర్స్, హోమ్ బేస్డ్ గిగ్ కార్మికులందరికీ కనీస వేతన హామీ ఇవ్వాలి. న్యాయబద్ధ గుర్తింపు, ప్రతి కార్మికుడి రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలి. ప్లాట్‌ఫామ్ కంపెనీలపై పారదర్శకత కోసం కట్టుదిట్టమైన నిబంధనలు రూపొందించాలి. బోర్డులో ప్రభుత్వ ప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులతో పాటు కార్మికుల ప్రతినిధులకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. కంపెనీలు, ప్రభుత్వ సహకారంతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి. కేవలం విధానాలు రూపొందిస్తే సరిపోదు. వాస్తవమైన హక్కులు, కనీస వేతనాలు, కార్మికుల ప్రాతినిధ్యం ఆచరణలో అమలు చేయాలి'' అని తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సలాఉద్దీన్ ''ప్రజాపక్షం''తో చెప్పారు.

## షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

రెండో విడత సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 2వ తేదీలోపు విద్యార్థులు రిపోర్టింగ్ చేసేందుకు అవకాశం కల్పించారు. ఇఎపిసెట్ పరీక్షలను ఏప్రిల్ 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షలు పూర్తవ్వగా, మే నెల 2, 3, 4వ తేదీల్లో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను పూర్తి చేశారు. ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో 81,198 మంది విద్యార్థులు పరీక్షల కు హాజరవ్వగా, ఇంజినీరింగ్ విభాగంలో 2.07 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లోని 124 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.

### ఆగస్టు 5 నుంచి మూడోవిడత

ఆగస్టు 5వ తేదీ నుంచి ఇఎపిసెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆగస్టు 6న ఇఎపిసెట్ ధృవపత్రాలను పరిశీలిస్తారు. ఆగస్టు 6,7వ తేదీల్లో తుది విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 10వ తేదీలోపు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. ఆగస్టు 11వ తేదీ నుంచి 13వ తేదీలోపు విద్యార్థులు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 18, 19వ తేదీల్లో ఇంటర్‌నల్ స్లైడింగ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 22లోపు ఇఎపిసెట్ ఇంటర్నల్ స్లైడింగ్ సీట్లను కేటాయిస్తారు.

## సమాజంలో మార్పు

(మొదటి పేజీ తరువాయి)

50 పడకల ఆసుపత్రి మాత్రమే ఉండేదన్నారు. ఇప్పుడు 250 పడకల ఆసుపత్రి వచ్చిందన్నారు. హుస్నాబాద్‌కు మెడికల్ పిజి కళాశాలను మంజూరు చేస్తున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ప్రతి నియోజక వర్గానికి ఒక నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో 150 పడల ఆసుపత్రి శంకుస్థాపన, 50 పడకల మాతా శిశుసంక్షేమ కేంద్రాన్ని, నాలుగు వరుసల రహదారులను శుక్రవారం మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ , కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే 16 నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే కొద్ది రోజుల్లో మరిన్ని నర్సింగ్ కళాశాలలు వస్తాయన్నారు.. రాబోయే కాలంలో సమాజంలో సంపూర్ణ మార్పు రావాలంటే మహిళ సాధికారత రావాలన్నారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళల్లో మార్పు అవశ్యమన్నారు. విద్యాధికులు రావాలని, మహిళ సాధికారత రావాలని ఆకాంక్షించారు. గత 50 ఏండ్లలో ఆసుపత్రిలో బెడ్ల సంఖ్య పెరగలేదని, ఇప్పుడు అదనంగా మాత శిశుసంక్షేమ ఆసుపత్రితో కలసి 250 పడకలు వచ్చాయన్నారు. శాతవాహన యూనివర్సిటీ 2009న వస్తే 19 ఏండ్ల తర్వాత హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల వచ్చిందన్నారు. 50 సీట్లతో మెడికల్ పిజి కళాశాలను హుస్నాబాద్‌కు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ సర్కార్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు.

### రూ.లక్ష కోట్లతో వ్యవసాయ సంక్షేమం : తుమ్మల



రాష్ట్రం ఆర్థిక విధ్వంసం నుండి బయటపడి వికాసం వైపు పయణిస్తుందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నేరవేరుస్తామని , తెలంగాణ అభివృద్ధి సంక్షేమంలో ముందుకు దూసుకపోతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. లక్ష కోట్లు వ్యవసాయ సంక్షేమం కోసం వెచ్చించినటు చెప్పారు. 40వేల కోట్లు రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. రైతుభరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్ కోసం లక్ష కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. నెల రోజుల్లో సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి చేత అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించనున్నట్లు

### సిఎం సహకారంతో హుస్నాబాద్ సమగ్రాభివృద్ధి : పొన్నం

సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, కేబినేట్ మంత్రుల సహకారంతో హుస్నాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిరకాలంగా ఎదురుచూస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్నట్లు చెప్పారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల తరగతులను హుస్నాబాద్‌లో ఈ సంవత్సరం నుండి ప్రారంభం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.రూ. 82 కోట్లతో 150 పడకల ఆసుపత్రి, 77 కోట్లతో రాజీవ్ రహదారి కొత్తపల్లి హుస్నాబాద్ రోడ్డు, రూ.11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశుసంక్షేమ ఆరోగ్య కేంద్రం ప్రారంభించుకున్నట్లు చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, తనను గెలిపించిన హుస్నాబాద్ గౌరవాన్ని మరింత పెంచుతానని మంత్రి పొన్నం హామీఇచ్చారు.

### రూ.80 కోట్లతో ఫోర్‌లేన్ జాతీయ రహదారి నిర్మాణం :కోమటిరెడ్డి

రూ.77 కోట్లతో హుస్నాబాద్ నుండి సుందరిగిరి వరకు ఫేజ్ కింద రోడ్డు విస్తరణ పనులను రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. సుందరిగిరి నుండి కొత్తపల్లి వరకు రూ. 80 కోట్లతో నాలుగు వరుసల రహదారి వారం రోజుల్లో మంజూరు అవుతుందన్నారు. మరో 10 రోజుల్లో పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎంఎల్‌ఎ కవ్వంపల్లి సత్యనారాయణ. గ్రంథాలయసంస్థ చైర్మన్ లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీనివాస్, గుండేటి శ్రీనివాస్,సూర్యవర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ తదిరతులు పాల్గొన్నారు.

### ఆగస్టులో రేవంత్‌రెడ్డితో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్టలో రూ. 300 కోట్లతో నిర్మిస్తున్న అయిల్‌పామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతిలు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రులు అయిల్ పామ్ తయారీ విధానం గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆగష్టు మొదటివారంలోపు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో అయిల్ పామ్ సాగుచేయాలన్నారు. కేంద్రం రైతాంగాన్ని నష్టపరిచే పరిస్థితి మంచిది కాదన్నారు. కేంద్రంపై వత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే దక్షిణ భారత రాష్ట్రాలు అయిల్‌పామ్ పండించే రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాన్ని కలసి ఇంపోర్టు డ్యూటీ తగ్గించేలా కృషిచేయాలన్నారు. టన్నుకు రూ.25 వేల మద్దతు ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఇంజనీరింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశీలించాకే...

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### గత ప్రభుత్వంలో పక్కన పెట్టిన ఆ 'విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్' నివేదిక

ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది,ఇతర వ్యవహారాలపైన గ త ప్రభుత్వం విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదికను కూడా రూపొందించింది. కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎటువంటి చర్య తీసుకోలేదు. పైగా తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి, మరి కొన్ని కళాశాలలకు మాత్రం పక్షపాత వైఖరితో మొండి చేయి చూపిందని సాక్షాత్తు అధికార వర్గాలే చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్ర భుత్వం నిర్ణయించింది. అయితే ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండ లి వైస్‌చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం పలు ఇంజనీరింగ్ కళాశాలలను ఆకస్మీకం గా తనిఖీ చేశారు. పలు కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయా లు లేకపోవడం, మరో కళాశాలకు తాళం వేసి ఉండడం, విద్యార్థుల హాజరు పట్టిక అందుబాటులో లేకపోవడం లాంటి అనేక డొల్లతనాలు వెలుగులోనికి వ చ్చాయి. దీంతో ఆయన చేసిన పలు సిఫార్సులు కూడా ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్టు సమాచారం.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 30న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయి మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ సహకారంతో ఈ నెల 30న ఉదయం 11గంటలకు జాబ్‌మేళా నిర్వహించనుంది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన 100పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డి ఫార్మసీ, బి ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన యువతీ యువకులకు (18 నుండి 35సం.ల వయసు వారికి) మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ. 12,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు టి.రఘుపతి, సెల్ నెంబర్ 8247656356ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరోవద్ద హాజరు కావాలని తెలిపారు.

### ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు

## ‘అత్యవసర వైద్యసేవలు’ అందించాల్సిందే!

### ప్రభుత్వ ఆస్పత్రులు ఇక నుంచి ‘ప్రైవేటు ఆస్పత్రులకు’ ఎక్స్ రే సిఫారసు చేయాలి



ప్రజాపక్షం/హైదరాబాద్: అత్యవసర వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫారసు చేయకుండా ఉచితంగా చికిత్స చేపట్టాలని ప్రైవేటు ఆస్పత్రులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. బోనాల ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌లోని ఆరోగ్య శ్రీ జాబితాలో ఉన్న అన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఇక నుంచి అత్యవసర సేవలను ఉచితంగా అందించాల్సిందేనని ఉత్తర్వులు జారీ అయినట్టు సమాచారం. కొందరు పేషంట్ల ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోతే వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అత్యవసర వైద్య సేవలు అందే సమయంలో పేషంట్లను ఇతర ఆస్పత్రులకు పంపించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణిస్తుంది, తద్వారా వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుందని ఇది వరకే పలు సందర్భాల్లో వైద్యఅధికారులు తెలిపారు. ప్రస్తుత బోనాల ఉత్సవాలు జరిగే సమయంలో ఎవరైనా అత్యవసర వైద్య సహాయం అవసరమైతే వారు తమ సమీప ప్రైవేటు ఆస్పత్రులకు వస్తే అలాంటి పేషంట్లను ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫారసు చేయవద్దని, అలాంటి టిబి పేషంట్లను టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా చికిత్స అందజేయాలని సూచించినట్టు తెలిసిం ది. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులు ప్రభుత్వ వైద్యు లు సిఫారసు చేసే వారికి ఉచితంగా ‘ఎక్స్‌రే’ తీయాలని కూడా ఆదేశించినట్టు తెలిసింది. అయితే హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన్ దాసరి ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు సర్క్యులర్‌ను జారీ చేసినట్టు తెలిసింది.

బోనాల ఉత్సవాల సందర్భంగా అత్యవసర వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో ఎంపానల్ మెంట్ అయిన ఆస్పత్రులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

కాగా టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వ వైద్యాధికారులు గుర్తించిన లబ్ధిదారులకు ఉచితంగా ఎక్స్‌రే సేవలు అందించాలని సూచించారు. ఎక్స్‌రే అవసరమున్న పేషెంట్లను ప్రభుత్వ ఆస్పత్రులు తమ సమీపంలోని ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ఆస్పత్రులకు సిఫార్సు చేయాలని సూచించారు. ప్రైవేటు. ప్రభుత్వ ఆస్పత్రుల విషయంలో వైద్యాధికారులను సమన్వయకర్తలుగా బాధ్యతలను అప్పగించినట్టు తెలిసింది.

### కృష్ణ, గోదావరి నదీ జలాలలో

## న్యాయం జరిగేంత వరకు పోరాటం

ఇరిగేషన్ శాఖపై గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంవత్సరానికి రూ.16వేల కోట్ల మిత్తి కడుతున్నాం

రాష్ట్ర నీటిపారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/నేరేడుచర్ల(పాలకవీడు):కృష్ణా, గోదావరి జలాల పంపకంలో గత పాలకుల అశ్రద్ధ వల్ల తెలంగాణ రైతాంగానికి అన్యాయం జరిగిందని దానిని సరిచేసేందుకు మేము పోరాడుతున్నామని రాష్ట్రనీటిపారుదల శాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలకవీడు మండలం జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్, బెట్టేతండా గ్రామంలో మూసినదిపైన నిర్మిస్తున్న బెట్టెతండా స్కీం పనులను ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు పదేళ్ల నిర్లక్ష్యం చేయడంతో కృష్ణానదిలో 811 టిఎంసిలలో ఆంధ్రకి 599 టియమ్ సిలు, తెలంగాణకు 299 టియంసిలకు రాత పూర్వకంగా ఒప్పుకున్నారని, కాని మేము వచ్చాక నదీ పరివాహక ప్రాంతం, ఆయకట్టు, జనాభాను పరిగణలోకి తీసుకుని నీటి కేటాయింపులు చేయుటకు పోరాడుతున్నామని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద రూ.38వేల కోట్లతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టుని ప్రారంభిస్తే కమిషన్‌లకి కక్కుర్తిపడి లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం పేరుతో నిర్మిస్తే మూడేళ్లకే కూలిపోయిందని, అదే తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే రూ.62వేల కోట్ల రూపాయలు మిగిలేవని, వాటితో ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు, రంగారెడ్డి, బీమా, నెట్టెంపాడు, కోయిలసాగర్, దేవాదుల, సీతరామసాగర్, గౌరెల్లి లాంటి ప్రాజెక్టులు పూర్తయ్యి నేడు తెలంగాణ సస్యశ్యామలం అయ్యేదని, కాని ఇరిగేషన్ శాఖపై వారు చేసిన తప్పిదాల వల్ల నేడు మేము రూ.16వేల కోట్ల రూపాయలు వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. పాలమూరు, రంగారెడ్డి రూ.27,500కోట్లు, సీతరామ ప్రాజెక్టు రూ.పదివేల కోట్లు ఖర్చు చేసిన ఒక ఎకరం కొత్త ఆయకట్టులోకి తీసుకొని రాలేదని అన్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు చేశాక ముఖ్యమంత్రి నేను నీటిపారుదల శాఖలో జరిగిన తప్పిదాలను ఒక్కొక్కటి సరి చేసుకుంటూ కాళేశ్వరం నీరు ఇవ్వకున్నా తెలంగాణలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో కలిపి 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచేందుకు ముందస్తుగా రైతులకు పెట్టుబడి కోసం 9రోజులలో రూ.9వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద వేయడం జరిగిందని తెలిపారు. జవహర్ జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన వేగవంతంగా, నాణ్యతగా పాటిస్తూ పూర్తి చేయాలని మంత్రి కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. పనులు చాల నెమ్మదిగా జరుగుతున్నాయని ఇప్పటికే మూడుసార్లు సందర్శించిన పనులలో పురోగతి లేదని కాంట్రాక్టర్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల కోసం జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్ స్కీంను రూ.302 కోట్ల రూపాయలతో నిర్మించడం జరుగుతుందని అన్నారు. దీని ద్వారా అలింగపురం, రాఘవపురం, బొత్తల పాలెం, కొమటికుంటతండా, మీగడం పాడు, చెరువుతండా, హనుమయగూడెం, పాలకవీడు, సజ్జాపురం, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లోని పదివేల ఎకరాలకు సాగునీరు అలాగే జాన్‌పహాడ్ చెరువుకు నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. డిజైన్‌లో ఏమైనా మార్పులుంటే సిఇ ద్వారా చేసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, పైపులైన్ పనులు ఒకేసారి నిర్మించి త్వరగా పనులు చేసి అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. తదుపరి రూ.33.83 కోట్లతో నిర్మించే బెట్టేతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. జాన్‌పహాడ్, బెట్టేతండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పూర్తయితే పాలకవీడు మండల సస్యశామలం, సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, సిడిఓసిఈ, ఆర్డీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ సిఇ రమేష్‌బాబు, ఎస్‌ఈ శివ ధర్మతేజ, డిఈ నవికాంత్, హరికిషోర్, సతీష్ పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మొత్తం రూ.180.38 కోట్లు విడుదల చేసిన సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాభవన్‌లో ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు డిప్యూటీ సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. రోజుల వ్యవధిలోనే డిఎల ఉత్తర్వులు విడుదల చేయడం, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రణాళిక శాఖలో క్యాడర్ సంఖ్య పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం, ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ ఇన్స్యూరెన్స్ పథకం, ప్రమోషన్లకు సంబంధించి వివిధ శాఖల్లో డిపిసి కమిటీలు వేగంగా పనిచేయడం పై ఉద్యోగ సంఘాల జెఎసి నేతలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు, నాయకులు చావా రవి, సదానంద గౌడ్, కస్తూరి వెంకట్ లు పాల్గొన్నారు.

## పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్ : తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఫలితాలను ఇవాళ విడుదల చేసింది. 38,741మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. వీరిలో 73.35శాతంతో 24,415మంది ఉత్తీర్ణత సాధించినట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కృష్ణారావు ప్రకటించారు.

## ఇందిరమ్మ ఇళ్ళకోసం మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/వైరా: ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక ఓ మహిళ ప్రాణాల మీదకు తెచ్చుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన వైరా మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే వైరా మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు గండగలపాడులో కొనకల్ల ఉషారాణి అనే మహిళ తనకి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావాలని ఓ కాంగ్రెస్ నాయకుడు వద్దకు వెళితే నీకు ఇళ్లు ఇవ్వడం రాదంటూ తనను దూషించాడని మనోవేదనతో కాలం చెల్లిన మందులు టాబ్లెట్స్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్థులు కొనకళ్ల ఉషారాణిని వైరా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యు లు చికిత్స అందించి మెరుగైన వైద్యసేవలకోసం ఖమ్మం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.



బాధ్యత మహిళా కనకళ్ల ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామంలోనే ఉంటున్నానని తనకు ఉండటానికి ఇళ్లు లేదు. అద్దెకు రేకుల ఇంట్లో ఉంటున్నానని ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుని ఇంటికి వెళ్లి తనకు ఇళ్లు కావాలని అడిగానని ఆ నాయకుడు నాపై దూషించి నీకెందుకు ఇళ్లు ఇవ్వాలి, నీకు ఇళ్లు రాదు మాకు నచ్చిన వారికి ఇస్తానని దూషించడంతో మనస్థాపానికి గురై మందులు మింగడం జరిగిందని ఆమె తెలిపింది.

గ్రామంలో 64 మంది ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారులుగా అర్హులుగా ఉన్నట్టు గుర్తించారు. అందులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారికి నచ్చిన విధంగా 30 మందిని ఎంపిక చేసి అధికారులకు పంపించడం జరిగింది. వాటిలో 20 మందిని అధికారులు ఫైనల్ చేయడం జరిగింది. మహిళ ఆత్మహత్య ఎత్తడానికి ప్రయత్నించిన సంఘటనతో గండగపాడు గ్రామానికి చెందిన ప్రజలు వైరా మున్సిపాలిటీ వద్ద ఆందోళన చేపట్టి నిజమైన అర్హులకు ఇళ్లు ఇవ్వాలని వినతిపత్రం అందించారు.

### కాలుష్య నియంత్రణ మండలిలో..

## అప్పీలేట్ అథారిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాలుష్య నివారణ, నియంత్రణకు సంబంధించి ఉత్తర్వులపై అప్పీళ్ల ను విచారించటానికి నూతనంగా అప్పీలేట్ అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పా టు చేసింది. నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ)చట్టం, 1974, వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం, 1981 ప్రకారం, పర్యావరణ అనుమతులు, కాలుష్య నియంత్రణ ఉత్తర్వులపై వచ్చిన అప్పీళ్లను పరిష్కరించేందుకు రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ (ఈఎఫ్ ఎస్,టి) జి.ఓనెంబర్ 48 ద్వారా గత నెల 29వ తేదీన తెలంగాణ కాలుష్య నియంత్రణ అప్పీలేట్ అథారిటీ (టిజి పిసిఎఎ)ను రెండేళ్ల కాలానికి ఏర్పాటు చేసింది. వచ్చేనెల 5వ తేదీ నుండి పూర్తిస్థాయిలో కార్యాకలాపాలు ప్రారంభించింది.

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండ లి (టిజిపిసిబి) జారీ చేసిన ఉత్తర్వులపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నాయని భావించినవారు ఈ అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించవచ్చు.

**సభ్యులు..**

హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సాంబశివరావు నాయుడు చైర్మన్‌గా, సభ్యులుగా కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గాడె దయాకర్ వ్యవహరించ నున్నారు.

**టిజి – పిసిఎఎ కార్యాలయం..**

గగన్‌విహార్ భవనం, 1వ అంతస్తు, గాంధీభవన్ ఎదురుగా, నాంపల్లి, హైదరాబాద్.

విచారణలు అధికారం నోటీసు బోర్డుపై ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నారు.

**మరింత సమాచారం కోసం:** ఇమెయిల్ :tspcaa540@gmail.com, ఫోన్: 04029300779 టిజి పిసిబి అధికారులు తెలిపారు.

## కులహింస, మానవాళిపై ప్రత్యక్ష దాడి

- ఒడిశా, యుపిల్లో బడుగులపై వివక్షకు సిపిఐ ఖండన
- దోషులపై తక్షణ చర్యల కోసం ఎన్‌హెచ్‌ఆర్‌సికి వినతిపత్రం



న్యూఢిల్లీ: కుల హింస అన్నది రాజ్యాంగంపై, మానవాళిపై ప్రత్యక్ష దాడి అని సిపిఐ పేర్కొంది. బాధితులకు సత్వర న్యాయం, హేయమైన ఘటనలు జరిగిన రాష్ట్రా ప్రభుత్వాల నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసింది. సామాజిక న్యాయం, సమానత్వం కోసం తమ పోరాటం ఆగబోదని తేల్చిచెప్పింది. ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లో బలహీన వర్గాల వారిపై అగ్రకులస్తుల దాడులను అమానవీయంగా వర్ణించింది. వీటిపై తక్షణ చర్యలు కోరుతూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్, జస్టిస్ వి.రామసుబ్రమణ్యన్‌కు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పార్టీ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అనీరాజా, రామకృష్ణ పాండా, పల్లబ్‌సేన్ గుప్తా ఉన్నారు. ఒడిశాలోని గంజాం జిల్లా, ధారకోటేలో ఇద్ద రు దళితులపై భౌతిక దాడి, బలవంతపు శిరోముండనం, గడి తినిపించడం, మురికి నీరు తాగించడం... ఉత్తరప్రదేశ్, ఇట్టావాలో ఇద్దరు ఒబిసిలకు శిరోముండనం, దాడి, వారిపై అగ్రవర్ణాల వారు మూత్రవిసర్జన చేయడంపై సిపిఐ బృందం ఆవేదన వ్యక్తంచేసింది. అవమానకర చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేలా ఆదేశాలివ్వాల ని కోరింది. వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు సామాజిక వర్గాలను ప్రభావితం చేసే హేయమైన నేరాలకు కులాధారిత ఆధిపత్యమే కారణమని పేర్కొంది. అణగారిన వర్గాల రక్షణకు తక్షణమే పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విన్నవించింది. జాతీయ నేరా ల నమోదు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలను ప్రస్తావిస్తూ ఒక్క 2022 సంవత్సరంలో నే ఎస్‌సీలపై 57,571 దురాగతాల కేసులు నమోదైనట్లు రామసుబ్రమణ్యన్ దృష్టికి సిపిఐ నాయకులు తీసుకెళ్లారు. కుల హింస పెరగడం సంస్థాగత వైఫల్యమని నొక్కిచెప్పా రు. రాజ్యాంగం హామీనిచ్చే సమానత్వం, గౌరవ జీవితానికి ఇవి విరుద్ధమన్నారు. పౌర హక్కుల రక్షణ చట్టం1955, ఎస్/ఎస్‌టీ (దురాగతాల నివారణ) చట్టం సక్రమంగా అమలు కాకపోవడం, సంస్థాగత నిర్లక్ష్యం జరుగుతుండటానికి తోడుగా రాజకీయపరమైన మౌనం కూడా కుల హింసను ప్రోత్సహిస్తున్నదన్నారు. బలహీన వర్గాలపై వివక్ష, హేయమైన నేరాలు అరికట్టాలని, దోషులను నిర్దేశిత కాలంలోగా కఠినంగా శిక్షించాలని, ఇందుకోసం రాష్ట్రాల ప్రభుత్వాలకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సిపిఐ నాయకుల విజ్ఞప్తికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్స న్ సానుకూలంగా స్పందించారు. తక్షణమే తగు చర్యలను కమిషన్ చేపడుతుందని హామీనిచ్చారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపణ

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను సకాలంలో విడుదల చేయకుండా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంటరెడ్డి, ప్రధానకార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ ఆరోపించారు. 2022–23, 2023–24,2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన బకాయిలు ఉన్న దాదాపు రూ.6 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం పూర్తయినప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల ఇబ్బందులు పడుతున్నారని, అనేక కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నాయని వారు వివరించారు. కొందరు తల్లిదండ్రులు తమ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అప్పులు చేసి మరీ ఫీజులను చెల్లిస్తున్న పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సిఎం రేవంత్ రెడ్డి కూడా మాట తప్పుతున్నారని తెలిపారు. పదిరోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎలు, మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ హెచ్చరించారు.

## బిజెపి పాలకులను మించిపోయిన సిఎం రేవంత్‌రెడ్డి

ఎఐటియుసి అధ్యక్షుడు ఎస్.బాలరాజ్

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్రంలోని నాలు గు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తగా సార్వత్రిక సమ్మెకు సిద్ధపడుతుంటే, తెలంగా ణ, కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వాలు మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలరాజ్ మండిపడ్డారు. ఉద్యోగ, కార్మికులకు 24 గంటలలో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల వినోదాన్ని నేటికి అమలు చేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రి బడా పారిశ్రామికవేత్త కావడంతో కార్మికుల పని గంటలను పెంచి బిజెపి పాలకులను మించిపోయారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి ఇద్దరూ గతంలో బిజెపితో ఉన్న తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సంఘటిత అసంఘటితరంగ కార్మికులు జూలై 9న జరగనున్న దేశ వ్యాపిత సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బాల్‌రాజ్ కోరారు. మే 1,1886 సంవత్సరంలో కార్మికులు 8 గంట ల పనిదినం అమలు చేయాలని చేసిన మహా సమ్మె ప్రదర్శనపై పెట్టుబడిదారుల సైన్యం జరిపిన కాల్పులలో 8 మంది ప్రాణాలు కోల్పోతే, నేటికీ ప్రపంచ వ్యాపితంగా మేడే కార్యక్రమం జరుగుతున్నాయని బాల్‌రాజ్ గుర్తుచేశారు. అందుకే ప్రభుత్వాలు తప్పనిసరి పరిస్థితులలో 8 గంటల పనిదినాన్ని ఆనాటి నుండి నేటికీ అమలు చేస్తున్నాయన్నారు. అనేక పోరాటాలతో సాధించుకున్న 44 కార్మి క చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 చట్టాలను సమూలంగా సవరించి, 4 కోడ్లు తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ, భారత కార్మిక వర్గం కేంద్ర ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేస్తోందని వివరించారు.

ఇప్పటికే ఉద్యమాలు, సదస్సులు, సభలు, సమావేశాలు నిర్వహించామని, 27సార్లు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలు నిర్వహించామని బాలరాజ్ వివరించారు. దీంతో కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయకుండా, అమలు చేయకుం డా ఉన్నదని, మరో వైపు కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలు 8 గంటల నుండి 10 గంటల పని దినాన్ని చేసే విధంగా పావులు కదపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

## సాగునీటి రంగాన్ని రాజకీయం చేయవద్దు

హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణకు ప్రాణాధారమైన సాగునీటి రంగాన్ని సిఎం తన రాజకీయ అజెండాలకు బలి చేయవద్దని, మేడిగడ్డ బ్యారేజీపైన దుష్ప్రచారాన్ని ఆపేసి, ఇకనైనా ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన లేక, తెలంగాణ సాగునీటి రంగాన్ని కాంగ్రెస్ సంక్షోభంలోకి నెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరవాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణ పనులు ముందుకు పోక, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన రాక, తెలంగాణ సాగు నీటిరంగం సంక్షోభంలోకి వెళ్తున్నదని ఆరోపించారు. ఏడాదిన్నర పాలనలో జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని చెప్పారు.

మేడిగడ్డ కుంగిన వెంటనే ఎన్‌డిఎస్‌ఎకు లేఖరాసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న ప్రాజెక్టుల ప్రమాదాలు ఎందుకు కనిపించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేడ్చెల్ జిల్లా దుండిగల్ పరిధిలో జరిగిన హృదయవిదారకమైన రోడ్డు ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని హరీశ్‌రావు అన్నారు. ఐదేళ్ల బాలుడు టిప్పర్ చక్రాల కింద దుర్మరణం చెందడం దారుణమన్నారు. బాబు కుటుం బ సభ్యులకు హరీశ్‌రావు తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. భారీ వాహనాలను పరిమిత సమయంలోనే హైదరాబాద్ నగరంలోకి అనుమతించాలన్న నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని హరీశ్‌రావు కోరారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్ఎంసి.

NIT No. 15/EE-Div-29/SBZ/GHMC/2025-26 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 26.06.2025

**పని పేరు:** (1) జిహెచ్ఎంసి, ఎస్‌బిజెడ్, సికింద్రాబాద్, డివిజన్ 29 లోని అన్ని వార్డులలో జూలై 2025 నుండి అక్టోబర్ 2025 వరకు సిసి రోడ్ల నిర్వహణ తుఫాను నీటి కాలువలు (క్యాచ్పిట్ మరమ్మతులు) **- 5 పనులు, అంచనా విలువ / ఇసివి:** రూ.41.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 27.06.2025న సా.04.00గం.ల నుండి 01.07.2025న ఉ.10.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్. ఫోన్ నెం. 7995468066. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 4247-PP/CL/ADVT/1/2025-26, Date: 27-06-2025

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాయలం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com

No. E1/DB/MCK/8201/219/MCK/2025-26 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.06.2025

**కరీంనగర్ టౌన్‌లో వివిధ ప్రదేశాలలో 06 నెం.ల పనులకు అభివృద్ధి మరియు నిర్వహణ. అంచనా విలువ: వివిధ గ్రాంట్ల కింద రూ.122.50 లక్షలు,** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 28.06.2025న సా.04.00గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 07.07.2025న సా.04.00గం.ల వరకు, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 4257-PP/CL/ADVT/1/2025-26, Date: 27-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
జెడ్‌సిటిఓ, చార్మినార్ జోన్.

NIT No. 07/ZCTO/CRZ/GHMC/2025-26 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.06.2025

**పని రకం:** మొహర్రం మరియు బోనాలు పండుగ - 2025 లను దృష్టిలో ఉంచుకుని 120 మైక్రాన్లు, 35L x 45W LLDPE బ్లాక్ పాలిథిన్ కవర్ల సేకరణ, నీటి ట్యాంకర్‌ను నిమగ్నం చేయడం మరియు పోర్టబుల్ మొబైల్ టాయిలెట్లను నిమగ్నం చేయడం. **అంచనా విలువ:** రూ.20.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 28.06.2025న ఉ.11.00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది:** 01.07.2025న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** జెడ్‌సిటిఓ, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 9849906768. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

**గమనిక:** టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఇఎండి పొందాలి.

సం/- జెడ్‌సిటిఓ, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 4275-PP/CL/ADVT/1/2025-26, Date: 27-06-2025

ప్రజాపక్షం
శనివారం, 28 జూన్

# నాటో ఇప్పుడు గ్లోబల్ అలయెన్స్

జూన్ 24, 25 తేదీల్లో హేగ్ (నెదర్లాండ్స్)లో జరిగిన నాటో (ఉత్తర అట్లాంటిక్ కూటమి) అగ్రనాయక సమావేశం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు లొంగుబాటు ప్రదర్శించింది. జనవరిలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన రోజు నుండీ ట్రంప్–యూరప్ దేశాల మధ్య కనిపించిన ఉద్రిక్తతలు చల్లబడిపోయాయి. యూరప్ అమెరికాపై ఆధారపడి బతుకుతోందని నిందించిన ట్రంప్ ఆ మిత్ర దేశాల నుంచి అమెరికన్ దిగుమతులపై సుంకాలను భారీగా పెంచుతున్నట్లు ప్రకటించి వాటిని కృంగదీశాడు. యూరప్ రక్షణకు ఉద్దేశించిన నాటో కూటమి రక్షణ వ్యయానికి తమ వాటాను తగ్గిస్తామని హెచ్చరించాడు. వచ్చే ఐదేళ్లలో యూరప్ దేశాలు తమ రక్షణ వ్యయాన్ని తమ జిడిపిలో 5 శాతానికి పెంచాలని, లేకపోతే వాటి రక్షణను అవే చూచుకోవాలని దబాయించాడు. ఒకపక్క హెచ్చు సుంకాలతో వ్యాపార నష్టం, రెండోవైపున రక్షణ వ్యయం పెంపుదల యూరప్ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. బీరాలు పలికిన బ్రిటన్ ప్రధాని స్టార్మర్ అందరికన్నా ముందుగా చల్లబడి అమెరికాతో కొత్త వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైనాడు. తర్వాత పెద్ద ఆర్థిక వ్యవస్థలైన జర్మనీ, ఫ్రాన్స్ వృద్ధిరేటు మందగించి సంక్షోభం అంచున ఉన్నప్పటికీ ట్రంప్ ఒత్తిడికి లొంగక తప్పలేదు. రక్షణ వ్యయాన్ని 2035 నాటికి జిడిపిలో 5 శాతానికి పెంచటానికి నాటో హేగ్ శిఖరాగ్ర సభ ఆమోదం తెలియజేసింది. స్లొవేకియా, స్పెయిన్ అన్యమనస్కంగా సంతకం చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం వచ్చే దశాబ్దకాలంలో సైనికీకరణపై నాటో 3 ట్రిలియన్ డాలర్లు వెచ్చిస్తుంది. అంటే వాటి రక్షణ వ్యయం ఇప్పటికన్నా రెట్టింపు అవుతుంది. ఈ వనరుల సమీకరణ కోసం అవి పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక సేవలు, మౌలిక వసతులపై ఖర్చులో కోత విధిస్తాయి. ప్రపంచ యుద్ధానంతర యూరప్ చరిత్రలో సామాజిక కార్యక్రమాల్లో తీవ్రమైన కోతల విధింపునకు ఇది దారి తీస్తుంది. ఈ భారం సామాన్యులపైనే ఎక్కువగా పడుతుంది. ప్రజాస్వామ్యం, సంక్షేమం లక్ష్యాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది

ఇంత భారీగా రక్షణ వ్యయం 'ఆత్మ రక్షణ' కోసం అని సమర్థించుకోవడం సాధ్యం కాదు. అమెరికా దురాక్రమణపూరిత ప్రపంచ ఆకాంక్షలకు తోడ్పాటునివ్వటమే అవుతుంది. యూరప్ రాజ్యాలు ఇప్పటికే ఉక్రేన్–రష్యా యుద్ధంలో ఉక్రేన్‌కు సంపూర్ణ సైనిక మద్దతు ఇస్తున్నాయి. ఆయుధాలు, డబ్బు కుమ్మరిస్తున్నాయి. కాగా అరుదైన భూగర్భ ఖనిజాలను ట్రంప్ కొట్టుకెళుతున్నాడు. మధ్య ప్రాచ్యం వచ్చేసరికి ఇజ్రాయెల్ దురహంకార గాజా యుద్ధాన్ని, ఇరాన్‌పై బరితెగించిన బాంబుదాడులను అమెరికాతో పాటు సమర్థిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం వరకు ఆఫ్ఘనిస్తాన్‌లో మిత్ర రాజ్యాల పేరుతో అమెరికాకు తోడుగా సైన్యాన్ని దించాయి. ఆచరణలో తేలేదేమంతో అంతర్జాతీయ వ్యవహారాల్లో—సైనిక జోక్యాలు సహా— అమెరికాను అనుసరించడం మినహా యూరప్ దేశాలకు గత్యంతరం లేదు. అటువంటప్పుడు 'ఆత్మరక్షణ' అంటూ తమ ప్రజల్ని నమ్మించాలంటే ఏదోక బూచి కావాలి. ఒకప్పుడు 'కమ్యూనిజం' బూచి. ఇప్పుడేమో రష్యా దురాక్రమణ యుద్ధ బూచి.

అసలు నాటో అవసరం ఉందా? సోవియట్ యూనియన్ సమఉజ్జీగా ఆవిర్భవించిన కాలంలో 'సోవియట్ భూతాన్ని' ఎదుర్కోవడానికి 'ఆత్మరక్షణ' పేరుతో దురాక్రమణ పూరిత నాటో కూటమిని అమెరికా ఏర్పాటు చేసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిన స్థితిలో తమ రక్షణను నాటో ద్వారా అమెరికాకు అప్పగించిన యూరప్ ఆర్థిక పునర్నిర్మాణంపై దృష్టి పెట్టాయి. కాల గతి మారింది. సోవియట్ యూనియన్ దాంతోపాటు వార్సా సంధి కూటమి కూలిపోయిన అనంతరం ఇక నాటో ఎందుకు? నాలుగు దశాబ్దాల నుంచి ఏ కమ్యూనిస్టు భూతం ఎదురు లేదు. అయితే ప్రపంచంపై అమెరికా ఆధిపత్య సాధనకు పావుగా నాటో ఉపయోగపడుతున్నది. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రత్యామ్నాయ వేదికల నిర్మాణంతో ప్రపంచ జిడిపిలో ఆధిక్య స్థానంలోకి చేరుకున్నాయి. అమెరికా, యూరప్ బెదిరింపులకు లొంగిపోయే కాలం అంతరించింది. అందువల్ల నాటో కూటమి రద్దు నేటి ప్రపంచ పరిస్థితులకు అనుగుణం. అమెరికా, యూరప్ దురాక్రమణ, ఆధిక్య ఆకాంక్షలు ఇకపై చెల్లుబాటు కావు. సుంకాల పెంపుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కల్లోలపరిచిన ట్రంప్ నేల మీదికి దిగిరావడంలో ఇదే స్పష్టమవుతున్నది.

అయితే హేగ్ సమావేశానికి ఉక్రేన్ అధ్యక్షుడినేగాక ఆస్ట్రేలియా ప్రధాని అంటోనీ ఆల్బనీస్, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, న్యూజిలాండ్ ప్రధాని క్రిష్టఫర్ లుక్సోన్, దక్షిణ కొరియా ప్రధాని లీజె మయూంగును ఆహ్వానించటం ద్వారా నాటో ఉత్తర అట్లాంటిక్ నుంచి విశ్వవ్యాప్త కూటమి అయింది. ఇది ప్రపంచ శాంతికి, అభివృద్ధికి అత్యంత ప్రమాదకరం.

# షియా ఇరాన్ చేతిలో అణ్వస్త్రంపై పాశ్చాత్య దేశాల ఆందోళన

**నంటూ బెనర్జీ**

ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా మాత్రమే ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని నమ్మడం బహుశా తప్పు కావచ్చు. అణు వ్యాప్తి, అణు స్మగ్లింగ్, అవి తప్పుడు చేతుల్లోకి వెళ్లడం గురించి ప్రపంచం మొత్తం ఆందోళన చెందుతోంది. ఇరాన్ పాలన స్వభావం ఈ ఆందోళనకు మరింత ఆజ్యం పోసింది. ప్రపంచంలో ఒక ఆధ్యాత్మిక నాయకుడి ప్రత్యక్ష నియంత్రణలో నడుస్తున్న ఏకైక ప్రధాన దేశం బహుశా ఇదే కావొచ్చు. ఇది చాలా మంది ఆందోళనలకు కారణం కావొచ్చు. పోప్ ఆధ్వర్యంలోని వాటికన్ సిటీ స్టేట్ ఆఫ్ రోమ్, దాని రక్షణ దళంగా స్విస్ గార్డు అనే చిన్నపాటి లాంఛనప్రాయ విభాగాన్ని మాత్రమే కలిగి ఉంది. ఇది పోప్ వ్యక్తిగత అంగరక్షక దళంగా కూడా పనిచేస్తుంది. పోప్ సాధారణంగా ప్రేమ, కరుణ, ప్రపంచ శాంతిని బోధిస్తారు.

> ఇరాన్‌ను షియా మత గురువు, అయతొల్లా అలీ ఖమేనీ పాలిస్తున్నారు. షియా ఆధిపత్యాన్ని ఆయన సమర్థిస్తున్నారు. సున్నీ ఇస్లామిక్ వర్గానికి చెందిన పాకిస్తాన్ అణ్వాయుధ దేశంగా మారినప్పటి నుండి షియా ఇరాన్ అణ్వాయుధాలను నిర్మించాలని ఆకాంక్షిస్తున్నట్లు భావిస్తున్నారు. ఇరాన్ ఒక బలమైన మతపరమైన షియా వ్యవస్థను కలిగిన ఇస్లామిక్ గణతంత్రం. అది ప్రపంచ వ్యాప్తంగా షియా దేశాలు, షియాలపై గొప్ప ప్రభావాన్ని చూపుతుంది. దీనికి విరుద్ధంగా, సున్నీ ఇస్లామిక్ ఆలోచన, న్యాయశాస్త్రంలో అత్యున్నత అధికారంగా పరిగణించబడే అల్–అజార్ ప్రస్తుత గ్రాండ్ ఇమామ్ అహ్మద్ ఎల్–తాయెబ్ రాజకీయ వ్యక్తిగా ప్రసిద్ధి చెందలేదు.

ముస్లిం ప్రపంచంలోని 57 దేశాలలో (ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్ సభ్యులు) షియా జనాభా మెజారిటీగా ఉన్నవి కేవలం మూడు దేశాలు మాత్రమే. అయినప్పటికీ, ఎక్కువగా ప్రత్యర్థి సున్నీ వర్గం నాయకత్వంలోని అనేక ఇతర ముస్లిం దేశాలలో ఈ వర్గానికి గణనీయమైన ఉనికి ఉంది. షియా– సున్నీ వైరం ఇరాన్ అణ్వాయుధ దేశంగా ఆవిర్భవించాలనే ఆశయాన్ని ఒక ప్రధాన భౌగోళిక రాజకీయ ఆందోళనగా మారుస్తుంది. ముఖ్యంగా పశ్చిమ, మధ్య ఆసియాలో, అలాగే దక్షిణాసియా, ఆగ్నేయాసియాలో, గణనీయమైన ముస్లిం జనాభా ఉన్న యూరోపియన్ దేశాలలో ఈ ఆందోళన ఉంది. మూడు షియా మెజారిటీ దేశాలు: ఇరాన్, ఇరాక్, అజర్‌బైజాన్. గణనీయమైన షియా సముహాలు నివసిస్తున్న దేశాలు: బ్రహెయిన్, లెబనాన్, కువైట్, టర్కీ, యెమెన్, సౌదీ అరేబియా, ఆఫ్ఘనిస్తాన్ , భారత ఉపఖండం.

సున్నీ సమూహం నేతృత్వంలోని పాకిస్తాన్ అణు పాటవం పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలకు, అలాగే భారతదేశానికి ఎల్లప్పుడూ ఒక ప్రధాన ఆందోళనగా ఉంది. 'పాకిస్తాన్ అణు బాంబు పితామహుడు' దివంగత అబ్దుల్ ఖదీర్ ఖాన్, అణు సాంకేతిక పరిజ్ఞానం స్మగ్లింగ్‌లో ప్రసి ద్ధి చెందారు. తాను అణు విస్తరణ నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లుగా ఆయన అధికారికంగా అంగీకరించారు. ఇరాన్, లిబియా, ఉత్తర కొరియాకు అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని విక్రయించినట్లు అంగీకరించిన తర్వాత ఆయనను మొదట 2004లో గృహ నిర్బంధంలో ఉంచారు. ఆ తర్వాత 2009లో ఎ.క్యు.ఖాన్ విడుదలయ్యారు. ఇరాన్ అణ్వాయుధాలు, సాంకేతిక



పరిజ్ఞానాన్ని ఇతర దేశాలతో లేదా ఉగ్రవాద సమూహాలతో సహా ప్రభుత్వేతర సంస్థలతో పంచుకోవచ్చని ఇప్పటికే ఉన్న అణ్వాయుధ దేశాలు చాలా వరకు భయపడుతున్నాయి. ఇది విస్తృతంగా అణుశక్తి వ్యాప్తికి దారితీస్తుంది.

షియా అత్యున్నత ఆధ్యాత్మిక నాయకుడి నేతృత్వంలో ఇరాన్ ప్రభుత్వ స్వభావం, ఒక ప్రధాన అణుశక్తి ఆవిర్భవించాలనే దాని ఆశ రాజ్యాంగా, ఇస్లామేతర దేశాలకు ప్రధానంగా ఆందోళన కలిగిస్తుంది. ఇజ్రాయెల్ 'నిర్మూలన' అనేది ఇరాన్ అత్యున్నత మత గురువుల ప్రాథమిక ఎజెండా అని చెప్పబడుతున్నందున, చిన్న యూదు దేశమైన ఇజ్రాయెల్ తీవ్ర ఆందోళనలో ఉంది. ఇరాన్ విధ్వంసకర ఆయుధాలైన దీర్ఘశ్రేణి క్షిపణులు, డ్రోన్లు ఒక ఆధ్యాత్మిక మత గురువు చేతిలో ఉన్నందున పాశ్చాత్య ప్రపంచం ఆందోళన చెందుతోంది. పశ్చిమ ఆసియాలో ఇరాన్ అతిపెద్ద, అత్యంత వైవిధ్యమైన బాలిస్టిక్ క్షిపణి నిల్వను కలిగి ఉందని నమ్ముతారు. ఇరాన్ తన సైనిక దాడుల సామర్థ్యాలను ప్రదర్శిస్తోంది. దేశ ఆధ్యాత్మిక అధిపతి, సర్వోన్నత నేత 'నరక ద్వారాలను' తెరవడానికి ప్రతినబూనారు. గత వారం ఎక్కువ భాగం ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులు చిన్న యూదు దేశమైన ఇజ్రాయెల్ ఆకాశాన్ని ప్రకాశవంతం చేశా యి. ఇది ఇరాన్ భౌగోళిక పరిమాణంలో కేవలం 1.33 శాతం మాత్రమే. ఇరాన్ జనాభా 8.7 కోట్లు కాగా ఇజ్రాయెల్ మొత్తం జనాభా సుమారు 98 లక్షలు.

ఇరాన్ అత్యున్నత ఆధ్యాత్మిక నాయకుడి ఆధ్వర్యంలో ఆ దేశం దశాబ్దాలుగా అధునాతన దీర్ఘశ్రేణి క్షిపణులను అభివృద్ధి చేస్తోంది. ప్రారంభం నుండే, చమురు సంపన్న 'ఆధ్యాత్మిక రాజ్యం' ఒక బలమైన సైనిక శక్తిగా ఉండాలని, TimesPrayer.com అంచనా ప్రకారం 204 కోట్ల ప్రపంచ ముస్లిం జనాభాలో దాదాపు 15 శాతం ఉన్న ప్రపంచ షియా సమూహం అతిపెద్ద శక్తిగా కనిపించాలని కోరుకుంది. అచరించేవారి సంఖ్య పరంగా ప్రపంచంలో ఇస్లాం రెండవ అతి పెద్ద మతం. ముస్లిం జనాభా మొత్తం ప్రపంచ జనాభా కంటే వేగంగా పెరుగుతోంది. 2010– 2020 మధ్య ఇతర ప్రపంచ జనాభా పెరుగుదల 10 శాతంతో పోల్చినప్పుడు ముస్లింల సంఖ్యలో 21 శాతం పెరుగుదల ఉంది.

నేడు ఇరాన్ చాలా పెద్ద సంఖ్యలో స్వల్పశ్రేణి రాకెట్లు, హైపర్‌సోనిక్ ఆయుధాలను కలిగి ఉంది. వీటిలో ఎక్కువ భాగం అయతొల్లా ఆశీస్సులతో స్థానికంగా ఉత్పత్తి చేయబడ్డాయి. యుఎస్ ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ అంచనాల ప్రకారం, ఇరాన్ సుమారు 3,000 బాలిస్టిక్ క్షిపణులను కలిగి ఉంది. ఈ సంఖ్య ఏ ఇతర ప్రాంతీయ శక్తికంటే కూడా ఎక్కువేనని ఆస్ట్రేలియన్ బ్రాడ్‌క్యాస్టింగ్ కార్పొరేషన్ తెలిపింది. వీటిలో వివిధ శ్రేణులు, రకరకాల క్షిపణులు ఉన్నాయి. ఇవి ప్రాంతంలో ఇరాన్ గణనీయమైన సైనిక బలానికి దోహదం చేస్తాయి.

ఇరాన్ అత్యంత అధునాతన డ్రోన్లను తయారు చేసే, ఎగుమతి చేసే ప్రధాన దేశంగా కూడా ఆవిర్భవించింది. గత సంవత్సరం, యుద్ధ సమయంలో రష్యా 8,000 కంటే ఎక్కువ ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ ప్రభుత్వం పేర్కొంది. ఇరాన్ డ్రోన్ టెక్నాలజీలో, ముఖ్యంగా యుద్ధ డ్రోన్లు, లోయిటరింగ్ మ్యునిషన్స్ (ఆత్మహత్య డ్రోన్లు) వంటి రంగాలలో దాని పురోగతికి గుర్తింపు పొందింది. సుడాన్, సిరియా, ఉక్రెయిన్‌తో సహా వివిధ దేశాలకు డ్రోన్ టెక్నాలజీని ఇరాన్ ఎగుమతి చేస్తోంది. ప్రాంతీయ మిత్రులు, మిలీషియాలకు డ్రోన్లను సరఫరా చేసింది.


ఇరాన్ భారీ డ్రోన్ పరిశ్రమ అభివృద్ధి దేశ ఆధ్యాత్మిక నాయకత్వ ఘనత. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా స్వదేశీ ఉత్పత్తిపై ఆధారపడుతోంది. ఇరాన్ డ్రోన్ పరిశ్రమ స్థానిక ఇంజనీరింగ్ , తయారీపై దృష్టి సారించింది. ఇది అబాబిల్, మోహజెర్, షాహెద్ సిరీస్ వంటి డ్రోన్లను ఉత్పత్తి చేస్తోంది. వీటిలో షాహెద్136 (రష్యాలో గెరాన్2 అని కూడా పిలుస్తారు), కొత్త షాహెద్ 238 ఉన్నాయి. ఇరాన్ కామన్22 డ్రోన్ US MQ9 రీపర్‌ను పోలి ఉంటుంది. ఇరాన్ డ్రోన్లు సంఘర్షణల గతిశీలతను మారుస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సందర్భంలో.

> పాకిస్తాన్ సున్నీ అణ్వాయుధం కలిగి ఉండటంతో, ఇరాన్ షియా అణు ఆయుధాగారాన్ని అభివృద్ధి చేయటానికి ఎంతో కాలం పట్టదు. అమెరికా–నేతృత్వంలోని పాశ్చాత్య ప్రపంచం, యూదు దేశమైన ఇజ్రాయెల్ ఈ ప్రక్రియను దాదాపు ఆపడం అసాధ్యం. ఇరాన్ అణు ఆశయం పూర్తిగా స్వీయ రక్షణ కోసమైతే పాశ్చాత్య ప్రపంచం, ప్రపంచంలో ఎనిమిదవ అతిపెద్ద అణు శక్తి అయిన ఇజ్రాయెల్ సైతం సాధారణ పరిస్థితులలో అంత ఆందోళన చెందేవి కాదు.

అయితే, సర్వోన్నత ఆధ్యాత్మిక నాయకుడు అయతొల్లా ఆధ్వర్యంలో ఇరాన్‌ను చాలా పాశ్చాత్య దేశాలు, ముఖ్యంగా అమెరికా తరచుగా 'దూర్త దేశం'గా చూస్తాయి. ప్రధానంగా అమెరికా నేతృత్వంలోని ప్రపంచ క్రమాన్ని ఇరాన్ సవాలు చేయడం, పశ్చిమ ఆసియా ప్రాంతంలో అమెరికన్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న సమూహాలకు మద్దతు ఇవ్వడమే ఇందుకు కారణం. ఇరాన్ హిజ్బుల్లా, హమాస్ వంటి సమూహాలకు చురుకుగా మద్దతు ఇస్తుందని అంటారు. వీటిని అమెరికా, దాని మిత్రదేశాలు ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తాయి. చమురు సంపన్నమైన ఇరాన్ ఒక ప్రధాన అణ్వాయుధ దేశంగా మారడం ఇప్పటికే ఉన్న అధికార సమతుల్యతకు పెద్ద ముప్పుగా పరిగణించబడుతోంది. ఒక సర్వోన్నత మత నాయకుడి చేతుల్లో ప్రభుత్వ యంత్రాంగం నియంత్రణ ఉండటం ఆందోళనకు మరింత కారణమవుతోంది.

# ఆపదలో ఆపన్నహస్తం బీమా

ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు. వ్యాధులు వెంటాడవచ్చు, ప్రమాదాలు జరగవచ్చు, ప్రాణాలు సహితం పోవచ్చు. నేడు ఆకస్మికంగా జరిగిన అనర్థానికి మనతో పాటు మన కుటుంబ సభ్యులు బజారున పడే అవకాశాలు ఉండవచ్చు. అనారోగ్యాలు, మరణాలు, ప్రమాద నష్టాలు, విపత్తులు జరిగినపుడు మనకు, మన కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత ఇవ్వడానికి జీవిత బీమా కంపెనీలు వెసులుబాటు కల్పించడం జరుగుతున్నది. మన ఇంటిని, ప్రధాన వస్తువులను కూడా బీమా చేయించుకునే సదుపాయాలు ఉన్నాయి. రేపటి సురక్ష కోసం నేడు మనం తీసుకునే మంచి నిర్ణయమే జీవిత బీమా. మన ఆదా యం, ఆరోగ్యం, ఆస్తి, ఆర్థికం లాంటి వాటికి నష్టం జరిగినపుడు బీమా మాత్రమే మనకు తక్షణ రక్షణ గొడుగుగా నిలుస్తుంది. అనర్థాలు చెప్పి రావు కాబట్టి అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలు, అకాల మరణాలు, అనారోగ్యాలు, ప్రకృతి విపత్తులు, ఆస్తి నష్టాలు జరిగినపుడు మనకు భద్రతను ఇవ్వడానికి జీవిత బీమా పాలసీలు ఉపయోగపడతాయి.



**జాతీయ బీమా అవగాహన దినం:**

మనకు, మనం అమితంగా ప్రేమించే కుటుంబ సభ్యులకు కొండంత ఆర్థిక అండగా నిలిచే బీమా పాలసీల ప్రాధాన్యాన్ని వివరించడానికి ప్రపంచ దేశాలు ప్రతి ఏటా జూన్ 28న జాతీయ బీమా అవగాహన దినం (నేషనల్ ఇన్సురెన్స్ అవేర్‌నెస్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. అనుకోని విధ్వంసం జరిగినపుడు ఆదుకునే ఆపన్నహస్తమే బీమా పాలసీ. ప్రతి ఒక్కరు తమకు అనువైన బీమా పాలసీలను తీసుకొని తమ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలి. జీవితాలు, వాహనాలు, గృహాలు, ఆరోగ్యాలు, వరదలు, ఆస్తులు, ప్రధాన వస్తువులను బీమా చేయించుకునే వెసులుబాటు కల్పించబడింది.

**భారత్‌లో జీవిత/జనరల్ బీమా కంపెనీలు:**

భారతదేశవ్యాప్తంగా 24 జీవిత బీమా కంపెనీలు ఉండగా, అందులో లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) మాత్రమే ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా పేరుగాంచగా, మిగిలిన 23 కంపెనీలు ప్రైవేట్ యాజమాన్యాలతో నడుస్తున్నాయి. 2025 వివరాల ప్రకారం జీవిత బీమాతో పాటు జనరల్ బీమా కంపెనీలు కలుపుకొని మొత్తం 57 వరకు ఉన్నాయి. వీటిలో 24 జీవిత బీమా కంపెనీలు, 33 జనరల్ బీమా కంపెనీలు ఉన్నాయి. భారత్‌లో ఎల్ఐసి కంపెనీ అగ్రగామిగా అత్యధిక పాలసీలను కలిగి ఉండగా, తర్వాత స్థానాల్లో బజాజ్, ఎస్‌బిఐ లైఫ్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఐసిఐసిఐ లోంబార్డ్ లైఫ్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్, జనరల్ ఇన్సురెన్స్ లాంటి కంపెనీలు మార్కెట్‌లో ముందు వరుసలో ఉన్నాయి. బీమా రంగంలో ఎల్ఐసి మార్కెట్ షేర్ తొలి ఏడాది ప్రీమియం ఆదాయం ఆధారంగా 57 శాతం దక్కించుకొని ఇతర కంపెనీలకు అందనంత దూరంలో నిలుస్తూ తన సత్తాను చాటుకుంటున్నది.

నష్టం జరిగిన తర్వాత దుఃఖించడం కన్న సకాలంలో మనకు నచ్చిన బీమా పాలసీలను తీసుకోవడం ఉత్తమ పౌరుల లక్షణమని తెలుసుకోవాలి. ఆకస్మిక విపత్తులు, ప్రమాదాలు, ప్రాణాపాయాలకు తక్షణ రక్షణ గొడుగులుగా బీమా పాలసీలు ఆర్థిక భద్రతను కల్పిస్తాయి. నేడే మనం జీవిత బీమా చేసుకుందాం.

# పండుగల పేరుతో ఆర్భాటాలు వద్దు

పండుగలు మన జీవన విధానంలో ఒక భాగం. పండుగలతో ఆనందం, ఉత్సాహంతో పాటు సామాజిక, సాంఘిక, రాజకీయ సంబంధాలను బలోపేతం చేస్తాయి. అదేవిధంగా భవిష్యత్ తరాలకు సంస్కృతి, సాంప్రదాయాలను వారసత్వ సంపదను అందిస్తాయి. సామూహికంగా జరుపుకునే పండుగలతో, సామూహిక భోజనాలతో మతాలు, కులాల మధ్యన అంతరాలు తగ్గుతాయి. పండుగలు కొన్ని మతపరమైనవి, కులపరమైనవి, ప్రాంతాలపరమైనవి, సంసృతిక పరమైనవి, వారసత్వమైన పండుగలు ఉంటాయి. ఒకప్పుడు పండుగలు ఆనందాన్ని మాత్రమే ఇచ్చేవి. ఇప్పుడు పండుగలు అప్పులకు నిలయాలు. నేటి తెలంగాణ సమాజం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అంటే గత పది సంవత్సరాల నుంచి ఎక్కువగా ఖర్చు చేసి పండుగలు చేస్తూ అప్పుల పాలవుతున్నారు.

అంతకంటే ముందు కూడా పండుగలు చేసేవారు. కానీ ఇంత హంగు, ఆర్భాటాలు, ఖర్చులు లేకుండా పండుగలు చేసుకునేవారు. సాంస్కృతికపరమైన పండుగలు బతుకమ్మ, దసరా, దీపావళి, రంజాన్, బక్రీద్, సంక్రాంతి, క్రిస్మస్, ఉగాదిలాంటి పండుగలు ఒకేరోజు అందరూ చేసుకుంటారు. కాబట్టి ఈ పండుగలకు ఖర్చు ఆ కుటుంబం వరకే ఉంటుంది కాబట్టి చాలా తక్కువ ఖర్చుతో ఈ పండుగలు చేసుకుంటారు. జాతీయ పండుగలు స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం లాంటి పండుగలకు అసలు ఖర్చు ఉండదు. గత పది సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల ప్లాట్లతో పాటు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ భూముల ధరలు గణనీయంగా పెరగడం దాంతో రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగడంతో ఎక్కువ కుటుంబాలలో డబ్బుల వినిమయం పెరగడంతో ప్రతి పండుగను ఎక్కువగా ఖర్చు పెట్టి చేసుకునే సంప్రదాయం మొదలయ్యింది.



తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను అనుసరించి పుట్టుకలు, పెళ్లిళ్లు, చావులు వంటి సందర్భాల్లో గ్రామదేవతలకు బోనా లు ఇవి జరుపుకునేవారు. కానీ ఇప్పుడు బర్త్ డేలు, మ్యారేజ్ డేలు వాటితోపాటు ఎండాకాలం వచ్చిందంటే దుర్గమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, బీరప్ప, గంగమ్మ ఇతర కులదేవతల, 'బొడ్రాయి' లాంటి పండుగలను ఊరు ఊరంతా పండుగ చేసుకుంటారు. ఈ పండుగలలో మాంసం తినడం గురించి చెప్పనవసరం లేదు. ఈ పండుగలలో మద్యం ఏరులై పారుతుంది. భోజనం ఖర్చు కంటే మద్యం ఖర్చు కుటుంబాలను అప్పుల పాలు చేస్తుంది. ఎంత పెద్ద మొత్తంలో మద్యానికి ఖర్చు పెడితే వారు అంత పెద్దగా పండుగ చేసినట్లుగా, ఆ స్థాయిలో గౌర వం వచ్చినట్లుగా భావిస్తున్నారు. మద్యం ఖర్చు సామాజిక హోదాను సూచిస్తుందని అనుకుంటున్నారు. ఒడిబియ్యం వండుకుంటే కూడా మద్యంతోనే పండుగ ప్రారంభమై, ముగుస్తుంది. ప్రస్తుతం తెలంగాణలో మద్యం లేని పండుగ లేదంటే అతిశయోక్తి కాదు.

**ఉదాహరణకు:**

తెలంగాణ వ్యాప్తంగా కొందరి సంతోషం కోసం పండుగల పేర్లతో వారి వారి స్తోమతకు మించి ఖర్చు పెట్టడంతో అప్పుల బారిన పడి తీర్చే మార్గం లేక నానా అవస్థలు పడుతూ ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. కొందరి కోసం అందరికి అప్పులు, పండుగల పేర్లతో కొత్త పోకడలు పోతూ స్తోమతకు మించి అప్పులు చేసుకోవడం మంచిది కాదని నిపుణులు అంటున్నారు.

**— పులి రాజు**
**9908383567**

# ఉద్యోగ ప్రకటనలకు నిరుద్యోగుల పోరాటం

నీళ్లు, నిధులు, నియామకాలు.. ఈ మూడు ఎజెండాలతో తెలంగాణ ఉద్యమం జరిగింది. రాష్ట్ర సాధనలో విద్యార్థులు, యువత పాత్ర మరువలేనిది. స్వరాష్ట్రంలో మన ఉద్యోగాలు మనకే వస్తాయని అప్పటి ఉద్యమనేతగా ఉన్న కెసిఆర్ యువతలో భారీగా ఆశలు రేకెత్తించారు. ప్రత్యేక రాష్ట్రం అనంతరం కెసిఆర్ రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి కనబరిచారు. దీంతో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు అసంతృప్తికి లోనయ్యారు. ముఖ్యంగా సమయానికి ఉద్యోగ ప్రకటనలు రాకపోవడం, తరుచూ కోర్టు కేసులతో నియామకాలు ఆగిపోవడం, టిఎస్‌పిఎస్‌సి పరీక్ష పేపర్లు లీకేజీలతో యువత ఆగ్రహానికి గురయ్యారు. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గుండెకాయ వంటి టిఎస్‌పిఎస్‌సి పారదర్శకత విషయంలో యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసింది. దీంతో నిరుద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య అంతరాలు పెరిగాయి. యువత నైరాశంలోకి వెళ్లింది. తెలంగాణ రాజకీయ క్షేత్రంలో నిరుద్యోగులతో పాటు ప్రజలు సైతం మార్పు కావాలని కోరుకున్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... వాళ్ళ ఉద్యోగాలు ఊడగొడితే మీకు ఉద్యోగాలు వస్తాయని మాట్లాడారు. అప్పుడు యువత మద్దతుతో బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో హాయంలో కూడా నిరుద్యోగుల పరిస్థితి మారలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంవత్సరంలోపు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటికి దాదాపు 60 వేల ఉద్యోగాలనే నింపింది. ఇవి కూడా గత ప్రభుత్వం హాయంలో జారీ చేసిన నోటిఫికేషన్లే. కేవలం పరీక్ష నిర్వహించి నియామక పత్రాలు ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లు అంతంత మాత్రమే (12వేలు మాత్రమే అని అంచనా). తెలంగాణ ఆవిర్భావ రోజు అయిన జూన్ 2న ప్రభుత్వం నిరుద్యోగులకు గురించి ఏమి మాట్లాడలేదు. ఎలాంటి ఉద్యోగ ప్రకటన కూడా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. ఈ క్రమంలో నిరుద్యోగుల ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ఈ నెల 20వ తేదీన విద్యార్థి నిరుద్యోగ మహాగర్జన సభ నిరుద్యోగ జెఏసి ఆధ్వర్యంలో జరిగింది. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ ఖాళీల భర్తీ చేయాలనే ప్రధాన ఎజెండాగా నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని నిరుద్యోగ జెఏసి నేతలు పిలుపునిచ్చారు. అనేకమంది మేధావులు నిరుద్యోగుల పక్షాన నిలబడుతున్నారు. తక్షణం ఉద్యోగ నోటిఫికేషన్ రాకపోతే తెలంగాణలో మరో నిరుద్యోగ పోరాటం చేస్తామని నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు. నిరుద్యోగులు అందరూ సమష్టిగా ఓటు వేసి ఎన్నుకున్న ఈ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎలక్షన్‌లో తగిన గుణపాఠం చెప్తామంటున్నారు. ఎంతో మంది నిరుద్యోగుల దృష్టిలో, అసంబద్ధమైన జీవోలు తీసుకొచ్చి నిరుద్యోగులను గందరగోళంలోకి నెట్టారు. పోలీస్ నియామకాలలో జిఒ 46 తీసుకువచ్చి గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు, గ్రూప్ 1 నియామకాల్లో జిఒ 29తో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఉల్లంఘించి వివిధ సామాజిక వర్గాల వారికి అన్యాయం చేశారు. గ్రూప్1 విషయంలో గత ప్రభుత్వం పేపర్ లీకులతో తప్పులు చేస్తే... ఈ ప్రభుత్వం మెయిన్స్ మూల్యాంకనంలో నిర్లక్ష్యం వహిస్తూ నిరుద్యోగులకు అన్యాయం చేసింది. ఇటీవల గ్రూప్1మెయిన్స్ మూల్యాంకన విషయంలో తెలుగు మీడియా అభ్యర్థులు చాలా నష్టపోయారు. ఈ విషయం పట్ల కోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో టిజిపిఎస్‌సి పారదర్శకతపై కూడా నమ్మకం సన్నగిల్లుతుంది. ఇదిలా ఉండగా సిఎం గ్రూప్–1 నియామకాలను అడ్డుకుంటున్నారని అనడం విడ్డూరంగా ఉంది. గతేడాది అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. ఎస్సీ ఉప వర్గీకరణ కోసం దీన్ని అమలును వాయిదా వేశారు. మరి ఇప్పుడు ఆ సమస్య లేదు. అయినా ఉద్యోగ నోటిఫికేషన్ పట్ల ప్రభుత్వం పెద్దలు రకరకాలగా మాట్లాడుతున్నారు. మరోవైపు త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగుల ఓపికను పరీక్షిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఓ సభలలో నిరుద్యోగుల గురించి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఉద్యోగాల కోసం ధర్నా చేసేవారని, కానీ మా హయాంలో నోటిఫికేషన్లు వద్దని ధర్నాలు చేస్తున్నారని చెప్పడం హాస్యాస్పదం. ఈ వ్యాఖ్యలతో నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిరుద్యోగుల వయసు దాటిపోతుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏటా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక మానవ వనరులు వృథా అయిపోతున్నాయి. కావున వివిధ డిపార్ట్‌మెంట్‌లలో ఖాళీల లెక్కలను తేల్చి వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలి. మరోవైపు యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగంలోకి కూడా వెళ్లే విధంగా ప్రోత్సహించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకోకపోతే మరో తిరుగుబాటు తప్పదని నిరుద్యోగులు ఐక్య కార్యచరణ సమితి (జెఏసి) హెచ్చరిస్తున్నది.

**— సంపతి రమేష్ మహారాజ్**
**7989579428**

# రైతు రాజయ్యేదెన్నడు?

రైతు లేనిదే రాజ్యం లేదు, అన్నదాతలే దేశానికి వెన్నెముక. జై కిసాన్ అంటూ జేజేలు పలుకుతూ పల్లకి మోతలే, 'మాటలు కోటలు దాటుతున్నాయి చేతలు తంగేళ్లు దాటడం లేదు' అన్నట్లుగా ఉంది. నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు, గౌరవం ఇస్తున్నామా! అంటే లేదని చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే?. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ పారిశ్రామిక, సాంకేతిక,సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీవివి)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా తగ్గుతోంది. కృత్రిమ మేధ (ఏఐ)అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే !. వ్యవసాయ రంగం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా కునారిల్లుతుంది. రైతు ఆత్మహత్యలను ఆపలేకపోవడం పాలకుల లోపమా?, రైతుల శాపమా!. ఏది ఏమైనా బలిపీఠంపై ఉన్న సాగును బాగుపడేలా చేస్తూ, రైతును రాజును చేసే సంగతేమో కాని కనీసం ఆత్మహత్యలను నివారించాల్సి ఉందనేది కాదనలేని నిజం. అప్పుడే నేటి తరం యువత ఆ రంగంలోకి రాగలరు. ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కల్పించడం అభినందనీయమే. కానీ మన దేశంలో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించే సాగును, దాన్నే నమ్ముకున్న రైతాంగం బాగుపడ్డ రోజే వారి జీవితాల్లో నిజమైన ఆనందం. ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని, రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. అలానే జూన్ మొదట్లో రుతుపవనాలు వచ్చి తొలకరి కురిసి మురిపించింది. ఆ తర్వాత జూన్ నెల చివరకు వస్తున్నా ఆకాశం మేఘావృతమై ఉంటుందే కానీ వర్షాలు పడడం లేదు. తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితులు ఇన్నేళ్లైనా మారనేలేదు. మన దేశంలో అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలమిది. జాతికి మెతుకు నిచ్చి, బతుకు నిలిపే రైతన్న పుడమినే పుత్తడి (పులకింప) చేసి పూతలు పూయించి కాతలు కాయిస్తు, బురదను మలిచి బువ్వను చేసే పుణ్య పురుషుడు అన్నదాత. తొలకరి వానలకు ముందుగా నాలుగుసార్లు దుక్కి దున్ని విత్తనాలు నాటుతారు. మొక్క మొలకెత్తింది మొదలు దానిని పసి బిడ్డను చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు. కలుపు తీస్తాడు, మందులు వేస్తాడు పంట చేతికందే సరికి అనావృష్టో లేదా అతివృష్టి వలనో ఆ పైరు ఎండిపోవడమో, కొట్టుకపోవడమో జరుగుతుంది. విత్తనాల ఖర్చులు కూడా తిరిగి రాని దయనీయ స్థితి.

**— మేకిరి దామోదర్**
**9573666650**



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన పంజాబ్ పోలీసులు



**చండీగఢ్:** పాకిస్థాన్ ఐఎస్ఐ సహకారంతో భారీ ఉగ్రకుట్రను జరిగిన ప్లాన్‌ను పంజాబ్ పోలీసులు శుక్రవారంనాడు భగ్నం చేశారు. టెర్రర్ మాడ్యూల్ ఆటకట్టించారు. ఉగ్ర కుట్రకు పన్నాగం పన్నిన ఒక మైనర్‌తో సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బికెఐ)కు చెందిన వారిగా గుర్తించారు. భారీ ఉగ్రకుట్రను భగ్నం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడగలిగామని డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు.'ఇంటెలిజెన్స్ సమాచారంతో రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్ సెల్ ఈ ఆపరేషన్ నిర్వహించింది. పాక్ ఐఎస్ఐ సహకారం కలిగిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ టెర్రర్ మా డ్యూల్‌ను విజయవంతంగా పట్టుకున్నాం. యూకేకు చెందిన నిషాన్ సింగ్, పాకిస్థాన్‌కు చెందిన టెర్రరిస్ట్ హర్వీందర్ రిండాలు దీనిని ఆపరేట్ చేస్తున్నారు. బికెఐతో అసోసియేషన్ కలిగిన ఒక జువనైల్, మరో ఇద్దరిని అరెస్టు చేశాం' అని డీజీపీ తెలిపారు.

# అత్యంత వైభవంగా పూరీ జగన్నాథయాత్ర

### తరలివచ్చిన లక్షలాది మంది ప్రజలు



**న్యూఢిల్లీ :** ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్ర శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ప్రధాన ఘట్టంలో భాగంగా 12వ శతాబ్దపు మందిరం దగ్గర నుండి శ్రీ గుండిచా ఆలయం వైపు వెళ్లే రోడ్డుపై వేలాది మంది ప్రజలు జగన్నాథుడు, అతని తోబుట్టువుల రథాలను తాళ్లను లాగారు. ఒడిశా గవర్నర్ హరి బాబు కంభంపతి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ , అనేక మంది ప్రముఖులు జగన్నాథుడు, దేవి సుభద్ర, బలభద్రుడి రథాలను లాగారు. జై జగన్నాథ్, హరి బోల్ నినాదాలతో తాళాలు మోగించడం, బాకాలు, శంఖాలు ఊదడం మధ్య, బలభద్రుడి 'తల ద్వాజ' రథం మొదట సాయంత్రం 4.08 గంటలకు ముందుకు కదలడం ప్రారంభమైంది. తర్వాత దేవి సుభద్ర 'దర్పదలన్' రథం, చివరకు జగన్నాథుడి 'నందిఘోష్' రథాలు కదిలాయి. భక్తులు రథాలను లాగుతుండగా, పూజారులు రథాలపై ఉన్న దేవతల వద్ద ఆశీనులయ్యారు. ఊరేగింపు ఈ ఆలయ పట్టణంలోని గ్రాండ్ రోడ్ గుండా వెళుతుంది. వేలాది మంది ప్రజలు రథాలను లాగగా, లక్షలాది మంది ఇతరులు కూడా ఈ ఉత్సవంలో పాల్గొనడానికి సముద్రతీర ఆలయ పట్టణానికి చేరుకున్నారు. వార్షిక రథోత్సవం కోసం సుమారు పది లక్షల మంది భక్తులు హాజరైనట్లు అంచనా వేశారు. పూరి రాజు గజపతి మహారాజు దివ్యసింహ దేబ్ మూడు రథాలపై 'చెరా పహారా' (రథాలను ఊడ్చడం) చేసిన తర్వాత రథం లాగడం ప్రారంభమైంది. మూడు రథాలపై వివిధ రంగుల చెక్క గుర్రాలను అమర్చారు. అంతకుముందు రెండు గంటలకు పైగా జరిగిన 'పహాండి' ఆచారం తర్వాత త్రిమూర్తులు బలభద్రుడు, దేవి సుభద్ర, జగన్నాథుడు వారి వారి రథాలను అధిరోహించారు. పహాండి సందర్భంగా, 12వ శతాబ్దపు జగన్నాథ ఆలయం నుండి మూడు చెక్క విగ్రహాలను రథాలకు వద్దకు తీసుకువెళ్లారు. ఒడిస్సీ నృత్యకారులు, జానపద కళాకారులు, సంగీతకారులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అనేక ఇతర బృందాలు విగ్రహాల ముందు ప్రదర్శన ఇచ్చాయి. గోవర్ధన పీఠం శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి, ఎంపిక చేసిన శిష్యులతో కలిసి, దేవతలను ప్రతిష్ఠించిన తర్వాత మూడు రథాలను సందర్శించారు. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్ర సింగ్ షెఖావత్, పూరి ఎంపి సంబిత్ పాత్ర, ఒడిశా మంత్రులు, అనేక మంది ఇతరులు పూరిలో రథయాత్ర ప్రధాన ఆకర్షణలలో ఒకటైన ఆచార పహండిని వీక్షించారు. ఒడిశా పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళం, ఎన్ఎస్‌జి, ఇతరులకు చెందిన దాదాపు 10,000 మంది సిబ్బందితో అపూర్వమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఈ ఉత్సవం జరుగుతోంది. రథయాత్ర సజావుగా నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు డిజిపి వైబి ఖురానియా మీడియాకు వెల్లడించారు. ప్రజలపై నిఘా ఉంచడానికి 275కి పైగా ఎఐ ఎనేబుల్డ్ ఇసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత కొంత సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏర్పాట్లు చేసినట్లు ఎడిజిపి సంజయ్ కుమార్ తెలిపారు. ఎన్ఎస్‌జి స్నిపర్లు, కోస్ట్ గార్డ్ డ్రోన్లు, యాంటీడ్రోన్ వ్యవస్థలతో సహా అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒడిశా పోలీసులతో సహకరిస్తున్నాయి. డాగ్‌స్క్వాడ్ బృందాలు, ఒడిశా యాంటీసాబోటేజ్ యూనిట్లు కూడా ఇక్కడ విధుల్లో నిమగ్నమై ఉన్నాయని ఆయన చెప్పారు.

### అహ్మదాబాద్ రథయాత్రలో అపశృతి

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జగన్నాథ రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. ఊరేగింపుగా వచ్చిన మూడు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఏనుగులు అదుపుతప్పి భక్తులపైకి దూసుకు వచ్చాయి. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రాణాలు కాపాడుకునేందుకు భక్తులు పరుగులు తీశారు. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారు. అయితే కొంత సమయానికి పరిస్థితి అదుపుకావడంతో మళ్లీ రథయాత్రను యథావిధిగా జరిపించారు.

# అమర్‌నాథ్ యాత్రకు బహుళంచెల భద్రత



జమ్ము : వార్షిక అమర్‌నాథ్ యాత్ర కోసం బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జమ్ము ప్రాంతంలో 180 కంపెనీలకు పైగా పారామిలిటరీ దళాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. 38 రోజుల పాటు సాగే ఈ యాత్ర జూలై 3న జంట మార్గాల నుండి ప్రారంభం కానుంది. అనంతనాగ్ జిల్లాలోని సాంప్రదాయ పహల్గామ్ మార్గం, గందర్‌బాల్ జిల్లాలోని 14 కిలోమీటర్ల బాల్తాల్ మార్గం 3,880 మీటర్ల ఎత్తయిన పవిత్ర గుహ మందిరమైన అమర్‌నాథ్‌కు దారితీస్తుంది. యాత్ర ప్రారంభానికి ఒక రోజు ముందు జమ్ములోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుండి యాత్రికుల మొదటి బృందం కాశ్మీర్‌కు బయలుదేరుతుంది. ఈ సంవత్సరం యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, యాత్ర కోసం జమ్ముకశ్మీర్ పోలీసులు బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జమ్ము జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) భీమ్ సేన్ టుటి మీడియాకు వివరించారు. జమ్ము డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్‌తో కలిసి యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించడానికి ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన టుటి మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా భద్రతను అందిస్తున్నట్లే, ఈ సంవత్సరం కూడా పారామిలిటరీ దళాల సంఖ్య, సున్నితమైన ప్రాంతాలలో మోహరింపు లేదా సిసిటివి నిఘా పరంగా మరింత మెరుగైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మునుపటితో పోలిస్తే, మరింత అప్రమత్తంగా, బహుళస్థాయి భద్రతను నిర్ధారించడం జరుగుతోందన్నారు. ఈ ప్రాంతంలో యాత్ర కోసం బలగాల మోహరింపు గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, జుమ్మకశ్మీర్ పోలీసులతో పాటు, యాత్ర కోసం 180కిపైగా పారామిలిటరీ దళాలను మోహరించారన్నారు. జమ్ముకశ్మీర్ జాతీయ రహదారి వెంబడి లఖన్‌పూర్ నుండి బనిహాల్ వరకు భద్రతా దళాలను మోహరించామని ఆయన అన్నారు. రోడ్ ఓపెనింగ్ పార్టీల నుండి సిసిటివి కెమెరాల వరకు, ప్రతిదీ ఏర్పాటు చేశామని, లాంగర్‌లు, లాడ్జింగ్ సెంటర్‌ల వద్ద కూడా భద్రత కల్పించామన్నారు. గత సంవత్సరం లఖన్‌పూర్ నుండి జమ్ము వరకు ఆర్‌ఓపి (రోడ్ ఓపెనింగ్ పార్టీ) ఏర్పాట్లు లేవు, కానీ ఈ సంవత్సరం ఇక్కడ కూడా ఉన్నాయన్నారు. జూలై 2 నుండి ట్రాఫిక్ పోలీసులు రోజువారీ సలహాలు ఇస్తారని ఐజిపి తెలిపారు. యాత్రకు సంబంధించిన అన్ని ప్రదేశాలలో కట్‌ఆఫ్ సమయాలు నిర్ణయించబడతాయని, యాత్రలో పాల్గొనాలనుకునే అన్ని యాత్రికులు ఈ సలహాను పాటిస్తే ఎటువంటి సమస్యలు లేదా అసౌకర్యాలు ఉండవన్నారు. యాత్రికులు ఉదయం 4:00 నుండి 4:30 గంటల మధ్య బయలుదేరే ప్రధాన కాన్వాయ్‌లో చేరాలని సూచించారు. 'వ్యక్తిగతంగా ప్రయాణించడం సముచితం కాదు. అధికారిక కాన్వాయ్‌తో ప్రయాణించే వారికి సురక్షితమైన వాతావరణం కల్పించబడింది. వ్యవస్థీకృత, రక్షిత సెటప్‌లో ప్రయాణించడం సురక్షితం అని ఆయన అన్నారు.

### చెల్లింపుల జాప్యాన్ని పరిష్కరించేందుకు..

# ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




**న్యూఢిల్లీ :** సూక్ష్మ మరియు చిన్న సంస్థలకు (ఎంఎస్ఎంఇ) చెల్లింపుల జాప్యానికి సంబంధించిన కేసులలో విచారణలు వేగవంతం చేయంలో, నిర్ణయం తీసుకోవడంలో ఈరోజు (శుక్రవారం) ప్రారంభించబడిన ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్ సహాయపడుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఆమె ప్రపంచ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఇ) దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను వివరించారు. ఆర్థిక లభ్యత, పెద్ద సంస్థలతో పోటీ, చెల్లింపులలో జాప్యం వంటి వాటిని కీలక సవాళ్లుగా ఉదహరించారు. ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాల ఫలితంగా రిజిస్టర్డ్ ఎంఎస్ఎంఇల సంఖ్య వేగంగా పెరిగిందని తెలియజేశారు. ఆలస్యమైన చెల్లింపులకు సంబంధించిన త్వరితమైన విచారణ, నిర్ణయం తీసుకోవడంలో ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్ కీలక ప్రాధాన్యత కలిగినదిగా నిరూపించబడుతున్నదని రాష్ట్రపతి చెప్పారు. వ్యాపారాలను స్థాపించడానికి, స్వావలంభన పొందడానికి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె యువతులకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచం వాతావరణ మార్పుల వల్ల ఉత్పన్నమైన సవాళ్లను ఎదుర్కొంటూనే సాంకేతికతలో వేగంగా అభివృద్ధి చెందడాన్ని గమనించినట్లు ముర్ము చెప్పారు. వాతావరణ స్థిరత్వ లక్ష్యాలకు భారతదేశం కట్టుబడి ఉందని నొక్కిచెబుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలలో గ్రీన్ టెక్నాలజీని ప్రోత్సహించాలని కోరారు. ఈ గ్రీన్ టెక్నాలజీ ఎంఎస్ఎంఇల స్థిరత్వాన్ని, వాటి పోటీతత్వాన్ని మెరుగుపర్చడమే కాకుండా దేశ వాతావరణ లక్ష్యాలను కూడా మెరుగుపరుస్తుందని రాష్ట్రపతి తెలియజేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు నిలదొక్కుకోవడానికి నవకల్పనలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె నొక్కిచెప్పారు. ప్రభుత్వం అనేక మార్గాలలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోందని రాష్ట్రపతి ముర్ము వివరించారు. వికసిత్ భారత్ 2047 విజన్ నాటికి కింది స్థాయిలో నవకల్పనలను ప్రోత్సహించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు పిలుపునిచ్చారు. ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీ మాట్లాడుతూ కేవలం ఎంఎస్ఎంఎల లోనే దేశవ్యాప్తంగా 34కోట్ల మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఇలు, వారి కొనుగోలుదారుల మధ్య వివిదాల సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వాలచే స్థాపించబడిన సూక్ష్మ, చిన్న సంస్థల సౌకర్యాల మండలి (ఎంఎస్ఇఎఫ్‌సి) వద్ద రూ.50,000కోట్ల విలువైన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి జితన్ రామ్ మాంఝీ వివరించారు. ఆన్‌లైన్ వివాద పరిష్కార పోర్టల్‌ను ఉపయోగించి చెల్లింపులు ఆలస్యమైన సందర్భాలలో సూక్ష్మ, చిన్న సంస్థల వ్యవస్థాపకులు కేసులు దాఖలు చేయవచ్చు. వారు తమ సంస్థ వివరాల కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది.

### ఉగ్రవాద ప్రస్తావన లేని ఎస్‌సిఒ ఫలిత పత్రం...

# భారత్‌కు ఆమోదయోగ్యం కాదు

### కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్



**న్యూఢిల్లీ :** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) రక్షణ మంత్రుల సమావేశం ఫలిత పత్రం (ఔట్ కమ్ డాక్యుమెంట్)లో ఉగ్రవాదం గురించి ప్రస్తావించాలని భారతదేశం ఆకాంక్షించిందని, అయితే దానిని ఓ దేశం అంగీకరించనప్పుడు భారతదేశానికి కూడా ఎస్‌సిఒ ఫలితపత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఆయన పాకిస్థాన్‌ను ఉద్దేశించి పరోక్షంగా సూచించారు. ఉగ్రవాదంపై పోరాడటమే షాంఘై సహకారం సంస్థ ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయమే సరైనదన్నారు. ఉగ్రవాదంపై భారతదేశ ఆందోళనలను ప్రస్తావించకుండా తాను మాత్రం ఫలిత పత్రాన్ని అంగీకరించబోనని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ స్పష్టంచేశారు. పహల్గామ్ ఉగ్రదాడిని విస్మరించిన తర్వాత పాకిస్థాన్ మద్దతు కలిగిన సీమాంతర ఉగ్రవాదంపై భారతదేశం ఆందోళనలను స్పష్టంగా ప్రస్తావించకపోవడంతో గురువారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ షాంఘై సహకార సంస్థ ఉమ్మడి ప్రకటనపై సంతకం చేయడానికి నిరాకరించారు.ఎస్‌సిఒ రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్‌సింగ్ ఉగ్రవాద దాడిని ప్రకటనలో చేర్చాలని డిమాండ్ చేశారు. అయితే పాకిస్థాన్ వైపు బలూచిస్థాన్‌లో మిలిటరీ కార్యకలాపాలపై ఒక పేరాగ్రాఫ్ చేర్చాలని ఒత్తిడి చేసింది. ఇది న్యూఢిల్లీని నిందించాలనే ప్రయత్నంలో ఒక భాగమని ఉన్నత స్థాయి అధికారవర్గాలు తెలిపాయి. విలేకరుల సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైఖరి విషయమై విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌ను ప్రశ్నించగా ఏకాభిప్రాయం ద్వారా నడిచే షాంఘై సహకార సంస్థ లక్ష్యం ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడమే కదా అని జైశంకర్ సమాధానం ఇచ్చారు. ఎస్‌సిఒ ఏకగ్రీవంగా నడుస్తుందని జైశంకర్ చెప్పారు. ఒక దేశం ఉగ్రవాదాన్ని గురించి ప్రస్తావించడాన్ని అంగీకరించనప్పుడు ఫలిత పత్రం భారతదేశానికి కూడా ఆమోదయోగ్యం కాదని రాజ్‌నాథ్ సింగ్ గట్టిగా తేల్చిచెప్పినట్లు జైశంకర్ వివరించారు.

## పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ తల్లి దారుణ హత్య

న్యూఢిల్లీ : పంజాబ్ కాల్పుల కలకలం రేపింది. గ్యాంగ్‌స్టర్ జగ్గూ భగవాన్ పురియా తల్లి హర్జీత్ కౌర్ దారుణ హత్యకు గురయ్యారు. కారులో ఉన్న ఆమెపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. బటాలా నగరంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. సివిల్ లైన్స్ ప్రాంతంలోని ఖాడియన్ రోడ్డులో గురువారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో హర్జిత్ కౌర్ కారులో కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. వెంటనే ఆమెను అమృత్‌సర్‌లోని ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

కాల్పులు జరిపిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలింపు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. హంతకులను పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సిఎం నితీశ్, ప్రధాని మోదీలకు ఓటమి భయం : తేజస్వి యాదవ్



**న్యూఢిల్లీ :** మరో రెండు నెలల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ఓటర్ల జాబితాలో స్పెషల్ రివిజన్ ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రస్తుత ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటనపై ఆర్‌జెడి ముఖ్య నాయకుడు తేజస్వి యాదవ్ అసహనం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 8 కోట్ల మంది బిహారీ ఓటర్లతో ఉన్న జాబితాను పక్కనపెట్టి కొత్త జాబితాను తయారుచేయడం దేనికని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఉన్నప్పుడు ఈ నిర్ణయం దేనికని నిలదీశారు. కేవలం 25 రోజుల్లో 8 కోట్ల మంది ఓటర్ల పేర్లతో జాబితాను తయారు చేయడం సాధ్యమయ్యే పనేనా అని తేజస్వి విమర్శించారు. ఆర్‌జెడి పక్షాన నిలిచే పేద, బడుగు, బలహీన వర్గాల ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకే ఈ స్పెషల్ రివిజన్ అని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కీలుబొమ్మలా ఎన్నికల సంఘం పనిచేస్తోందని మండిపడ్డారు. ఈ విషయమై త్వరలోనే మా పార్టీ బృందం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి మాట్లాడుతుందని తేజస్వి యాదవ్ చెప్పారు. బిహార్ సిఎం నితీశ్ కుమార్, ప్రధాని నరేంద్రమోదీలకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం పట్టుకుందని, అందుకే ఓటర్ల జాబితాలో సవరణలు చేయించి గెలువాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వారు పేదల ఓటు హక్కును బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

# సామాజికంగా గిరిజనులను బలోపేతం చేస్తాం

### కాంగ్రెస్‌లో వారికి సముచిత స్థానంతో రాజకీయంగా సాధికారత కల్పిస్తాం : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ గిరిజన సమాజాన్ని సామాజికంగా బలోపేతం చేయాలని భావిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పార్టీలోనే వారికి సముచిత స్థానం, సంపూర్ణ మద్దతు ఇవ్వడం ద్వారా వారికి రాజకీయంగా సాధికారత కల్పించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కొన్ని రోజుల క్రితం తన నివాసంలో గిరిజన సమాజ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో రాహుల్‌గాంధీ వారి సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా వారి మధ్య జరిగిన సంభాషణ వీడియోను రాహుల్‌గాంధీ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌లో గిరిజన నాయకత్వాన్ని అభివృద్ధి చేయాలనుకుంటున్నామని చెప్పారు. తాను గిరిజనులకు సహాయం చేయాలనుకుంటున్నాని, దీని కోసం సమాజం ఐక్యంగా ఉండాలని, గిరిజనుల హక్కుల కోసం నిజంగా పోరాడుతున్న వారు ముందుకు రావాలన్నారు. తాము ఆదివాసీ నాయకులను బలోపేతం చేయాలనుకుంటున్నామని, ప్రతి రాష్ట్రంలో 1015 మంది గిరిజన నాయకులు ఉద్భవించాలని కోరుకుంటున్నట్లు గాంధీ గిరిజన ప్రతినిధులతో అన్నారు. ఈ సమావేశం గురించి మాజీ కాంగ్రెస్ చీఫ్ మాట్లాడుతూ ఈ పోరాటంలో వారితో పాటు ఉన్నానని ప్రతినిధులకు హామీ ఇచ్చానని అన్నారు.

వారికి రాజకీయ అధికారం ఇవ్వడం ద్వారా సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో వారికి సముచిత స్థానం, బలమైన గొంతు, మద్దతు ఇవ్వడం ద్వారా ప్రారంభమవుతుందన్నారు. తన వాట్సాప్ ఛానెల్‌లో షేర్ చేసిన పోస్ట్‌లో, 'నీరు, అడవి, భూమి, రాజ్యాంగ హక్కుల కోసం వారి పోరాటం కొనసాగుతోంది. అది సామాజిక అన్యాయం అయినా లేదా డిజిటలైజేషన్ ద్వారా భూమిని లాక్కున్నా, దేశంలోని గిరిజనులు బాధపడుతూనే ఉన్నారు' అని కూడా ఆయన అన్నారు. గిరిజన, బహుజన సమాజం సమ్మిళితత్వం, భాగస్వామ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 'సంఘ్తాన్ సృజన్ అభియాన్' ద్వారా కొత్త జిల్లా అధ్యక్షులను నియమించే ప్రక్రియను కాంగ్రెస్ ప్రారంభించిందన్నారు. తాము ఈ చొరవను గుజరాత్ నుండి ప్రారంభించామని, కాంగ్రెస్ ప్రతి రాష్ట్రంలోనూ దీనిని అమలు చేస్తుందని స్పష్టం చేశారు. రానున్న కాలంలో, వారి బలమైన, ఐక్య స్వరం ప్రతిధ్వనించినప్పుడు ప్రస్తుత పరిస్థితులలో మార్పును ఎవరూ ఆపలేరన్నారు. జూన్ 23న గాంధీ తన నివాసంలో గిరిజన ప్రతినిధులను కలిశారు. ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ భూరియా మాట్లాడుతూ, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్‌లకు చెందిన గిరిజన ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారని, గిరిజన జిల్లాల్లో పార్టీ టిక్కెట్లలో సమాజానికి, ముఖ్యంగా యువతకు ప్రాధాన్యత లభిస్తుందని గాంధీ హామీ ఇచ్చారని అన్నారు.

### గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో

## అక్రమాలపై విచారణకు కమిటీ

### బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటన



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో జరిగిన గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ జరిపేందుకు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. 2014, 2018, 2024 సంవత్సరాల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పలు అక్రమాలు జరిగాయన్న విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. అప్పటి ప్రధాని షేక్ హసీనాపై తిరుగుబాటుకు ఇది కూడా ఒక కారణం. హసీనా పదవీత్యుతురాలైన తర్వాత, బంగ్లాదేశ్‌లో ఏర్పడిన రాజకీయ గందరగోళానికి తెరదించుతూ, మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు విషయం తెలిసిందే. షేక్ హసీనా, ఆమె మంత్రివర్గ సహచరులతోపాటు, అప్పట్లో ఆమెకు అనుకూలంగా వ్యవహరించిన అధికారులు, ఆమె నేతృత్వం వహిస్తున్న అవామీ లీగ్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలపైన కూడా వివిధ కేసులు నమోదయ్యాయి. హసీనాపై అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం వంటి పలు కేసులు ఉండగా, గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై తాత్కాలిక ప్రభుత్వం ఏతరగరనర ఉధర్యమతవ కొడిద కమిటీని ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 30వ తేదీలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

### కల్తీ డీజిల్.. సిఎం కాన్వాయ్‌లోని

# 19 వాహనాలు బ్రేక్‌డౌన్!



**భోపాల్ :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. సిఎం కాన్వాయ్‌లోని 19 కార్లు ఒకేసారి బ్రేక్‌డౌన్ అయ్యాయి. దీంతో ఏం జరిగిందో అర్థంకాక అధికారులు కాసేపు తలలు పట్టుకున్నారు. అనుమానం వచ్చి డీజిల్ ట్యాంక్‌లను తెరిచి చూడగా.. అందులో నీళ్లు ఉండటంతో షాక్ అయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిఎం మోహన్ యాదవ్ గురువారం రాత్రి రత్లాంకు రోడ్డు మార్గంలో బయల్దేరారు. మార్గం మధ్యలో ఓ పెట్రోల్ బంక్ వద్ద వాహనాలకు డీజిల్ కొట్టించారు. ఆ తర్వాత కొంత దూరం ప్రయాణించిన వాహనాలు.. ఒకదాని తర్వాత ఒకటి తీవ్ర కుదుపులకు గురై ఒక్కసారిగా ఆగిపోయాయి. దీంతో ఏం జరిగిందో అర్థం కాక సిబ్బంది కాసేపు తలలు పట్టుకున్నారు. ఈ ఘటనతో అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సిబ్బంది వాహనాలను రోడ్డు పక్కకు తోసుకెళ్లారు. సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి చేరుకుని కార్లు ఎందుకు బ్రేక్‌డౌన్ అయ్యాయన్న దానిపై పరిశీలించారు. ఈ క్రమంలో డీజిల్ ట్యాంక్‌లను ఓపెన్ చేసిన చూడగా.. అందులో నీళ్లు ఉన్నట్లు గుర్తించారు. వాహనాల్లోని డీజిల్‌ను బయటకు తీసి చూడగా.. అందులో సగానికి పైగా నీళ్లే ఉన్నట్లు తేలింది. దీంతో అధికారులు సదరు పెట్రోల్ పంప్ వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. కల్తీని నిర్ధారించి ఆ పెట్రోల్ బంక్‌ను సీజ్ చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

# 'మహా' ప్రజలు హిందీ వ్యతిరేకులు కాదు : పవార్



**కొల్హాపూర్ :** మహారాష్ట్ర ప్రజలు హిందీ వ్యతిరేకులు కాదని, కానీ 14 తరగతి విద్యార్థులపై హిందీని రుద్దడం సరైనది కాదని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ శుక్రవారం అన్నారు. శుక్రవారం ఆయన కొల్హాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ జనాభాలో 55 శాతం మంది హిందీ మాట్లాడతారని, దానిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. మరాఠీ, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో 1 నుండి 5 తరగతుల వరకు విద్యార్థులకు హిందీని సాధారణంగా మూడవ భాషగా బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం గత వారం సవరించిన ఉత్తర్వు జారీ చేసిన తర్వాత మహారాష్ట్రలో భాషా వివాదం చెలరేగింది. ఆ ఉత్తర్వుల ప్రకారం... ఒక పాఠశాలలో తరగతికి 20 మంది విద్యార్థులు ఏదైనా ఇతర భారతీయ భాషను నేర్చుకోవాలనుకుంటే వారు హిందీని నిలిపివేయవచ్చు. అలాంటి డిమాండ్ తలెత్తితే, ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తారు లేదా ఆ భాషను ఆన్‌లైన్‌లో బోధిస్తారు. కాగా, 1–4 తరగతి విద్యార్థులపై హిందీని రుద్దడం సరైనది కాదని, ఈ యుగంలో మాతృభాష చాలా ముఖ్యమైనదని పవార్ అన్నారు, 5వ తరగతి తర్వాత అది వారి ప్రయోజనానికి ఉపయోగపడుతుందని, ఎందుకంటే భారతదేశంలో 55 శాతం మంది ప్రజలు ఈ భాషను మాట్లాడతారన్నారు. మహారాష్ట్ర ప్రజలు హిందీని వ్యతిరేకించడం లేదన్నారు. శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ థాక్రే ప్రకటించిన నిరసనల గురించి అడిగినప్పుడు, పవార్ మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీలు నిరసనలలో చేరాలని థాక్రే కోరుకుంటే, ఈ అంశంపై వారి వైఖరి, చ్ఛితమైన ప్రణాళికలను మనం తెలుసుకోవాలన్నారు. గురువారం సేన (యుబిటి), ఎంఎన్ఎస్ రాష్ట్ర విద్యార్థులపై హిందీని రుద్దే అన్ని ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని, ఇది 'భాషా అత్యవసర పరిస్థితి'ని విధించడానికి, 'మరాఠీనెస్'ని తొలగించడానికి పాలక వర్గం చేస్తున్న ప్రయత్నమని నొక్కి చెప్పారు. వేర్వేరు విలేకరుల సమావేశాలను ఉద్దేశించి ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే వరుసగా జూలై 7, 5 తేదీలలో నిరసనలను ప్రకటించారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు.. : ఆరా తీసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలుసుకుని చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వ అడ్వొకేట్‌ను హైకోర్టు కోరింది. మున్సిపల్ సంస్థల పాలకవర్గాలకు గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదో, ఎప్పుడు నిర్వహిస్తారో తెలియజేయాలని కోరింది. గత మార్చి 25న నిర్మల్ మున్సిపాలిటీ పాలకవర్గం గడువు ముగిసిన తర్వాత ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్రం, స్టేట్ ఎలక్షన్ కమిషన్‌లు చర్యలు తీసుకోవడం లేదంటూ ఆదే మున్సిపాల్టీలోని నటరాజ్‌నగర్‌కు చెందిన వ్యవసాయదారుడు సముందర్ పెల్లి రాజేందర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారించారు. ప్రభుత్వం నుంచి వివరాలు లె లసుకుని చెప్పేందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణను జులై 11కి వాయిదా వేశారు. .

# సున్నం చెరువు నీటితో ఆరోగ్యానికి కన్నం

● నీటి ట్యాంకర్లతో కలుషిత జలాల సరఫరా ● విద్యార్థుల ప్రాణాలతో వ్యాపారుల చెలగాటం ● సిపిబి పరిశోధనలో వెల్లడైన నిజం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాధాపూర్‌లోని సున్నం చెరువు చెంత బోర్లు వేసి, ఆ నీటితో ప్రజల ఆరోగ్యానికి కన్నం పెడుతున్నారు ఇక్కడి నీటి వ్యాపారులు. అక్రమంగా బోర్లు వేసి, కలుషిత జలాలతో మాధాపూర్ పరిసరాల్లో ఉన్న హాస్టళ్ల విద్యార్థుల భవిష్యత్‌ను అనారోగ్యం పాలు చేస్తున్నారు. ఐఐటితో పాటు వైద్య విద్యనభ్యసించడానికి ఉత్తమ ర్యాంకులు రావాలని ఆశిస్తూ అహర్నిశలు కష్టపడుతున్న విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. సున్నం చెరువు చెంతకు వెళ్తేనే దుర్వాసన భరించలేం. అలాంటి చోట బోర్లు వేసి ఆ నీటిని తాగునీటిగా మాధాపూర్ పరిసరాల్లోని విద్యా సంస్థలు, వసతి గృహాలు, హోటళ్లకు సరఫరా చేసి ప్రాణాలమీదకు తెస్తున్నారు.

**పిసిబి ద్వారా నీటి నాణ్యత పరీక్షలు..**

ఈ చెరువును పునరుద్ధరించే క్రమంలో హైడ్రా అక్కడి భూ గర్భ జలాలు ఎంతటి ప్రమాదకర స్థాయిలో ఉన్నాయో అ నే అంశాన్ని టిజి పిసిబి (తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలి) ద్వారా పరీక్షించింది. తాగునీటిగా సరఫరా చేస్తున్న ట్యాంకర్‌లలోని నీటి నమూనాలపై అధ్యయనం చే యించింది. సీసం, కాడ్మియం, నికెల్ లోహాల మోతాదులు అధికంగా ఉన్నాయని, ఈ పరిశోధనల్లో వెల్లడైంది. ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టిజి పిసి బి హెచ్చరించింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన మోతాదులో కాకుండా, రెండింతలు, మూ డింతలు, 12 రెట్లు అధికంగా ఉండి ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయని బిసిబి పరిశోధనల్లో వెల్లడైంది.

**12 రెట్లు అధికంగా సీసం..**

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక లీటరు నీటిలో 0.01 మిల్లీగ్రాముల సీసం వరకు ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కాని సున్నం చెరువు చుట్టూ ఉన్న బోరు నీ టి లో 0.073 0.122 ఉన్నట్టు పిసిబి గుర్తించింది. అంటే అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఫర్వాలేదు అనుకునే స్థాయిలో 7 నుంచి 12 రెట్లు అధికంగా ఉన్నట్టు తేలింది. దీంతో పిల్లల మెదడు చురుకుతనంపై ప్రభావం చూపుతోంది. జ్ఞాపిక శక్తిని తగ్గిస్తుంది. రక్తహీనతకు కారణమవ్వడమే కాకుండా, బాల్యం, యవ్వన దశలోనే కిడ్నీలపై ప్రభావం చూపుతుంది. రక్తపోటు, గుండె సంబంధిత వ్యా ధులు, సంతానోత్పత్తిపైనా ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు.

**2 నుంచి 3 రెట్లు అధికంగా కాడ్మియం..**

కాడ్మియం 0.003 వరకూ ఫర్వాలేదు అని అంతర్జాతీయ ప్రమాణాలు చెబుతున్నాయి. అయితే సున్నం చెరువు పరిసరాల్లోని బోరు వాటర్లో 0.007 0.010 ఉన్నట్టు వెల్లడైంది. 2 3 రెట్లు అధికం ఉంది. అధిక మొత్తంలో ఉన్న కాడ్మియం మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది. మూత్రం ద్వారా ప్రొటీన్లు పోవడంతో ఎముకుల బలహీనతకు దారి తీస్తుంది. క్యాన్సర్ వ్యాధికి కారణమౌతుందని ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ వెల్లడించింది.

**రెండురెట్లు అధికంగా నికెల్..**

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక లీటరు నీటిలో 0.02 మిల్లీగ్రాముల మోతాదులో నికెల్ ఉంటే ఫర్వాలేదు. కానీ సున్నం చెరువు చెంత ఉన్న బోర్లలో 0.038 0.046 అధికంగా ఉన్నట్టు వెల్లడైంది. అంటే 2 రెట్లు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. మనం తాగే నీటిలో నికెల్ ఎక్కువ ఉంటే, చర్మ సంబంధిత వ్యాధులతో పాటు కాలేయం దెబ్బతింటోంది. తద్వారా మూత్రపిండాలు దెబ్బతింటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధిక ఒత్తిడికి గురై చిన్న వయసులోనే రక్తపోటుకు కూడా కారణమౌతుందని వైద్యులు చెబుతున్నారు.

**మరగబెట్టినా వదలని కాలుష్యం..**

సహజంగా నీటిని మరగబెట్టి తాగండి అంటారు, కాలుష్య సాగరాల చెంత ఉన్న బోర్ల నుంచి వచ్చే నీటిని మరగబెట్టి వినియోగించినా ప్రయోజనం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇందులో శూక్ష్మ క్రిములు నశించినా, సీసం, కాడ్మియం, నికెల్ వంటి భార లోహాలు కరగకపోగా, మరింత దగ్గరగా మారి ప్రమాదకరంగా పరిణమిస్తాయని హెచ్చరిస్తున్నారు. సున్నం చెరువు చెంతనే కాకుండా, నగరంలోని కాలుష్య సాగరాలు, మురుగు కాలువల చెంత ఉన్న నివాస ప్రాంతాల్లోని భూగర్భ జలాలది ఇదే పరిస్థితి ఉందని పిసిబి పరిశోధనల ద్వాదా వెల్లడైంది. సున్నం చెరువు చెంత బోరు నీటిని తాగునీటి అవసరాలకు అమ్ముతున్నవారిపై హైడ్రా పోలీసు కేసులు నమోదు చేసింది.

**సున్నం చెరువుకు మొదటి ప్రాధాన్యం..**

ఇంతటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నందునే హైడ్రా సున్నం చెరువు పునరుద్ధరణకు మొదటి ప్రాధాన్యతనిచ్చింది. నగరంలో చేపడుతున్న 6 చెరువుల (మాధాపూర్‌లోని సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువు, అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుక్ నుద్దౌలా చెరువు) పునరుద్ధరణలో సున్నం చెరువు ఉంది. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల సరిహద్దులోని గుట్టల బేగంపేట, అల్లాపూర్ గ్రామాల మధ్య సున్నం చెరువు 32.60 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును కాలుష్యం నుంచి కాపాడి, మంచి నీరు నిలిచేలా దాదాపు రూ. 10 కోట్లతో హైడ్రా అభివృద్ధి పనులు చేపట్టింది.

## వికలాంగులకు తోడుగా ఉంటా

ఎస్‌టి మైనారిటీ వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వికలాంగులకు పెద్దన్నలా అనుక్షణం తోడుగా ఉంటా అని ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం హెలెన్ కిల్లర్ 145వ జయంతి సందర్భంగా మలక్‌పేట్‌లోని వికలాంగుల, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్‌ల సంక్షేమం సహకార శాఖ కమిషన్ రేట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వికలాంగుల పార్క్‌లోని హెలెన్ కిల్లర్ విగ్రహానికి పూల మాలతో సత్కరించారు. అక్కడే ఆవరణలో ఉన్నా బధిరుల స్కూల్ విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. స్వయంగా మంత్రి బదిర విద్యార్థులకి భోజనం వడ్డించడంతో వికలాంగుల సంఘాలు హర్షంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేను అట్టడుగు వర్గాల నుండి,పేద కుటుంబాల నుండి వచ్చానని, సామాన్యుల బాధలు నాకు తెలుసు అని నాపై నమ్మకం ఉంచి తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఈ సంక్షేమ శాఖ లు కేటాయించారని తెలిపారు. రాబోయే రోజుల్లో వికలాంగుల సంక్షేమం అద్భుతంగా చేస్తాను అని, వారి హక్కుల ను కాపాడతాను అని, వికలాంగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా, వారీ ఆర్థిక అభివృద్ధే మొదటి లక్ష్యంగా పనిచేస్తామని తెలియ జేశారు. గత ప్రభుత్వం వికలాంగుల కార్పొరేషన్ కి 10 ఏండ్లలో 64 కోట్లు కేటాయిస్తే రెండు సంవత్సరాలు లోనే 100 కోట్లు కేటాయించిన ఘనచరిత్ర రేవంత్ రెడ్డిదని అన్నారు .

**వైఐఐఆర్ఎస్ ప్రాజెక్ట్‌కు సహకరించాలని కేంద్ర మంత్రికి వినతి**

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగుపరచేందుకు ప్రభుత్వం 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (వైఐఐఆర్ఎస్) ప్రాజెక్టును చేపట్టింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ మేరకు ఇప్పటివరకు రూ.200 కోట్లు ఖర్చుతో 55 పాఠశాలల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాల విద్యను అందించనున్నాయి. ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించాల్సిందిగా కేంద్ర మంత్రి రాందాస్ గారికి రాష్ట్ర మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ గారు విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి వర్గాల అభివృద్ధికి గాను రూ.232.68 కోట్లు, పిఎం ఎజెఎవై పథకం కింద రూ.36.13 కోట్లు మంజూరు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్మ ణ్ కోరారు.

## పివి స్ఫూర్తితోనే విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళన : సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ ప్రధానమంత్రి,బహుభాషా కోవిదుడు,రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పి.వి.నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పి.వి.నరసింహారావుకు దక్కుతుందని సిఎం కొనియాడారు. పివి స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. నాడు పివి చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారని, నవోదయ విద్యాలయాలు పివి హయాంలోనే ఏర్పాటు చేశారని, ఉమ్మడి రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పి, గురుకుల విద్యకు ఆయన తొలి అడుగులు వేశారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించదని చెప్పారు. అన్ని వర్గాల విద్యార్థులకూ నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగాప్రభుత్వం పని చేస్తుందన్నారు.

## విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

విద్యుత్ శాఖపై డిప్యూటీ సిఎం సమీక్ష



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రానున్న పది సంవత్సరాలకు రాష్ట్రంలో ఏర్పడనున్న విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజాభవన్‌లో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, జెన్కో డైరెక్టర్లతో డిప్యూటీ సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023 మార్చిలో వచ్చిన 15,497 మెగావాట్ల పీక్ డి మాండ్, 2025 మార్చిలో వచ్చిన 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 2029–30 నాటికి ఎంత మేరకు డిమాండ్ పెరుగుతుంది, అదే పద్ధతిలో 2030–35, 2047 సంవత్సరాలకు ఏర్పడే విద్యుత్తు డిమాండ్ అందుకు అనుగుణంగా వివిధ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలపై ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవ నం, పెరుగుతున్న పరిశ్రమలు, వ్యవసాయ వినియోగం, మారిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా పెరగనున్న విద్యుత్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్‌కో సిఎండి హరీష్, రెడ్‌కో విసిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు.

## బిసి బిల్లు కోటాపై చొరువ చూపండి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లులను తర్వగా ఆమోదించేలా చొరువ తీసుకోవాలని కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలేకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర మంత్రి అథవాలేను ఎంఎల్‌సి కవిత శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు రూప్ సింగ్, మరిపల్లి మాధవి, మహేందర్ ముదిరాజ్, మనోజ్ గౌడ్, యూనైటెడ్ ఫులే ఫ్రంట్ కన్వీనర్ బొల్ల శివ శంకర్, కో ఆర్డినేటర్ ఆలకుంట హరి, నాయకులు విజయేంద్ర సాగర్, మాదవ్ మేరు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంసికి భూమి కేటాయింపు రద్దు

హైకోర్టు తీర్పు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఎఎంసి)కి గతంలో 3.7 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడాన్ని హై కోర్టు తప్పుపట్టింది. భూమిని కేటాయిస్తూ 2021లో వెలువడిన జిఒను రద్దు చేసింది. ఐఎఎంసి నిర్వహణకు రూ.3కోట్లు నిధులను కేటాయింపునకు వెలువడిన మూ డు జిఒలను ఆమోదించింది ఐఎఎంసీకి 3.70 ఎకరాల భూమి, నిర్వహణ నిమిత్తం ఆర్థిక సాయంగా రూ. మూ డు కోట్లు చెల్లింపులకు విడుదల చేసిన మూడు జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన రెండు వేర్వేరు పిల్స్‌పై శుక్రవా రం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మ ణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్‌లోని సర్వే 83/1లో 3.70 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 126ను జారీ చేసింది. ఐఎఎంసి నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఏటా రూ.3 కోట్ల నిధులను విడుదలకు సంబంధించిన జీవోలు 76,6,365లను కూడా జారీ చేసింది. వీటిని కొట్టేయాలంటూ అడ్వొకేట్లు వెంకట్రామిరెడ్డి, కోటి రఘునాథరావు వ్యక్తిగత హోదాలో పిల్స్ వేశా రు. దీనిపై హైకోర్టు ఇచ్చిన తీర్పులో.. ల్యాండ్ రెవెన్యూ రూల్స్ 1975 నిబంధనను ప్రభుత్వం ఉల్లంఘించి భూ కేటాయింపు చేసింది, ఐఎఎంసి కంపెనీల చట్టం కింద నమోదు కాలేదు. దీని ప్రకారం కూడా భూకేటాయింపు చెల్లదు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థకు ఉచితంగా బదిలీ చేయడానికి వీల్లేదు. నిధుల కేటాయింపు సబబే. అయితే, ఆ నిధుల కేటాయింపులు ఐదేళ్ల తర్వాత కూడా కొనసాగింపు అంశంపై ప్రభుత్వం ఆలోచన చేయాలి. నిధులను కేటాయింపు చేస్తున్నప్పటికీ ఐఎఎంసి పనితీరు సంతృప్తికరంగా లేదు. గత 4 సంవత్సరాలు ఐఎఎంసీ పని తీరు ఆశాజనకంగా లేదు. ఇందుకు కేసుల పరిష్కార లెక్కలే నిదర్శనం. గత జనవరి నాటికి 15 ఆర్బిట్రేషన్ కేసులను నిర్వహిస్తే అందులో 11, మీడియేషన్ కేసులు 57 కిగాను 17 చొప్పున కొలిక్కి వచ్చాయి. దీనికితోడు ఐఎఎంసి ట్రస్ట్ బోర్డు తమ ఆస్తులను విక్రయించేందుకు వీలుగా నిబంధన 6(డి) చేర్చడం తీవ్రమైన విషయం. ఇలాంటి నిబంధన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఖరీదైన ప్రాంతంలో 3.7 ఎకరాలను ఉచితంగా ఇవ్వడం చెల్లదు. ప్రభుత్వం నుంచి ప్రైవేట్ సంస్థ అయిన ఐఎఎంసి శాశ్వత ప్రాతిపదికపై ఆర్థిక సాయం పొందరాదు. ఐదు ఏళ్ల తర్వాత ఆర్థిక సాయం కొనసాగించాలో లేదో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఆలోచన చేయాలి.. అని చెప్పింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యంరెడ్డి వాదిస్తూ, కోట్ల రూపాయల విలువైన 3.70 ఎకరాల ప్రభుత్వ భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఐఎఎంసీకి కేటాయించడం దారుణం. దీనివల్ల రాష్ట్రానికి తీరని నష్టం. ప్రైవేటు ట్రస్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా నిధులను కేటాయించడమేగాకుండా నిర్వహణకు నిధులు కేటాయించడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమే. అని వాదించారు. ఐఎఎంసి తరఫున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ, ప్రజాప్రయోజనాల కోసమే ప్రభుత్వం భూమి/నిధులు ఇచ్చిందన్నారు. రాష్ట్రం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, కేసుల రాజీ ద్వారా పరిష్కరించుకోవడం ద్వారా కోర్టులపై కేసుల భారం తగ్గుతుందని, ఇందులో ప్రజాహితం ఉన్నందునే ప్రభుత్వం భూమి/నిధులు ఇవ్వాలనే నిర్ణయం తీసుకుందన్నారు. కోర్టులపై కేసుల పెండెన్సీ తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పరిష్కార వివాదానికి ప్రాధాన్యం ఇవ్వాలనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఐఎఎంసీ ట్రస్ట్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయశాఖ మంత్రితోపాటు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తులు ట్రస్టీలుగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లోఒక్క రూపాయి దుర్వినియోగం కాలేదన్నారు. ఈ విధంగా గత జనవరి 28న జరిగిన తుది వాదనల తర్వాత పిటిషన్లను అనుమతిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది.

## సెక్యులరిజం, సోషలిజం అంశాలు తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్ర : జి.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కవచంగా నిలిచిన ప్రియాంబుల్‌లోని సెక్యులరిజం, సోషలిజం అంశాలను తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్రకు పాల్పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఆరోపించారు. భారతదేశ సార్వభౌమత్వానికి, అన్ని కులాలు, మతాలు, అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగంలోని ప్రియాంబుల్ రక్షణగా నిలుస్తోందని, అందులోని కీలకమైన సెక్యులరిజం, సోషలిజం అంశాలను తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భారత దేశానికి సెక్యులరిజం అవసరం లేదా..?ఆయన ఆర్ఎస్ఎస్ నాయకులను ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ నాయకులకు దేశ ప్రజల క్షేమం అవసరం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, కేవలం మతపరమైన రాజకీయాలే వారికి అవసరమని చిన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రియాంబుల్‌లోని సెక్యులరిజం, సోషలిజం అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పార్లమెంటు ఆమోదంతో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ చేర్చారని, అది దేశంలోని అన్ని కులాలు, మతాల వారికి రక్షణగా ఉందన్నారు. దేశంలో అన్ని కులాలు, మతాల కుటుంబీకులలో నిరుపేదలు ఉన్నారని, మధ్యతరగతి వర్గాలతో పాటు అపర కుబేరులకు సహితం ప్రియాంబుల్ రక్షణగా ఉందన్న వాస్తవాన్ని ఆర్ఎస్ఎస్ పెద్దలు గ్రహించాలని చిన్నారెడ్డి సూచించారు.

## డిటిసిపి డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ అదనపు బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించి చేపట్టిన ఫ్యూచర్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంలో నిపుణులుగా సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారిగా పేరున్న ఎస్.దేవేందర్ రెడ్డిని ఫ్యూచర్ సిటీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పట్టణ ప్రణాళిక డైరెక్టర్‌గా డిటిసిపి డైరక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డిని నియమిస్తూ మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి డాక్టర్ కె. ఇలంబర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ మేరకు దేవేందర్ రెడ్డి శుక్రవారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ అదనపు పట్టణ ప్రణాళిక డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. దీంతో, డిటిసిపితో పాటు ఫ్యూచర్ సిటీ బాధ్యతలు కూడా ఆయన నిర్వర్తించనున్నారు. ఫ్యూచర్ సిటీ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించిన అనంతరం పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుంది.

**జులైలో ఫ్యూచర్ సిటీలో మరిన్ని నియామకాలు..**

వచ్చే నెలలో ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో నియామకాలు ఊపందుకోనున్నాయని సమాచారం. ముఖ్యంగా జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ నుంచి లేఔట్ అనుమతులు, ప్లానింగ్, డెవలప్‌మెంట్ తదితర అంశాలపై పట్టున్న సీనియర్ అధికారులను నియమించే ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే, ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ తదితర కీలక అంశాలపై అధికారులు దృష్టి సారించారు.

## జస్టిస్ రాధారాణికి హైకోర్టు వీడ్కోలు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఫస్ట్ కోర్టు హాల్లో వీడ్కోలు సమావేశం జరిగింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సు జోయ్‌పాల్ అధ్యక్షతన న్యాయమూర్తులు సమావేశమయ్యారు. ఆమె సేవల్ని ఎసిజె కొనియాడారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌బాడి ప్రవీణ్‌కుమార్, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్(హెచ్‌సిఎఎ) అధ్యక్షుడు జగన్, సిబ్బంది పాల్గొన్నారు.జస్టిస్ రాధారాణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.జస్టిస్ రాధారాణి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం హెచ్‌సిఎఎ ఆధ్వర్యంలో ఆమెకు వీడ్కోలు సమావేశం జరిగింది.

## రోడ్లు, భవనాల శాఖ బలోపేతంపై మంత్రి ప్రత్యేక దృష్టి

64 మంది డిఇలకు ఇఇలుగా పదోన్నతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు భవనాల శాఖను మరింత బలోపేతం చేసేందుకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శాఖను పటిష్ట పరిచేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్న మంత్రి గతంలో పెద్ద ఎత్తున ఎఇ, డిఇ, ఇఇ, ఎఇలకు ప్రమోషన్స్ పోస్టింగ్ ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఒకే రోజు 64 మంది డిప్యూటీ ఇంజనీర్లుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ప్రమోషన్‌తో పాటు పోస్టింగ్ ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. శాఖ బలోపేతం కోసం ఇంజనీర్లు అత్యంత కీలకంగా పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖకు మంచి పేరు తెచ్చేలా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని,సడలింపులు ఇచ్చి మరి ప్రమోషన్స్,బదిలీలు చేశారని ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నాయకత్వంలో రోడ్లు భవనాలు శాఖ బలోపేతానికి కష్టపడతామన్న ఇంజనీర్లు పేర్కొన్నారు.మంత్రి సూచనల మేరకు ప్రజల్లో మన్ననలు పొందేలా పని చేస్తామని..ఈ సందర్భంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కాళ్లు, చేతులు కట్టేసి బందీలుగా గదుల్లో...



ఓల్డ్ ఏజ్ హోంలో ఘోరం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ నోయిడాలో సెక్టార్ 55లోని ఆనంద్ నికేతన్ వృద్ధాశ్రమంలో అవమానకర సన్నివేశాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ ఉంటున్న వృద్ధులను జంతువులాగా కాళ్లు, చేతులు కట్టేసి గదుల్లో బంధించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడం వల్ల అధికారులు ఆ వృద్ధాశ్రమంపై దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 40 మందిని సురక్షితంగా రక్షించి ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించనున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డా. మీనాక్షి భరాలా తెలిపిన వివరాల ప్రకారం నోయిడాలో సెక్టార్ 55లోని ఆనంద్ నికేతన్ వృద్ధాశ్రమంలో ఓ వృద్ధురాలిని కట్టేసి గదిలో బంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యింది. ఇది కాస్త లక్నోలోని సాంఘిక సంక్షేమ శాఖకు చేరుకుంది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు డా. మీనాక్షి బృందం పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే అక్కడ బందీగా ఉన్న 40 వృద్ధులను సురక్షితంగా రక్షించి, ఆశ్రమాన్ని సీజ్ చేశారు. తనిఖీలు చేస్తున్నప్పుడు ఓ వృద్ధురాలు గదిలో బందీగా ఉందని ఆమె ఒంటిపై సరైన దుస్తులు కూడా లేవని అధికారులు తెలిపారు. చాలా మంది పురుషుల ఒంటిపై కూడా దుస్తులు లేవని పేర్కొన్నారు. ఆశ్రమంలో వారిని చూసుకోవడానికి సరైన సిబ్బంది లేరని, రోజూవారి పనులు వారే చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా చాలా మంది వృద్ధుల దుస్తులు మలమూత్రవిసర్జనలతో తడిసిపోయాని చెప్పారు. ఇన్ని రోజులు వారు చాలా నరకం అనుభవించి ఉంటారని అధికారులు వివరించారు. అయితే, విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆనంద నికేతన్ వృద్ధాశ్రమంలో ధనిక కుటుంబాలకు చెందిన వారి తల్లిదండ్రులు కూడా ఉన్నారు. వీరిని చూసుకోవడానికి ప్రతి వ్యక్తి వద్ద నుంచి రెండున్నర లక్షల రూపాయలు తీసుకుంటారు. దీనితో పాటు భోజన వసతి కోసం నెలకు ఆరు వేల రూపాయలు అదనంగా తీసుకుంటారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడినప్పుడు అంతా బాగానే ఉందని వారు చెప్పేవారని సమాచారం.

## సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో అనారోగ్యంతో భాధపడుతున్న గంజి శివ జ్యోతి వైద్య ఖర్చుల నిమిత్తం సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి చెక్కు రూ.51 వేలను శుక్రవారం లక్కారం కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మునుగోడు కాంగ్రెస్ సమన్వయ కర్త, ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజుగౌడ్, మండల అధ్యక్షులు బోయ దేవందర్, మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నర్సింహా గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారుని కుటుంబ సభ్యులకుఅందజేశారు. కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ భార్గవ్, కొయ్యలగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్రగుంట వెంకటేశం, కొయ్యలగూడెం కాంగ్రెస్ కన్వీనర్ మాచర్ల సంతోష్ కుమార్, ఎర్రగుంట నరసింహ, ఏల మురళి, పొట్ట బత్తిని పురుషోత్తం పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆగవు



**ప్రజాపక్షం/నాంపల్లి:** గ్రామ పంచాయతీల అక్రమ అరెస్టులు పోరాటాలను ఆపలేవని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. శుక్రవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి సందర్భంగా ఆ సంఘం నాయకుల్ని, గ్రామపంచాయతీ సిబ్బందిని పోలీస్ స్టేషన్ లో అక్రమ అరెస్టు చేసారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని జీతాలు పెంచి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. నాడు ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదని వాపోయారు. గాదెపాక మరియమ్మ, ఎదుల్ల రాములమ్మ, ఈరమ్మ, సులోచన, చంద్రమ్మ, వెంకటయ్య, తేజ ఉన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధిః** విద్యార్థులు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో మెరుగైన ఫలితాల కోసం అవసరమైన మెటీరియల్‌ను జిల్లా కేంద్రంలోని విశ్వేశ్వరయ్య మెమోరియల్ హై స్కూల్‌లో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పి.సాయిబాబ, గంజ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.మహేశ్వర్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. పాఠశాల చైర్మన్ పి.సాయిబాబ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఈ మెటీరియల్లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి భవిష్యత్తు పోటీ పరీక్షలు యందు మంచి మార్కులు సాధించడానికి ప్రయత్నం చేయాలని అభిలషించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పి.సాయిబాబ, గద్వాల న్యాగంజ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.మహేశ్వర్‌రెడ్డి, గంజ్ కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ బి.జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌మోహన్, కోశాధికారి కె.తారనాథ్, డైరెక్టర్స్ వి.నర్సింహులు, కె.రాముడు, యన్.భాస్కర్, యన్.రామాంజనేయులు, పాఠశాల ప్రిన్సిపాల్ భారతి, ఫడ్నిస్ , ప్రధానోపాధ్యాయులు ఈ.కిషోర్ కుమార్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ సిఐకి అభినందన



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** జైలు శిక్ష అనుభవిస్తూ పెరోల్‌పై బయటకు వచ్చి ఆరు సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్న ఖైధీని అరెస్టు చేసిన కేసులో హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజును, మఠంపల్లి పోలీసులను, జిల్లా ఐటి కోర్ సిబ్బందిని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ శుక్రవారం అభినందించారు. ఐజీ కార్యాలయం నుండి వచ్చిన మెరిటోరియస్ సర్వీస్ రివార్డును ఎస్పీ కె. నరసింహ సీఐ చరమందరాజుకు అందించారు.ఎస్పీ మాట్లాడుతూ ఉత్తమంగా విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందికి అందించే రివార్డులల్లో అత్యుత్తమమైనది మెరిటోరియస్ సర్వీస్ రివార్డు అని తెలిపారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడే ప్రతి పోలీస్‌కు అరుదైన గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లి సిఐగా నవీన్‌కుమార్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** కొండమల్లేపల్లి సిఐగా నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో నాంపల్లి సిఐగా పనిచేసిన ఈయన మల్టీజోన్ ఐజీ ఆఫీస్‌కు బదిలీపై వెళ్ళి తాజాగా మళ్ళీ కొండమల్లేపల్లి సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కొండమల్లేపల్లి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిస్వార్థంగా పనిచేస్తానని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, మాదక ద్రవ్యాల సరఫరాకు అడ్డుకట్ట వేసి, చోరీలపై నిరంతరం నిఘా ఉంచుతామని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## 30వరకు సన్నబియ్యం : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** మూడు నెలల సన్నబియ్యం పంపిణీకి ఈనెల 30 తేదీ వరకే గడువు ఉందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు తమ సమీపంలోని రేషన్‌డీలర్ దుకాణం వద్దకు వెళ్లి మూడు నెలల బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. బియ్యం పంపిణీ విషయంలో పొడగింపు ఉత్తర్వులు ఏమీ లేవని చెప్పారు.

## పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలి



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్:** పదోన్నతి పొందిన ఎస్.ఐలకు పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని క్రమ శిక్షణతో, బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఆరుగురు ఏఎస్ఐ లకు, ఎస్.ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ స్టార్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని,పోలీసు స్టేషనుకు వచ్చే పిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడుతూ సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తూ తమకు అప్పగించిన విధులను క్రమ శిక్షణతో బాధ్యతతో పని చేయాలని అన్నారు.అప్పుడే పోలీస్ శాఖకు గౌరవం వస్తుందన అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సంఘం అధ్యక్షుడు జయ రాజు పదోన్నతి పొందిన ఎస్.ఐ లు తదితరులున్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా.. ప్రభుత్వ కళాశాలలు

### కళాశాల టాపర్‌కు గోల్డ్ మెడల్ ఇస్తా

### భారీ నీటిపారుదల,ఆహార, పౌరసరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః** కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్, డిగ్రీ కళాశాలలను ఆధునీకరించడం జరుగుతుందని, విద్యార్థులకు మంచి వసతులతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని భారీ నీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖామాత్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల నూతన భవనాల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ యావత్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు కావాల్సిన మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాలలు శిధిలావస్థకు చేరడంతో నూతన భవనాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. త్వరతగతిన కళాశాలల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. అందుకోసమే జూనియర్ కళాశాల నిర్మాణాలకు రూ.7 కోట్ల 20 లక్షలు, డిగ్రీ కళాశాల నిర్మాణాలకు రూ.4 కోట్ల 65 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరీ చేయడం జరిగిందని తెలియజేశారు. నిరుపేదల కుటుంబాలకు చెందిన పిల్లలే ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో చదువుకుంటారని వారందరికీ నాణ్యమైన విద్యను అందించడమేతెలంగాణ ప్రజా ప్రభుత్వం యొక్క లక్ష్యం అన్నారు. తమ పిల్లలకు సరైన, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దినట్లేనన్నారు. హుజూర్‌నగర్,కోదాడలలోని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో కావాల్సిన వసతులు కల్పనే ధ్యేయంగా తాము కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఫైనల్ ఇయర్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు తమ స్వంత బడ్జెట్ నుండి గోల్డ్ మెడల్ అందిస్తానని విద్యార్థులనుద్దేశించి మంత్రి హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ హుజూర్‌నగర్,కోదాడ నియోజకవర్గాలలో ఉత్తమ్ పద్మావతిలు చేసిన అభివృద్ధి పనులను గురించి ఒక్కొక్కటిగా చెబుతూ కొనియాడారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఈదుగంటి సుబ్బారావు, రాష్ట్ర నాయకులు సాముల శివారెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు,మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, గెల్లి అర్చన రవి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లిఖార్జున్,ముడెం గోపిరెడ్డి, బెల్లంకొండ గురవయ్య,మేళ్ళచెర్వు ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

## సబ్జెక్టుపై పూర్తి పట్టు ఉంటేనే విషయ పరిజ్ఞానం

### నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యార్థులు సబ్జెక్టుపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.శుక్రవారం ఆమె కనగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సిఈసి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు .ఎకనామిక్స్ సబ్జెక్టుపై ఆమె మాట్లాడుతూ సబ్జెక్టు విషయాలపై పూర్తిపట్టు ఉన్నప్పుడే పరీక్షల్లో మంచి సమాధానాలు రాయగలుగుతారని, అంతేగాక విషయపరిజ్ఞానం వస్తుందని, పోటీ పరీక్షల సమయంలో సైతం ఇది ఉపయోగపడే అవకాశం ఉంటుందని తెలిపారు .ఈ సందర్భంగా విద్యార్థుల లక్ష్యాలు ,వారి విద్యా సామర్థ్యాలు, తదితర విషయాలను పరిశీలించారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చిన వారికి జిల్లా కలెక్టర్ చాక్లెట్లను పంపిణీ చేశారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ కనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను సందర్శించి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయదేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు ,మార్కెటింగ్ సెక్రటరీ శ్రీధర్ రాజు, తదితరులు ఉన్నారు.

## అవినీతికి తావులేదు.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

### కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నియోజకవర్గ అభివృద్ధే తనలక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా అవినీతికి తావులేద్నన్నారు. గత్తేదారుల పనుల్లో నాణ్యత లోపిస్తే తన దృష్టికి తేవాలన్నారు. 18 నెలల కాలంలో కోదాడ నియోజకవర్గానికి సుమారు రూ.రెండువేల కోట్ల రూపాయలు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేయించామన్నారు. గ్రామీణ అభివృద్ధి రోడ్లు, వ్యవసాయం, నీటిపారుదల, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా నాదృష్టికి తీసుకరాండి వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారదులు విలేకరులే అని కితాబిచ్చారు. ఈ విలేకరుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు తమకు ఏళ్ల తరబడి ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీలు ఇ చ్చారే తప్ప అమలు చేయడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా తప్పకుండా విలేకరులందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామన్నారు. సంక్షేమ పథకాల్లో అర్హులైన విలేకరులకు ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో కోదాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పదంలో నడిపించి రాష్ట్రంలో ఆదర్శనియోజకవర్గంగానిలుపుతామని అన్నారు.

## మళ్లీ నేరాలకు పాల్పడితే పూచికత్తు నగదు చెల్లించాల్సిందే : ఎస్‌పి నర్సింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** నేరస్తులు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడితే పూచికత్తు నగదు చెల్లించాలని జిల్లా ఎస్పి కె. నర్సింహ అన్నారు. అలవాటుగా నేరాలకు పాల్పడే వారిని ప్రజలను ఇబ్బందులను గురిచేసే వారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని, సస్పెక్టడ్ రౌడిషీటర్స్ మళ్లి నేరాలకు పాల్పడితే ఆరు నెలలు, సంవత్సర కాలం పూచికత్తు బైండోవర్ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పి కె.నర్సింహ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడితే మొత్తం రూ. పూచికత్తులు చేపడతారో ఆ డబ్బులు మండల మేజిస్టేట్ (తహసిల్దార్) ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ ఖాతా నందు జమచేయడం జరుగుతుందని తెలిపారు. గత మార్చినెలలో మిర్యాల గ్రామంలో జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడు ఏ1 కనకటి వెంకన్న అలియాస్ వెంకటేశ్వర్లు, ఎ2 కనకటి శ్రావణ్ ఈ హత్య జరగడానికి ముందు జామిన్‌గా ఉన్న తగదా విషయంలో 9నెలల క్రితం ఒక్క సంవత్సర కాలానికి నూతన్‌కల్ తహసిల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందన్నారు. వీరిద్దరు బైండోవర్ కాలపరిమితి నిబంధనల ప్రకారం రూ. లక్ష పూచికత్తు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ ఖాతా నందు ఒక్కొక్కరికి రూ.లక్ష రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. వీరు ఇద్దరు హత్య కేసులో ప్రధాన నిందితులు అని పిడియాక్ట్ నమోదు చేయబడి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. బైండోవర్ కేసుల్లో ఉల్లంఘనలు అతిక్రమిస్తే ఎంతటివారినైన ఈలాంటి కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

## స్థానిక ఎన్నికలపై నిలదీసే హక్కు బిజెపికి లేదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగే హక్కు బిజెపికి లేదని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి నియోజకవర్గ నాయకులు చేగొండి మురళీయాదవ్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 2023 డిసెంబర్ 7న ఏర్పడిన తరువాత కులగణన చేపట్టి బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మాణం చేసి గవర్నర్‌తో ఆమోద ముద్ర వేయించి కేంద్రానికి పంపితే అక్కడ బిల్లు ఆమోదించకుండా కాలయపాన చేస్తున్న బీజేపీ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించమని అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన అఖిల పక్ష బీసీ నాయకులను ప్రధాని వద్దకు తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బీసీలకు ప్రధాన శత్రువు బీజేపీ అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లును ఆమోదింపజేయాలన్నారు. జూలై 14న తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో4 2 శాతం రిజర్వేషన్లను అమలుచేశాకే స్థానిక సంస్థలకు వెళ్లాలని డిమాండ్‌తో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పిల్లలకు అర్థమయ్యేలా బోధన

### యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రిః** 2025–2026 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ కళాశాలలో, ప్రభుత్వపాఠశాలలోఎక్కువగాఅడ్మిషన్లు అయ్యేలా చూడాలని, విద్యార్థిని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుకై, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, మండల ఎడ్యుకేషన్ అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తునందున అదే దిశగా ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలాలక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకోవాలని సూ చించారు. నాణ్యమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు వెయ్యి కోట్లతో సంక్షేమనిధి ఏర్పాటేది?

### గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరస్వామి



**ప్రజాపక్షం/చండూరుః** గీత కార్మికులకు వెయ్యికోట్ల తో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని ,మునుగోడు నియోజకవర్గంలో నీరా పరిశ్రమను ఏర్పాటు చేయాలని గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనంలో గీతాపనివారల సంఘం మండల 15వ మహాసభ సంఘం మండల అధ్యక్షుడు గంట రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరస్వామి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ గీతా కార్మికుల సంక్షేమం కోసం వెయ్యికోట్ల రూపాయలతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి గీతాకార్మికులను ఆదుకోవాలని డిమాం డ్ చేశారు. కార్మికులు ప్రమాదవశాత్తు చెట్లపై నుండి పడితే పాతపద్దతిప్రకారంమెడికల్ సర్టిఫికెట్ ద్వారానే ఎగ్రేషియాను చెల్లించాలనికోరారు. 2022 నుండి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న13కోట్ల ఎగ్రేషియాను,నల్లగొండ జిల్లాలో 2కోట్ల 25లక్షల ఎగ్రేషియా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గీతపనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి గీతాకార్మికుడికి వృత్తి పెన్షన్‌ను మం జూరు చేయాలన్నారు.చండూరు ఎఎంసి డైరెక్టర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్‌కుమార్, గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య, మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, గీత పనివారల సంఘం మండల అధ్యక్షుడు గంట నగేష్ , బరిగెల వెంకటేష్ , బండమీది వెంకన్న, పాల కూరిసత్తయ్య,గడ్డం నవీన్,పల్లెనర్సింహ్మా,బోయపల్లి అంజయ్య,గుణగంటి యాదయ్య, బోయపల్లి శంకరయ్యఉన్నారు.

# రాములోరి సొమ్ము నాయకుల పాలు



## సిండికేట్ కాకుండా వేలంపాట పాడుతారా? –పక్కదారి పడుతున్న సొమ్మును పసిగట్టిన కలెక్టర్ – 'మిర్యాల' శ్రీరామచంద్రస్వామి కౌలు భూములకు తిరిగి వేలం

**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి: దేవుడి సొమ్ము అంటేనే ఎవ రైనా తినాలంటేనే భయపడతారు. కాని ఈ గ్రామంలో మాత్రం దేవుడి సొమ్మును కాజేసేందుకు రాజకీయ పార్టీ నాయకులు ఏ మాత్రం వెనుకడారు. నేనంటే నేను అంటూ పోటీ పడి మరీ తినేందుకు ముందుకు వస్తారు. నూతన్‌కల్ మండలంలోని మిర్యాలలో ఉన్న శ్రీసీతరామ చంద్రస్వామి దేవాలయ సొమ్ము ప్రతి ఏటా నాయకులపాలు అవుతుంది. దేవాలయానికి 82 ఎకరాల 20 కుంటల భూమి ఉండగా దేవాదాయశాఖవారు వేలంపాట ద్వారా భూములను కౌలు కు ఇవ్వడం అనవాయితీ. గ్రామంలోని నాయకులందరూ సిండికేట్‌గామారి వేలం డబ్బులు పెంచకుండా అతి తక్కువ ధరకు భూములు తీసుకొని దేవుడి ఆదాయానికి గండిపెడుతున్నారు. ఇది పసిగట్టిన కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆదాయంపక్కదారి పట్టకుండాఉండేందుకు2ఏప్రిల్ 2025 లో నిర్వహించిన వేలం రద్దైంది. దేవాదాయ అధికారులు 4జూలై 2025న తిరిగి కౌలు భూములకు వేలంపాట నిర్వహించేందుకు ప్రకటన జారీ చేశారు. దీనిపై ప్రత్యేక కథనం.**

తెలంగాణ రాష్ట్రంలో రెండో భద్రాద్రిగా పేరొందిన నూతన్‌కల్ మండలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి దాదాపు 200 ఎకరాలకు పైగా మాన్యం భూములున్నాయి. గత ప్రభుత్వ హాయంలో గ్రామాభివృద్ధి కోసం చేపట్టిన కొన్ని పనులకు ఈ దేవాలయ భూములను ప్రభుత్వం తీసుకుని పల్లెప్రకృతివనం, హరితహారం నర్సరి, క్రీడాప్రాంగణం, వైకుంఠదామాలతో పాటు మరికొన్నింటికి నిర్మాణం చేయడం జరిగింది. వీటన్నింటికి కేటాయించగా 82 ఎకరాల 20 కుంటల భూమి మిగులు ఉంది. ఇటీవల దేవాదాయశాఖ అధికారులు కూడా సర్వే చేయించగా ఇదే భూమి ఉన్నట్లుగా తేలింది. ఈ దేవాలయ భూమిని అధికారులు, దేవాలయ పాలకవర్గం సభ్యులు ప్రతి సంవత్సరం వేలంపాట నిర్వహించి వచ్చిన ఆదాయంతో స్వామివారి కళ్యాణంతో పాటు ఇతర ఉత్సవాలను నిర్వహిస్తూ రావడం అనవాయితీ. ఆ గ్రామంలో ఉన్న ఆయా రాజకీయ పార్టీల నాయకులందరూ ఏకమై వేలం ఎక్కువ పాటకుండా తక్కువ ధరకు దేవాలయ భూములను దక్కించుకుని ఇతరులకు అధిక కౌలుకు ఇచ్చుకుని ఎక్కువగా లబ్ధిపొందుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులదే ఆ గ్రామంలో హవా నడుస్తు వస్తుంది. దేవుడి సొమ్ము పంపకాలు, ఆదిపత్యం కోసం గతంలో గ్రామంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ దాడుల్లో అనేకమంది హత్యకు గురయ్యారు. దేవాలయ కౌలు భూములను దేవాదాయశాఖ అధికారులు 2ఏప్రిల్ 2025న వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం 82 ఎకరాల 20 కుంటల భూమిని అధికార పార్టీకి చెందిన నాయకులు కేవలం రూ. 5 లక్షలకే దక్కించుకున్నారు. గతంలో ఈ భూముల వేలం ద్వారా దేవాలయానికి దాదా పు రూ.10 లక్షలకు పైగా ఆదాయం రావడం జరిగింది.అధికార పార్టీ నాయకులు వేలంలో పాటను పెరగకుండా అడ్డుకుని తక్కువకే తన అనుచరవర్గానికి కట్టబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

### పక్కదారిపడుతున్న సొమ్మును పసిగట్టిన కలెక్టర్

### శ్రీరామచంద్ర కౌలు భూములకు తిరిగి వేలం



శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ఆదాయం పక్కదారి పట్టినట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ పసిగట్టారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా 2ఏప్రిల్ 2025న దేవాలయ భూముల కౌలువేలం నిర్వహించగా గతంకన్నా రూ.5 లక్షలకుపైగా తక్కువకు పాటపాడి భూముల సేద్యం చేసేందుకు హక్కును పొందారు. ఈ వేలంలో అధికార పక్ష నాయకులు ఎవరికి కూడా పాట పాడకుండా అడ్డుకున్నారని ప్రతిపక్ష నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ముందుగా ఊహించిందే నిజమని తేలడంతో ఆయన దేవాదాయశాఖ కమిషనర్‌కు వేలంలో అవకతవకలు జరిగాయని లేఖ రాశారు. దీంతో స్పందించిన దేవాదాయశాఖ దేవాలయ భూముల వేలం 4 జూలై 2025న తిరిగి నిర్వహించేందుకు ప్రకటనలు జారీ చేశారు. గ్రామంలో ఎకరం మెట్ట భూమికి కౌలు రూ.10వేల నుండి రూ.12 వేల వరకు డిమాండ్ పలుకుతుంది. ఇలా లెక్క చూసుకుంటే మొత్తం భూమికి రూ. 8 లక్షల 20వేల నుండి, రూ.9 లక్షల 90వేలు కౌలు ఆదాయం దేవాలయానికి రావాల్సి ఉంది.శ్రీసీతారామచంద్రస్వామి భూములకు తిరిగి నిర్వహిస్తున్న కౌలువేలంలోనైనా దేవాలయానికి అధిక ఆదాయం వస్తుందా...లేక అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఏకమై దేవుడి ఆదాయానికి గండిపెడతార అన్నది చర్చ సాగుతుంది. ఏదీ ఏమైనా రాజకీయ నాయకుల జోక్యం లేకుండా భూమలు వేలం నిర్వహిస్తే స్వామివారి దేవాలయానికి ఆదాయం పెరుగుతుందని ప్రజలు చెబుతున్నారు.

## ప్రజాపాలనలో పేదల సొంతింటి కల సహకారం

### కాంగ్రెస్ నాయకుడు ఎస్. సూర్య మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/ధన్వాడ :** మరికల్ మండల కేంద్రంలోని స్థానిక వివిధ వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ముగ్గు వేసి భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సహకారం అవుతుందని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూస్తామని పేదోడు సొంతింటిలో ఆత్మ గౌరవంతో బతకాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాన్ని చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యాంసుదర్ రెడ్డి, జిల్లా ఒబిసి అధ్యక్షుడు గొల్ల కృష్ణయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్, కె.ఆంజనేయులు, పోలేమోని రామకృష్ణ, గోవర్ధన్, జంగిడి శ్రీనివాసులు, రామకృష్ణ రెడ్డి, టైసన్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## పలకలు, నోట్ పుస్తకాల వితరణ



**ప్రజాపక్షం/పెబ్బేరు :** ప్రాథమికోన్నత పాఠశాల బునియాదిపూర్‌లో మల్లేష్ యాదవ్ శుక్రవారం విద్యార్థులకు పలుకలు, స్టడీ మెటీరియల్ వితరణ చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన పలకలు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు కుమారుని పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగశేషు , ఉపాద్యాయులు దయానంద, గ్రామ మాజీ సర్పంచులు నరేందర్, వెంకటేష్, తిరుపతయ్యయాదవ్ , నాగన్న యాదవ్ , మేకల రాములు, గుడిసె మహేష్, శ్యాం సుందర్, శ్రీకాంత్, సాయిసాగర్ , ఫిరోజ్ , మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు

### జిజిహెచ్, మెడికల్ కళాశాలలను సందర్శించిన రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్, కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రభుత్వ వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజి మానిటరింగ్ కమిటీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంచాలకులు వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయిలు శుక్రవారం సందర్శించారు. వివిధ విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఐసియు, ఆర్ఐసీయు ల్యాబ్, బ్లడ్ బ్యాంకు, టి.హబ్ తదితర వాటిని తనిఖీ చేశారు. వైద్య కళాశాలలో ఫిజియాలజి, అనాటమి, హెమటాలజి ల్యాబులు, లైబ్రరీ, లెక్చర్‌హాల్, సెమినార్‌లో తరగతి గదులు, బాలురు, బాలికల హస్టల్‌లు డైనింగ్ హాల్ కిచెన్ ఇతర విభాగాలను సందర్శించారు. మౌలిక వసతులు పరిశీలించారు. వైద్య కళాశాలలో అధిపతులతో సమావేశమై అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు ఇంకనూ కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ ఎన్ఎంసి మార్గదర్శకాలకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు కొత్తగా ఏయే సదుపాయాలు, వైద్య పరికరాలు, యంత్రాలు అవసరం అన్నది. గుర్తిస్తూ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.శివప్రసాద్, లను ఆదేశించారు. ఈ నివేదికను అనుసరిస్తూ సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వానికి ఈ నెల 30న ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఆసుపత్రి మెడికల్ కాలేజీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, తమ దృష్టికి తేవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు సంతృప్తికరంగా వైద్య సేవలు అందించాలని ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. వైద్య కళాశాలలో జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. వైద్య విద్యార్థులు సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌లు బోధనేతర సిబ్బంది ఉండాలన్నారు. ఆయా విభాగాలలో ఖాళీలు ఉంటే వాటి వివరాలను సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. వీరి వెంట మెడికల్ కళాశాల డైరెక్టర్ డా.రమేష్, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాలు సంస్థ ఈఈ రవీందర్ రావు, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ వైద్య విభాగాల అధిపతులు ఉన్నారు.



## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9:15 గంటలకు కలెక్టర్ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి ప్రార్థన లో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. నిర్ణీత సమయానికి ఎంత మంది ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చారని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనికీ చేశారు. హెల్త్ సెంటర్‌లో మొత్తం ఎంతమంది వైద్య సిబ్బంది పనిచేస్తున్నారని ? ప్రస్తుతం ఎంతమంది ఉన్నారని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌ను చూసి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతో పాటు మరో ఇదుగురు స్టాఫ్ రాలేదని నిర్ధారించారు.

## ఇసుకను అడ్డుకున్న రైతులు



**ప్రజాపక్షం/మాగనూర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పనులకు అవసరమైన ఇసుకను మాగనూర్ మండల కేంద్రంలో అధికారుల సహాయంతో తరలించేందుకు కాంట్రాక్టర్ శుక్రవారం ప్రయత్నించారు. వాగులో హిటాచితో త ఇసుకను టిప్పర్ కు నింపుతుండగా గమనించిన మాగనూర్ రైతులు అక్కడికి చేరుకొని, ఇసుకనే మాకు జీవనధారమని, ఇసుకను తరలిస్తే రైతులను చంపినట్టేనని ఇసుక తరలింపును రైతులు అడ్డుకున్నారు. ఎమ్మార్వో అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతోనే అనుమతులు ఇచ్చామని రైతులు అడ్డుకున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లానని చెప్పారు. కాంట్రాక్టర్ ఇసుక తరలింపును వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు.

## జిపి కార్మికుల ముందస్తు అరెస్టు



**ప్రజాపక్షం/ధన్వాడ:** గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరుతున్న ధన్వాడ గ్రామ పంచాయితీ కార్మికులను ధన్వాడ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయితీ సిబ్బందులు మాట్లాడుతూ మాకు పెండింగు ఉన్న జీతం విడుదల చేయాలని అడగడం నేరమా నెలకు 9,500 ఉన్న జీతం పెరుగుతున్న ధరల కనుగుణంగా పెంచాలని అడగడం నేరమా అని తెలిపారు. మా గ్రామ పంచాయితీ సిబ్బంది అందరం కలిసి ప్రతినిత్యం ప్రతిరోజు గ్రామంలో ప్రతి ఇంటికి నల్లాల ద్వారా మంచి నీళ్లు వదలడం, పారిశుధ్య కార్యక్రమం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం మా తప్ప. మమ్మల్ని గ్రామంలో అరెస్టు చేయడం బాధాకరం. పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ సిబ్బందులు బాలకృష్ణ, ఉదయభాను, ఇమ్రాన్, బాలయ్య, రాజు, నిరంజన్, సద్దాం లక్ష్మ ణ్ నర్సింలు పాల్గొన్నారు.

## బడి పిల్లలకు చదువులు చెప్పమంటే కేసులు నమోదు చేస్తారా?




**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నేతలపై ఆధ్వర్యంలో ఈ నెల 23న వీపనగండ్ల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అధికార యంత్రాంగం కల్లుగప్పి నేరుగా రాష్ట్ర ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి పైరవీలతో ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్న ఇంగ్లీష్ , సోషల్ టీచర్ల డిప్యుటేషన్లను తక్షణమే నిలిపివేసి విద్యార్థులకు పాఠాలు బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నేతలు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ డిప్యూటేషన్ పై స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి అనుమతి పొందగా విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు విద్యార్థులకు చదువు చెప్పకుండా విద్యార్థులను విద్యకుదూరం చేయడం సరైనది కాదని డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతానికి వెళ్లే వీపనగండ్ల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువులు చెప్పేది ఎవరని ప్రశ్నించారు. విద్యార్థుల చదువుల కోసం అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేసేంత వరకు ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామన్నారు. అక్రమ కేసులను ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కమిటీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## మాజీ డిఎంహెచ్ఓ అక్రమాలు, ఆస్తులపై సిబిఐకి ఫిర్యాదు చేస్తాం

### బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్

**ప్రజాపక్షం/నారాయణపేట్:** ముఖ్యమంత్రి సొంత జిల్లా నారాయణపేట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అవినీతి అధికారులకు అండగా నిలుస్తున్నారని బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ వైద్య అధికారి అవినీతి, అక్రమ ఆస్తులపై సిబిఐకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా వైద్య అధికారి అవినీతి, అక్రమ ఆస్తులపై సిబిఐకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డీఎంహెచ్ఓగా ఉండి తీవ్రమైన అవినీతి, అక్రమాలకు పాల్పడి రెండు సార్లు సరెండర్ అయిన డా.సౌభాగ్య లక్ష్మీకి మళ్ళీ జిల్లా ప్రభుత్వం ఆసుపత్రిలో ఆర్ఎంఒగా పోస్టింగ్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సొంత చుట్టాలు మంత్రులైతే అవినీతి అధికారులకు పోస్టింగులు ఇస్తారా అంటూ ప్రశ్నించారు.

# పంట మార్పిడిపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయవిశ్వ విద్యాలయం ద్వారా నిర్వహించే రైతు నేస్తం వ్యవసాయ కార్యక్రమాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు , వ్యవసాయ విస్తీర్ణాధికారులతో ఖరీఫ్ సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రజ్ఞులు వ్యవసాయ రంగంపై రైతులకు ముఖాముఖి ద్వారా అవగాహన కల్పిస్తారని, రైతులకు ఎంతో ఉపయోగపడే రైతు నేస్తం కార్యక్రమాన్ని ఒక ప్రహసనం లాగ కాకుండా గ్రామంలో రతులకు అవగాహన కల్పించి కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చూడాలన్నారు. రైతులకు తెలియని ఎన్నో వ్యవసాయ సంబంధిత విషయాలను శాస్త్రవేత్తలు ఇతర అనుభవజ్ఞులైన వ్యవసాయదారులు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. వడ్లు సాగు చేసే వారికి ప్రభుత్వం ద్వారా సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నందున సన్న రకం వడ్లు మాత్రమే సాగు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సారి క్రాఫ్ బుకింగ్ చేసేటప్పుడు ఎలాంటి తప్పులకు గాని నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి ఖచ్చితమైన పంటసాగు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి సహకార సేవా కేంద్రంలో అవసరమైన ఎరువులు నిల్వ ఉండే విధంగా చూసుకోవాలని ఎక్కడైనా తక్కువ ఉంటే వలెంటనే ఇండియన్ పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ , మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఉనికి చాటుకోవడానికి ఊకదంపుడు ఉపన్యాసాలు



సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదు : ఎమ్మెల్యేలు

**ప్రజాపక్షం/వనపర్తి :** పాలమూరు ... రంగారెడ్డిలో నార్లపూర్ నుంచి ఏదులకు వచ్చే లింకు కెనాల్లే పూర్తి కాలేదు. నీళ్లు వస్తాయని మాట్లాడటం మీ అవగాహన రాహిత్యానికి ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, జి.మధుసూదన్ రెడ్డిలు అన్నారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు సత్యదూరమైన ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం హాశస్పదమని అన్నారు. జూరాల ప్రాజెక్టులోని 62 గేట్లల్లో 58 గేట్లు బాగున్నాయని నాలుగు గేట్లకు మరమ్మత్తులు అవసరం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి తగిన చర్యలు చేపట్టిందని త్వరలోనే నాలుగు గేట్లను సైతం పటిష్టపరుస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. టెండర్లు పిలిచి నిధులు మంజూరు చేయని టీఆర్ఎశ్ నాయకులు నేడు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అంతా అయిపోయినట్లు తామేదో గతంలో ఉద్దరించినట్లు మాట్లాడటం వారి ఉనికిని కాపాడుకోవడం కోసమే తప్ప వేరొకటి కాదని ఆయన అన్నారు. పాలమూరు ... రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని కేవలం 10 శాతం పనులు పూర్తి చేస్తే నీళ్లు ఇవ్వవచ్చునని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. నార్లాపూర్ నుంచి ఏదులకు వచ్చే లింకు కెనాల్లే నేటికి పూర్తి కాలేదని, నీళ్లు ఎలా వస్తాయని వారు ప్రశ్నించారు. ఎన్నికల స్టంట్ కోసం ఆన్ చేసిన మోటర్లు ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేలోపే బంద్ అయ్యాయన్నారు. వారు అడిగినట్లు 10 శాతం పనులకు కావాల్సిన 3వేల కోట్ల రూపాయలను ఇప్పిస్తామని చేతనైతే ప్రాజెక్టుపూర్తి చేసి చూపియాలని వారు సవాల్ విసిరారు. లోకల్ బాడీ ఎన్నికల్లో సైతం మీకు గుండు సున్నే మిగులుతుందని జోష్యం చెప్పారు.

# మీరు స్వచ్ఛందంగా ఇవ్వకపోయినా కోర్టులో గెలుస్తా

### మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి సవాల్




**ప్రజాపక్షం/జడ్చర్ల:** మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి జడ్చర్ల ప్రజలపై ఏమాత్రం ప్రేమ ఉన్నా ప్రభుత్వాసుపత్రి ప్రధాన మార్గానికి అవరోధం కల్పిస్తూ ఆయన మేనల్లుడు కొనుగోలు చేసిన 2 ఎకరాల ప్రభుత్వ భూమిని వెనక్కి ఇప్పించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి కోరారు. లక్ష్మారెడ్డి కుటుంబీకులు తాము అక్రమంగా కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమిని స్వచ్ఛందంగా వెనక్కి ఇవ్వకపోయినా కోర్టులో కేసు గెలిచి ఆ భూమిలో నుంచి ఆసుపత్రికి మెయిన్ రోడ్డు నుంచి రహదారిని నిర్మించితీరుతామని ధీమా వ్యక్తం చేశారు. జడ్చర్ల కేంద్రంలో నిర్మించిన లయన్స్ సేవా కేంద్రం కొత్త భవన ప్రారంభోత్సవంలో జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మేనల్లుడు అక్రమంగా కొనుగోలు చేసిన 2 ఎకరాల ప్రభుత్వ భూమిని వెనక్కి ఇస్తే మెయిన్ రోడ్డు నుంచి ప్రభుత్వాసుపత్రికి నేరుగా రహదారి సౌకర్యం ఏర్పడుతుందని అనిరుద్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 2 ఎకరాల ప్రభుత్వ భూమి లక్ష్మారెడ్డి మేనల్లుడి చేతిలో ఉన్న కారణంగా ఆసుపత్రికి ఎమర్జెన్సీగా వచ్చే అంబులెన్స్ కూడా చుట్టూ తిరిగి గుంతలు నాలాల్లోంచి రావాల్సి వస్తుందని, ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈ విషయంగా కోర్టులో గెలుస్తామని ఆ 2 ఎకరాలు వెనక్కి తీసుకొచ్చి మెయిన్‌రోడ్డు నుంచి ఆసుపత్రికి రోడ్డు వేయించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని, సభ్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు. జడ్చర్ల పాతబస్టాండు మరమ్మత్తులు చేసి, తిరిగి ప్రారంభించేందుకు ఆర్టీసీ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం తప్పిదం వల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద సర్క్యులర్ సౌకర్యం లేకపోవడం వల్ల బస్సులకు ఇబ్బందులు వస్తున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం చూపిస్తానని పేర్కొన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీకి ఇప్పటికే మంజూరైన నిధులతో పాటు అదనంగా రూ.15 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు.

## పోలీస్ జాగిలాల నూతన గదులను ప్రారంభించిన ఎస్పీ



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** శుక్రవారం రోజుల జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ నారాయణ పేట జిల్లా కేంద్రం లోని, సుభాష్ రోడ్డు, పత్తి బజార్ కాలనీ లోని పాత పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన పోలీసు జాగిలాల నూతన గదులను (డాగ్ కెనాల్)ను పూజ కార్యక్రమం నిర్వహించి ఎస్పీ డాగ్ స్కాడ్ ఇంచార్జి కానిస్టేబుల్ రాజేశ్వర్ రెడ్డిచే ప్రారంభింపచేశారు. అనంతరం పోలీసు జాగిలాలు ఎస్పీకి గౌరవ వందనం చేశాయి. ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో పోలీస్ జాగిలాల సౌకర్యార్థం నూతనంగా 6 గదులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పోలీస్ జాగిలాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునాతనంగా గదులను నిర్మించడం జరిగిందని ఈ సదుపాయాలు ద్వారా పోలీస్ భద్రత మరియు సామాజిక సేవా సామర్థ్యం పెరుగుతుందని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీయండి రియాజ్, హుల్ హక్, డిఎస్పీలు నల్లపు లింగయ్య, మహేశ్, ఆర్ఐ నరసింహ, సిఐ శివ శంకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్, శివశంకర్, మద్దయ్య, జిల్లా ఆర్మూడ్ రిజర్వ్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య

### బిసి పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** అనేక సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నానని , దానిని ప్రోత్సహించే వారు అనేకం ఉన్నా .. నచ్చని వారే దాడులను తెగబడతారని, ఇలాంటి దాడులకు భయపడబోనని, సమస్యలపై పోరాటాన్ని ఆపేది లేదని బీసీ పొలిటికల్ జేఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో తన స్వగ్రామమైన వడ్డేవాటకు వెళ్తుండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తన కారుపై రాళ్లతో దాడి చేశారని, కారు డ్రైవర్ చాకచక్యంతో కారు ముందుకు వేగంగా పోనివ్వడంతో తృటిలో ప్రాణాపాయం తప్పిందన్నారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి జరిగిన విషయాన్ని సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వగానే 10 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకొని తమకు రక్షణ కల్పించి, కంప్లైంట్ ఫైల్ చేయడంతో పాటు ఉదయాన్నే ఘటనా స్థలం వద్ద దర్యాప్తు చేపట్టి, క్లూస్ టీంను పిలిపించి విచారణను వేగవంతం చేశారన్నారు. బిసి పొలిటికల్ జేఏసి నాయకులు పాండురంగ యాదవ్, వివిగౌడ్, నర్సింహయాదవ్, స్వప్న, దేవర శివ, అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, అరవిందచారి, బత్తుల జితేందర్, ధర్మేంద్ర సాగర్, అస్కని రమేష్, నాగరాజు, చెలిమిల్ల రామన్ గౌడ్, బీసీ కుల సంఘాల జేఏసి నాకులు రాములు యాదవ్, సత్యం యాదవ్, వెంకటన్న గౌడ్, నజీర్, తిరుపతన్న గౌడ్, కొత్త గంగాధర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి రూపురేఖలను మార్చి చూపిస్తా : మంత్రి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఎఆర్ఎం మినీ ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో క్రీడలు, యువజన శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు. అనంతరం మంత్రివర్యులు మాట్లాడుతూ, మీ ఇండ్ల నిర్మాణం ఎంత త్వరగా ప్రారంభిస్తారో అంత త్వరగా మీకు మీ అకౌంట్లో బిల్లులు పడతాయని ఒకవేళ మీకు బిల్లులు పడని ఎడల అవసరమైతే నా ఇల్లు అమ్మైనా మీ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసే బాధ్యత నాది అని మంత్రి అన్నారు. రానున్న రోజుల్లో మొత్తం అభివృద్ధి రూపురేఖలు మారుపోతున్నాయి. అందులో భాగంగానే నేడు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం రానున్న రోజుల్లో సుమారు 600 కోట్ల నిధులను తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధి రూపురేఖలను మార్చి చూపిస్తానని మంత్రి వాకిటి శ్రీహరి ఈ కార్యక్రమంలో మక్తల్ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నానో యూరియా ఎరువుతో రైతులకు లాభాలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** నానో యూరియా ఎరువులువాడటంద్వారా రైతులకు అనేక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి నీతిరెడ్డి శుక్రవారం తెలిపారు. నానో ఎరువులు ప్రవేశపెట్టడంద్వారా రైతులకు ఖర్చు తగ్గించి పంట దిగుబడిని పెంచడమేకాకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు అన్నారు. 500 మిల్లీలీటర్ల నానో యూరియా ఒక బస్తా 45కిలోల యూరియాతో సమానం అని తెలిపారు. నానో యూరియా మొక్కకు నత్రజనిని అందించడంవలన యూరియా వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. నానో యూరియా వాడకంవల్ల పంటదిగుబడి 8శాతం పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయని తెలిపారు. నానో యూరియా నేల, గాలి, నీరు కలుషితాన్ని తగ్గిస్తుందన్నారు. సాంప్రదాయకబద్ధమైన యూరియా నేలలోకి ఇంకిపోవడం వాయువులుగా మారడంవల్ల ఆకులపై పిచికారి చేసుకోవచ్చన్నారు. రైతుకు శ్రమతగ్గడంతోపాటు మొక్క అవసరంమేరకు నత్రజని తీసుకుంటాయని సూచించారు. పంటవిత్తిన 20రోజులతర్వాత రెండుసార్లు పిచికారి(పంటపూత దశకంటే ముందు) సూచించడం జరిగింది. 2.మిల్లిలీటర్ నీటికి కలిపి పంటపై పిచికారి చేయవచ్చన్నారు.

## నేర రహిత సమాజమే ధ్యేయం :ఎస్పీ



**ప్రజాపక్షం/వనపర్తి :** నేర రహిత సమాజమే ధ్యేయంగా పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వహించి ప్రజలకు సత్వర న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించి ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన గ్రేవ్ కేసులను పరిశీలించారు. ఆయా కేసులలో విచారణలో అధికారులు సేకరిస్తున్న ఆధారాలను పరిశీలించారు. యాక్సిడెంట్ కేసులలో పోలీసు అధికారులు ఎలాంటి విచారణ కొనసాగిస్తున్నారో పరిశీలించి పోలీస్ స్టేషన్లలో మిస్సింగ్ కేసులు, దొంగతనం కేసుల ఇన్వెస్టిగేషన్‌లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎలక్షన్‌లో సిబ్బంది, ప్రతి ఒక్కరు గ్రామ స్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకొని విపిఓ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, ఆత్మకూర్ సిఐ, శివ కుమార్, వనపర్తి సిఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్, డిసిఆర్బి ఎస్ఐ తిరుపతిరెడ్డి, వనపర్తి జిల్లాలోని ఎస్ఐలు, డిసిఆర్బి ఐటి కోర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టు ప్రభుత్వ దుర్మార్గ చర్య

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట జిపి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలలు వేతనాలు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం చలో హైదరాబాద్ కమిషనర్ దగ్గరకు వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గ చర్య అని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారంగా గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నెల మొదటి రోజున గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని హామీనిచ్చారని నేటికి అమలు కాకపోవడంతో జిపి కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిపి యూనియన్ మండల అధ్యక్షులు ఎస్. భాస్కర్, ఉపాధ్యాయులు ఆశోక్, కార్యదర్శి ఎన్. రాములు, కోశాధికారి ఎం.నాగేష్ ,లాదరులు రవి, శివ, సహదేవుడు , కృష్ణయ్య, సాయికుమార్ , అంజి, నిరంజన్ , కమల్ , నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



## మూడో సీజన్‌లో చెత్త ప్రదర్శన..
# హెడ్‌కోచ్‌పై వేటు!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న యూపీ వారియర్స్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. గత సీజన్‌లో జట్టు ప్రదర్శనతో తీవ్రంగా నిరాశ చెందిన యాజమాన్యం హెడ్‌కోచ్ జాన్ లెవిస్‌కు ఉద్వాసన పలికింది. నాలుగో సీజన్‌కు కొత్త కోచ్ ఆధ్వర్యంలో పక్కాగా సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో లెవిస్‌పై వేటు వేసింది. ఈ విషయాన్ని శుక్రవారం యూపీ యాజమాన్యం ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'మొదటి రోజు నుంచి మీరు మమ్మల్ని ఎంతగానో విశ్వసించారు. ఈ క్రమంలో యూపీ వారియర్స్ జట్టు ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. ఫ్రాంచైజీలోని క్రికెటర్లు ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. మీరు ప్రశాంతంగా ఉంటూనే జట్టు పురోగతి కోసం మనసుపెట్టి పనిచేశారు. కోచ్ జాన్ లెవిస్ మీ సేవలకు ధన్యవాదాలు. మీరు ఎల్లప్పుడూ యూపీ వారియర్స్ కుటుంబంలో సభ్యులే' అంటూ సోషల్ మీడియా పోస్ట్‌లో రాసుకొచ్చింది యూపీ ఫ్రాంచైజీ.

# డోప్ పరీక్షలో విఫలం
## నిషేధానికి గురైన నేషనల్ ఛాంపియన్!



భారత అథ్లెట్లు వరుసగా డోప్ పరీక్షలో దొరికిపోతున్నారు. ఈమధ్యే క్వార్టర్ మిలర్(400 మీటర్ల రన్నర్) స్నేహ కొల్లేరి నిషేధానికి గురవగా.. తాజాగా జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలుపొందిన రన్నర్ ట్వింకిల్ చౌదరీ సైతం డోప్ టెస్టులో పట్టుబడింది. అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చాటుతున్న ఆమె అనూహ్యంగా నిషేధిత డ్రగ్ తీసుకొని బుక్ అయిందది. దాంతో, అథ్లెటిక్స్ ఇంటెగ్రిటీ యూనిట్ ఆమెపై నిషేధం విధించింది. నిరుడు ఉత్తరాఖండ్‌లో జరిగిన 4×400 మీటర్ల రీలే పోటీల్లో స్వర్ణం సాధించిన బృందంలో ట్వింకిల్ సభ్యురాలు. అదే ఈవెంట్లో 4×400 మీటర్ల మిక్స్‌డ్ రీలేలో కాంస్యం గెలుపొందిందీ అథ్లెట్. కెరియర్‌లో ఒక్కోమెట్టు ఎక్కుతున్న సమయంలోనే ట్వింకిల్ డోప్ పరీక్షలో విఫలమైంది. ఆమె రక్త నమూనాల్లో నిషేధిత మిథైల్‌టెస్టోస్టిరాన్ డ్రగ్ ఉంది. ఇది ఒక అనబాలిక్ స్టిరాయిడ్ డోప్ టెస్టు ఫలితాలు రాగానే ఆమెకు ఏఐయూ నోటీసులు పంపింది. తర్వాతి దశలో ట్వింకిల్ స్వయంగా ఏఐయూ అధికారుల ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

**వెండి పతకంతో..**

జలంధర్‌కు చెందిన ట్వింకిల్ చిన్నప్పట్నుంచి ఆటల్లో ముందుండేది. చిరుతలా పరుగెత్తే ఆమె అథ్లెటిక్స్ వైపు మొగ్గు చూపింది. ఈమధ్యే కొచ్చిలో జరిగిన 28వ జాతీయ సమాఖ్య సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోటీల్లో ట్వింకిల్ సత్తా చాటింది. 800 మీటర్ల పరుగులో 2:00:71 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకొని రికార్డున నెలకొల్పింది. జూన్‌లో తైవాల్ ఓపెన్‌లోనూ తనకు తిరుగులేదని చాటుతూ వెండి పతకంతో మెరిసింది 28 ఏళ్ల ట్వింకిల్. దక్షిణ కొరియాలో మే నెలలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది .




## మాజీ ఛాంపియన్‌కు షాకిచ్చిన అద్వానీ..
# సెమీఫైనల్లో భారత్



ప్రతిష్ఠాత్మక ఆసియా స్నూకర్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. వరల్డ్ ఛాంపియన్ పంకజ్ అద్వానీ సారథ్యంలోని బృందం సెమీ ఫైనల్లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో ఖతార్‌పై జయభేరి మోగించింది భారత్. ఏకపక్షంగా సాగిన పోరులో 30తో ప్రత్యర్థిని చిత్తు చేసి టైటిల్‌కు మరింత చేరువైంది ఇండియా. కొలంబో వేదికగా జరుగుతున్న ఆసియా స్నూకర్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత జట్టు అదరగొడుతోంది. వరుసపెట్టి ప్రత్యర్థులకు చెక్ పెడుతూ సెమీస్ చేరుకుంది. ఉదయం నిర్వహించిన తొలి సెషన్లో భారత త్రయం తమ ఆఖరి గ్రూప్ సీ మ్యాచ్‌లో హాకాంగ్ 2 టీమ్‌ను మట్టి కరిపించి నాకౌట్ దశకు అర్హత సాధించింది. అనంతరం వరల్డ్ గేమ్స్ మాజీ గోల్డ్ మెడలిస్ట్ బషర్ అబ్దుల్ మజీద్‌కు పంకజ్ షాకిచ్చాడు. ఇక డబుల్స్‌లో అద్వానీ, బ్రిజేష్ దమని ద్వయం 725తో అల్ ఒబైదిల్ మజీద్ జంటను ఓడించారు. హాంకాంగ్ 1, బహ్రెయిన్ మ్యాచ్ విజేతను తర్వాత రౌండ్‌లో భారత స్నూకర్ టీమ్ ఢీకొననుంది.

# సైన్స్ ఫోకస్

## సూర్యుడికి దూరంగా..



ఈ ఏడాది జులై 3వ తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. ఆ రోజున సూర్యుడి నుంచి భూమి అత్యంత దూరంగా వెళుతుంది. అంటే, సూర్యుని కేంద్రం నుండి భూమి కేంద్రానికి 152,087,738 కిలోమీటర్లు (94,502,939 మైళ్ళు) దూరంగా ఉంటుంది. దీనిని అఫెలియన్ అని పిలుస్తారు. సూర్యుడికి భూమి ఎంత దూరంలో ఉందో, దాని ఆధారంగానే రుతువులు ఏర్పడతాయనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ, అది నిజం కాదు. భూమి వంపు వల్ల రుతువులు ఏర్పడతాయన్నది వాస్తవం. ప్రస్తుతం ఉత్తర అర్ధగోళంలో వేసవి కాలం వస్తుంది. దక్షిణార్ధగోళంలో వర్షాలు ప్రారంభమవుతాయి. రుతువుల ఖచ్చితమైన వ్యవధి సంవత్సరానికి కొద్దిగా మారుతూ ఉంటుంది. అఫెలియన్ కారణంగా ఉత్తరార్ధగోళంలో వేసవి ఎక్కువ కాలం ఉంటుంది. సూర్యుని చుట్టూ భూమి యొక్క దీర్ఘవృత్తాకార మార్గమే దీనికి కారణం. భూమి సూర్యుడి నుండి దూరంగా ఉన్నప్పుడు, అది దాని కక్ష్యలో నెమ్మదిగా కదులుతుంది. అయనాంతం నుండి విషువత్తుకు వెళ్లడానికి ఎక్కువ సమయం పడుతుంది. అయితే, దీనికి విరుద్ధంగా, దక్షిణఅర్ధగోళంలో, వేసవి కాలం జనవరిలో పెరిహెలియన్‌తో సమానంగా ఉంటుంది, అప్పుడు భూమి సూర్యుడికి దగ్గరగా ఉంటుంది. అంతేగాక, మరింత వేగంగా కదులుతుంది. అయనాంతం నుండి విషువత్తుకు వెళ్ళడానికి తక్కువ సమయం పడుతుంది.

## గ్రహశకలాలకూ ఓ రోజు..



గ్రహశకలాలు (ఆస్టరాయిడ్స్)కు కూడా ఓ ప్రత్యేక రోజు ఉంది. ప్రతి సంవత్సరం జూన్ 30న అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. గ్రహాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి, గ్రహశకలాలపై వివరాలను అందించడానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంతో ఈ దినోత్సవం జరుగుతున్నది. 1908, జూన్ 30న రష్యాలోని సైబీరియా స్టోనీ తుంగుస్కా నది సమీపంలోని భూమిని అతిపెద్ద గ్రహశకలం ఢీకొట్టడంతో దాదాపు 2,072 చ.కి.మీ. విస్తీర్ణంలో అటవీ ప్రాంతం నాశనమైంది. ఆ రోజుకు గుర్తుగా ఐక్యరాజ్య సమితి జూన్ 30ని ఆస్టరాయిడ్ దినోత్సవంగా ప్రకటించింది. ఇంతకీ గ్రహశకలాలు అంటే ఏమిటి? ఈ ప్రశ్నకు '4.6 బిలియన్ సంవత్సరాల క్రితం సౌర వ్యవస్థ ఏర్పడినప్పటి నుండి మిగిలిపోయిన రాతి అవశేషాలు' అని సమాధానం చెప్పవచ్చు. శాస్త్రవేత్తలు ఈ నిర్ధారణకు ఎప్పుడో వచ్చినప్పటికీ, లోతైన పరిశోధనలు కొనసాగుతునే ఉన్నాయి. కాగా, ఒక సిద్ధాంతం ప్రకారం, బిగ్ బ్యాంగ్ తర్వాత, ధూళి కణాలు కలిసి 'అక్రెషన్' అనే ప్రక్రియ ద్వారా ఖగోళ వస్తువులను ఏర్పరుస్తాయి. ఇవి ఇతర చిన్న వస్తువులతో కలిసి పెద్ద అంతరిక్ష శిలలుగా మారుతాయి. ఈ ఖగోళ శిలలలో కొన్ని వాటి స్వంత గురుత్వాకర్షణను అభివృద్ధి చేసుకునేంత పెద్దవిగా ఎదిగి, గ్రహాలుగా మారాయి. అయితే, కొన్ని శిలలు ఈ విధంగా కలిసిపోకుండా గ్రహశకలాలుగా మారాయి. ఇవి కూడా గ్రహాల మాదిరిగానే అవి సూర్యుని చుట్టూ తిరుగుతాయి కాబట్టి, వీటిని 'ప్లానెటాయిడ్లు' లేదా 'చిన్న గ్రహాలు' అని కూడా పిలుస్తారు. మన సౌర వ్యవస్థలో తిరుగుతున్న లక్షలాది గ్రహశకలాలలో ఎక్కువ భాగం అంగారక గ్రహం, బృహస్పతి కక్ష్యల మధ్య ఉన్న ప్రాంతంలో కనిపిస్తాయి. ఈ ప్రాంతాన్ని ఆస్టరాయిడ్ బెల్ట్ అంటారు. ఇది అంతరిక్ష నౌకలను కూల్చివేసే రాళ్లతో కూడిన ఒక చిన్నస్థలంగా సైన్స్ ఫిక్షన్ నవలలు, చిత్రాల్లో కనిపిస్తుంది. కానీ, నిజానికి ఇది చాలా ఒంటరి ప్రదేశం. ఆస్టరాయిడ్ బెల్ట్‌లోని రెండు గ్రహశకలాల మధ్య సగటు దూరం దాదాపు 600,000 మైళ్ళు (966,000 కి.మీ) అని ఖగోళ శాస్త్రవేత్తల అంచనా. ఇది భూమి నుంచి చంద్రునికి మధ్య ఉన్న దూరం కంటే దాదాపు 2.5 రెట్లు ఎక్కువ. దీనిని బట్టి ఆస్టరాయిడ్ బెల్ట్ ఎంత విస్తారమైనదో, అక్కడ గ్రహశకలాలు ఎంత ఒంటరిగా ఉంటాయో ఊహించుకోవచ్చు. మనకు తెలిసిన చాలా గ్రహశకలాలు ఆస్టరాయిడ్ బెల్ట్‌లో ఉన్నప్పటికీ, ఈ బెల్ట్ వెలుపల సూర్యుని చుట్టూ తిరుగుతున్న అనేక గ్రహశకలాలు ఉన్నాయి. 2010లో శాస్త్రవేత్తలు భూమి యొక్క కక్ష్యను అనుసరించే మొదటి 'ట్రోజన్ ఆస్టరాయిడ్ 2010 టికె7'ను కనుగొన్నారు.

## కొన్ని అడుగుల నుంచి వందల మైళ్ల వరకూ..

గ్రహశకలాలు కొన్ని అడుగుల నుండి అనేక వందల మైళ్ల వ్యాసం కలిగి ఉంటాయి. మానవునికి తెలిసిన అతిపెద్ద గ్రహశకలం సెరెస్. దాదాపు 590 మైళ్లు (950 కి.మీ) వ్యాసం కలిగి ఉంటుంది. సౌర వ్యవస్థలోని అన్ని గ్రహశకలాలను కలిపితే, ఫలితంగా వచ్చే శిల పరిమాణం మన చంద్రుడి కంటే చాలా చిన్నదిగా ఉంటుందని ఖగోళ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. నేడు దాదాపు 150 గ్రహశకలాలు వాటి చుట్టూ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చంద్రులు తిరుగుతున్నట్లు అధ్యయనాలు చెప్తున్నాయి. వీటిలో అత్యంత ప్రసిద్ధమైనది డాక్‌టైల్. ఇది 'ఇడా' చుట్టూ తిరుగుతున్న ఒక చిన్న చంద్రుడు లేదా ఆస్టరాయిడ్‌లోని గ్రహశకలం. చాలా గ్రహశకలాలు వాటి కూర్పు ఆధారంగా, 'సి', 'ఎస్', 'ఎం' అనే మూడు సమూహాలలో ఏదైనా ఒకదానిలోకి వస్తాయి. ఆ గ్రహశకలం ఏర్పడిన సమయంలో సూర్యుడి నుండి ఎంత దూరంలో ఉందో దాని కూర్పును నిర్ధారిస్తారు.



మొత్తం గ్రహశకలాలలో మూడింట రెండు వంతులు 'సి' రకంగా భావిస్తున్నారు. ఈ గ్రహశకలాలు చాలా చీకటిగా ఉంటాయి. ఇవి బంకమట్టి, సిలికేట్ రాళ్లను కలిగి ఉంటాయని భావిస్తున్నారు. వీటిని గ్రహశకలం బెల్ట్ బయటి ప్రాంతాలలో చూడవచ్చు. కాగా, 'ఎస్' రకం గ్రహశకలాలు సగటున 0.16 ఆల్బెడోతో చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఈ గ్రహశకలాలు సాధారణంగా ఆస్టరాయిడ్ బెల్ట్ లోపలి ప్రాంతాలలో కనిపిస్తాయి. ఇనుము, మెగ్నీషియం సిలికేట్లతో కూడి ఉంటాయి. ఇక 'ఎం' రకం గ్రహశకలాలు ఆస్టరాయిడ్ బెల్ట్ మధ్యలో కనిపిస్తాయి. సగటు ఆల్బెడో 0.19 కంటే చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా ఇనుముతో కూడి ఉంటాయి. ఈ బెల్ట్‌లోని నాలుగు అతిపెద్ద గ్రహశకలాలను సెరెస్, వెస్టా, పల్లాస్ మరియు హైజియా అని పిలుస్తారు. ఈ పెద్ద గ్రహశకలాలు మొత్తం గ్రహశకల పట్టీ ద్రవ్యరాశిలో సగం వరకు ఉంటాయి. ఈ రాతి గ్రహశకలాలన్నింటినీ కలిపితే, భూమి చంద్రుడి కంటే ఒక గ్రహం కొంచెం చిన్నదిగా అవుతుందని శాస్త్రవేత్తలు చెప్పడానికి ఇష్టపడతారు.




# పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- జిల్లాలో సిపిఐ పార్టీని బలోపేతం చేయాలి
- నక్సలైట్లపై హత్యాకాండను ఆపాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇటి నరసింహ్మా

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇటి నర్సింహ్మా అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మెదక్ జిల్లా సిపిఐ 25వ మహాసభలను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా నర్సింలు హాజరై మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. పేద ప్రజలను మాత్రం బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతోన్మాదం పేరట దళితులపై మైనారిటీలపై దాడులు ఎక్కువ అయ్యాయాన్ని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంద పవన్ మాట్లాడుతూ ఒకప్పుడు నర్సాపూర్ సిపిఐకి కంచుకోట అని, పార్టీ నుంచి 25 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చిలుముల మదన్ రెడ్డి ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎన్నో భూములు పంచారని గుర్తు చేశా రు. సిపిఐ పార్టీని మెదక్ జిల్లాలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శులు ప్రకాష్ రావు, దయానంద రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఖాలెక్, రాజా గౌడ్, నందం తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేసి
# కృష్ణా నీటిని అందించాలి

● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ● లెఫ్ట్ పార్టీలు ఒకటి కావాలి : సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రం రాఘవేంద్ర ఫంక్షన్‌లో సిపిఐ 15వ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మహాసభ సందర్భంగా అరుణ పతాకాన్ని ఎగురవేసి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా శివన్నగూడెంలో నిర్మించిన చర్లగూడెం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ద్వారా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దోపిడీకి, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులేనని ఎర్రజెండా పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ చంద్రబాబు, నితీష్ మద్దతుతోనే బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు. అధికారం కోసం పార్టీలు మారుతున్నారని ఆయన గుర్తుచేశారు. లెఫ్ట్ పార్టీలు కలిసి ఒకే జెండా ఒకే గుర్తుతో ముందుకు పోవాలని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులు ఐక్యం ఐతే ప్రజలు అంతా మన వైపు ఉండే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టులే కీలంకంగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రజావిశ్వాసం పొందెందుకు కమ్యూనిస్టులు అంత ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆయుధాలు వదిలి నక్సలైట్లు జనంలోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ఐక్యత కోసం నక్సలైట్లు పని చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన బిజెపి చరిత్ర లేని పార్టీ అని విమర్శించారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తుందని చనిపోయిన నక్సలైట్ల శవాలను కూడా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా రాక్షసంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉందని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే టిఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పినట్లే ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, బొలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, ఎండి ఇమ్రాన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జక్క దయాకర్ రెడ్డి, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, పొట్ట శంకరయ్య, కలకొండ సంజీవ, కందుల లింగమ్మ, ప్రజానాట్యమండలి నల్గొండ జిల్లా అధ్యక్షుడు జగన్, సిపిఐ సీనియర్ నాయకులు దేశిడి నరేందర్ రెడ్డి, రుద్ర రాములు, పల్లె మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహిళలపై దాడులు అరికట్టడంలో
# ప్రభుత్వాలు విఫలం

ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో ఎన్ఎఫ్ఐ డబ్ల్యు నిర్మాణ మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొరిమి సుగుణ హాజరై మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలో జరుగుతున్న మహిళలపై అనేక హత్యాచారాలు దాడులు జరుగుతున్నాయని ఈ ప్రభుత్వాలు వాటిని అరికట్టడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచార దాడులను అరికట్టేందుకు దేశంలో నూతన చట్టాలు తేవాలని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించి మహిళలు రాజకీయాల్లో రాణించే విధంగా అవకాశాలు కల్పించాలన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటున అందించాలని కోరారు. మహిళ హక్కులను సాధించుకోవడంలో మహిళలంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సుగుణ పిలుపునిచ్చారు. మహాసభల అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గోలి లావణ్య, పెద్దమామల సంధ్య, క్యాథరాజు అనూష, పల్లెల రజిత, గడ్డం స్వరూప, కటకోళ్ల భారతి, ఇటుకల శ్రీలత, నజియా తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాతో తీవ్ర అన్యాయం

జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె : గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, ఎఐసిటియు జిల్లా నాయకులు నర్ర ప్రతాప్, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరిలు కోరారు. ఆల్ యూనియన్ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కందిక చెర్ల కేశవులు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పాశం రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దుకు పోనుకుంటూ నాలుగు లేబర్ కోడ్స్‌గా బడా బూర్జువా పెట్టుబడిదారి యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. కార్మికులు చాలి చాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలు గడుపుతూ అతి తక్కువ వేతనాలు తీసుకొని పనిచేస్తూ వారికి బోనసు సర్వీసు, ఇఎస్ఐపిఎఫ్ పనిభద్రత లాంటి సౌకర్యములు వర్తించడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలు అమలు అయితే కార్మికులకు అన్యాయమే జరుగుతుందన్నారు. కావున చట్టాలను రక్షించుకోవాలంటే జులై 9న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్మ సమ్మెలో కార్మికులు సమ్మెలో పాల్గొనాలని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎండి యాకోబ్, రవి తదితరులు పాల్గొన్నారు.



# మావోయిస్టులపై మారణహోమాన్ని వెంటనే ఆపాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం /కాసిపేట :** మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కాగర్ పేరుతో కొనసాగిస్తున్న మారణహోమా న్ని వెంటనే రద్దు చేయాలని, వారితో శాంతి చర్చలు జరిపి మానవ హక్కులను కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం కాసిపేట మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. గిరిజనులు వ్యవసాయం చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పేదలకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న బొగ్గు గనుల ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు ఇంటికి రాయి యాజమాన్యం చెల్లించాలని, రెండు గుంటల భూమికి సంబంధించిన బడ్జెట్ సపోర్ట్‌ను అందించాలని అన్నారు. మంచిర్యాల జిల్లాలో పార్టీ బలమైన నిర్మాణం కలిగి ఉన్న నేపథ్యంలో, జిల్లా కేంద్రంలో సిపిఐ కార్యాలయం నిర్మాణానికి ఒక ఎకరం భూమిని కేటాయించాలని కోరారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన సింగరేణి లాభాల్లో గని కార్మికులకు 40 శాతం వాటా ప్రకటించాలని, నూతన బొగ్గు బ్లాకులను కేటాయించాలన్నారు. కాజీపేట మండలంలోని చెరువుల కింద ఉన్న భూములకు సాగు నీరు అందించాలని, దేవాపూర్ గ్రామ పంచాయతీలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ భూములు కోల్పోయిన ఆదివాసులకు ఉద్యోగాలు కల్పించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిమెంట్ కంపెనీ వల్ల పరిసర గ్రామాల్లో పంట నష్టం, పర్యావరణ హాని ఏర్పడిన నేపథ్యంలో, విద్య, వైద్యం, రోడ్లు తదితర వసతులను యాజమాన్యమే కల్పించాలన్నారు. కాసిపేట పట్టణ సమితి ఆధ్వర్యంలో రామడుగు లక్ష్మణ్‌ను శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దాగం మల్లేష్, జాడి పోషం, దాడి గట్టయ్య, గట్టు సర్వేశం, దుర్గం సుధాకర్, శంకర్, రాయలింగు, సత్తయ్య, రాజన్న, గోలేటి రాజకుమార్, విజయ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సు కన్సల్టెన్సీల
# కార్మిక దోపిడీ అరికట్టాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జెబిఎం ఎలక్ట్రికల్ బస్సలు కన్సల్టెన్సీలు శ్రీబాలాజీ, సిల్‌కాన్‌కు చెందిన వారు బస్సులపై ఆధారపడి పనిచేస్తున్న కార్మికుల జీతాల నుంచి పిఎఫ్ డబ్బులు రికవరీ చేసుకుని ఐదు నెలలుగా ఆడబ్బును పిఎఫ్‌లో జమ చేయకుండా తమ సొంతానికి వాడుకోవడం అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య అన్నారు. వెంటనే ఆ డబ్బును వారి పిఎఫ్ ట్రస్ట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గత 5 నెలల నుంచి జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బంది జీతాల నుంచి పిఎఫ్ పేరుతో నెలకు రూ.3 వేలు కట్ చేసుకుని అట్టి డబ్బులను పిఎఫ్‌లో జమ చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటన వల్ల జెబిఎం యాజమాన్యం, ఆర్‌టిసి యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల పిఎఫ్ డబ్బులను కాజేసిన వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల డబ్బులను పిఎఫ్ ఖాతాలో జమ చేపించాలని, లేని పక్షంలో జెబిఎం బస్సులపై పనిచేసే సిబ్బందికి ఎఐటియుసి అండగా నిలిచి వారి సమస్యల కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా జెబిఎం, విద్యుత్ బస్సులలో పనిచేసే కార్మికులు యాజమాన్యాలకు భయపడకుండా సంఘటితం కావాలని, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పదవ తరగతి సప్లమెంటరీ ఫలితాల్లో 82.13 శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలలో రంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులు 82.13 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డిఇఒ సుసిందరారావ్ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి పరీక్షలకు బాలురు 3092, బాలికలు 2568 మొత్తం 6470 హాజరు కాగా వారిలో బాలురు 3015 (79.83శాతం), బాలికలు 2199 (85.63శాంతం) మొత్తం 5314 ఉత్తీర్ణులై 82.13 శాతం సాధించినట్లు ఆయన వివరించారు. మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేయదలచిన వారు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 ఫీజు ప్రభుత్వ పరీక్షల విభాగం, నాంపల్లి,హైదరాబాదుకు చెల్లించాలన్నారు. మార్కుల రీ వెరిఫికేషన్‌కు అప్లై చేయదలచిన వారు ఒక్కో సబ్జెక్టుకు వెయ్యి రూపాయల చొప్పున స్కూల్ లాగిన్‌లో ఆన్లైన్లో నమోదు చేసి సంబంధిత అప్లికేషన్, ఒరిజినల్ చలాన్, జిరాక్స్ హాల్ టికెట్, జిరాక్స్ మెమో, రెండు కవర్లతో రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం కొంగరకలాన్‌లో అందజేయాలని డిఇఒ తెలిపారు.

# నేడు పిజెఆర్ ఫ్లైఓవర్ ప్రారంభం

### ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొండాపూర్ వరకు చేపట్టిన పిజెఆర్ ఫ్లైఓవర్ శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నుండి కొండాపూర్ వరకు అత్యాధునిక మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయింది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే, గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది.

**ప్రాజెక్ట్ వివరాలు...** ఈ ఫ్లైఓవర్‌ను వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డిపి) ద్వారా రూ. 182.72 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఇది 1.2 కి.మీ పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్‌లతో నిర్మించారు. దీని ప్రత్యేకత ఏమిటంటే ఇది ఇప్పటికే ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన మూడవస్థాయి నిర్మాణం. కింద గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్ ఉంది. దాని పైన శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్, ఇప్పుడు దాని పైన ఫేజ్ 2 ఫ్లైఓవర్ నిర్మించారు.

**ప్రయాణికుల ట్రాఫిక్ కష్టాలు పరిష్కారమవుతాయి..** ఈ ఫ్లైఓవర్ గచ్చిబౌలి జంక్షన్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను చాలా వరకు తగ్గించనుంది. ఓఆర్ఆర్ నుండి కొండాపూర్, హఫీజ్‌పేట్ మార్గాలకు వెళ్లే వాహనాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. ఇది హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. ప్రయాణ సమయాన్ని ఆదా చేయడంతో పాటు, మీరు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా చేరవలసిన గమ్యస్థానాలను వేగంగా చేరుకోవచ్చు. కొండాపూర్ ప్రాంతం నుండి, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుండి కొండాపూర్ ప్రాంతాలకు గచ్చిబౌలి వద్ద ఎటువంటి ట్రాఫిక్ జామ్‌లు లేకుండా నేరుగా చేరుకోవచ్చు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభం హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగు అవుతుంది. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్ఆర్‌డిపి పెద్ద పునాది వేసిన నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ ద్వారా 23వ ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. ఎస్ఆర్‌డిపి ద్వారా ఫ్లైఓవర్లు చేపట్టినా, నగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిర్ణీత సమయంలో నేరుగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ఎస్ఆర్‌డిపి ద్వారా చేపట్టిన మొత్తం 42 పనులలో 37 పనులు ఈ ఫ్లైఓవర్‌తో పూర్తయ్యాయి. ఫలక్‌నుమా రైల్వే ఓవర్‌బ్రిడ్జి, శాస్త్రిపురం ఆర్ఓబి పనుల రైల్వే భాగాన్ని రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని కమిషనర్ ఆర్‌వి కర్ణన్ లక్ష్యంగా నిర్దేశించుకొని రైల్వే అధికారులను కోరారు. జూలై చివరి నాటికి ఫలక్‌నుమా ఆర్ఓబి పనులను, ఆగస్టు చివరి నాటికి శాస్త్రిపురం ఆర్ఓబి పనులను పూర్తి చేయాలని కమిషనర్ వారికి లక్ష్యంగా నిర్దేశించారు. ఈ రెండు ఆర్ఓబిలు పూర్తయితే, 39ఎస్ఆర్‌డిపి పనులు పూర్తవుతా యి. వాహనదారులు ఈప్రాంతంలో ట్రాఫిక్‌అంతరా యం లేకుండా ప్రయాణించేందుకు అవకాశం లభిస్తుంది.






**ఇక నుంచి హెచ్ సిటీ ద్వారా ప్రాజెక్టులు..** ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ గుర్తింపుకు తీసుకురావడానికి మౌలిక సదుపాయాలకు ప్రత్యేక ప్రణబూళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గతంలో జిహెచ్‌ఎంసికి ఇచ్చిన హామీ ప్రకారం, నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. జిహెచ్‌ఎంసి ఆర్థిక ఇబ్బందుల నుండి ఉపశమనం పొందుతోంది. ప్రజాపాలన ప్రభుత్వం నగర అభివృద్ధికి రూ.7032 కోట్ల వ్యయంతో 58 పనులను హెచ్ సిటీ ద్వారా చేపట్టనుంది. వీటిలో 28 ఫ్లైఓవర్లు, 13 అండర్‌పాస్‌లు, 4 ఆర్ఓబిలు, మూడు రైల్వే అండర్‌బ్రిడ్జిలు, 10 రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి.

## 29వరకు చేతివృత్తుల కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన

### వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా అధికారి కేశురామ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** హైదరాబాదు ఐమాక్స్ థియేటర్ సమీపంలో బిసి సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన చేతివృత్తుల కళాకారుల ఉత్పత్తు ప్రదర్శనను వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.కేశురామ్ తెలిపారు.జూన్ 25వ తేదీ ప్రారంభమైన ఎగ్జిబిషన్ లో తెలంగాణ లోని వివిధ ప్రాంతాలకు చెందిన బి.సి.వృత్తి కళాకారులు కుమ్మరి,చేనేత,మేదరి,వడ్రంగి,పూసల,తదితర వృత్తి కళాకారులు తయారు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శన,అమ్మకలు జరుగుతున్నాయని,ఈనెల 29 వరకు కొనసాగించే ఇట్టి ఎగ్జిబిషన్ ని రంగా రెడ్డి జిల్లాలోని ప్రజలు సైతం వినియోగించుకొని బి.సి. వృత్తి కళాకారులు తయారు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శనలో పాల్గొని అట్టి ఉత్పత్తులను కొనుగోలు చేసి తద్వార వృత్తి కళాకారులను ప్రోత్సహించగలరని బిసి సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి కేశురామ్ కోరారు.ఇట్టి ఎగ్జిబిషన్ లో స్టాల్స్ ను సందర్శించిన వివిధ శాఖల ఉన్నతాధికారులు,ప్రజా ప్రతినిధులు,వివిధ పార్టీలో ప్రజాసంఘాల నాయకులు,ప్రజల నుండి అత్యంత ఆదరణ పొందుతున్నట్లు రంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ అధికారి కేశురామ్ పేర్కొన్నారు.

## డిప్యూటీ మేయర్‌ను కలిసిన సికింద్రాబాద్ సర్కిల్ ఏసిపి పావని



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి సికింద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ సిటీప్లానర్ (ఏసిపి)గా బాధ్యతలు చేపట్టిన పావని శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ నాయకులు శోభన్ రెడ్డి ఆమె వెంట ఉన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పోచమ్మదేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఒక లక్ష రూపాయాలను విరాళంగా అందజేశారు. శుక్రవారం కేశంపేట మండలం లింగంధన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయానికి తన వంతుగా ఒక లక్ష రూపాయాలను గ్రామస్తులకు అందించారు. కార్యక్రమంలో శేఖర్ పంతులు, తాండ్ర విష్ణ వర్ధన్‌రెడ్డి, యారం శేఖర్‌రెడ్డి, రాంచందర్, క్రిష్ణయ్య, రామస్వామి, జంగయ్య, ఇస్తారి, బాలయ్య, మల్లేష్, నాగరాజు, బాలస్వామి పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు

### బిసిసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



**ప్రజాపక్షం/కొందుర్గు:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసిలు ఐక్యంగా ఉంటేనే సమస్యలను పరిష్కారం అవుతాయని బీసిసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప ఆధ్వర్యంలో జిల్లేడు చౌదరిగూడ మండల బీసిసేన అధ్యక్షునిగా బోయ చెన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ బీసిలు అన్నిరంగాల్లో రాణిస్తేనే చైతన్యం వచ్చినట్లు అవుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్. కత్తి చంద్రశేఖర్ అప్ప, మేకల వెంకటేష్, జివ్వా సుధాకర్, పాలాది శ్రీనివాస్, భూషం నరేష్, మల్కపురం రవి, శ్రీను, జయ శ్రీకాంత్, సౌజన్య, చెరుకు మమత, భాగ్యలక్ష్మి , బాలమణి పాల్గొన్నారు.

## అంతారం మిషన్ భగీరథ ప్రాజెక్టు పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్



**ప్రజాపక్షం/షాబాద్ :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని అంతారం గ్రామంలో మిషన్ భగీరథ ప్రాజెక్టును శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ తనిఖీ చేశారు. అనంతరం ప్రాజెక్టులో పని చేస్తున్న మిషన్ భగీరథ నీటి శుద్ధి చేసే యంత్రాలను పరిశీలించారు. ప్రాజెక్టులో పని చేస్తున్న అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇఎన్‌సి కృపాకర్ రెడ్డి, ఎస్ఇ అంజనేయులు, ఇఇలు చల్మారెడ్డి, రాజేశ్వర్ రావు, వెంకటేశ్వర్లు, ఎఇ ప్రఫుల్ కుమార్ ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఫరూక్‌నగర్ మండల ప్రత్యేక అధికారి జె.రామారావు సూచించారు. శుక్రవారం ఎంపిడిఓ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ బన్సీలాల్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఎంపిఓ జయంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాఘవేందర్ తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పౌర హక్కులు కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం

### 'శాంతి సంతకాల' సేకరణలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఆదివాసి ప్రజల మానవ హననం ఆపాలి శాంతి చర్చలు జరపాలి, భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుందాం, శాంతి సాధన కోసం జరిగే పోరాటంలో భాగస్వామ్యం అవుదాం' అనే లక్ష్యంతో ఉస్మానియా యూనివర్శిటీ స్టూడెంట్స్ ఫోరం ఫర్ పీస్ (శాంతి కోసం విద్యార్థులు) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం 'శాంతి సంతకాల' సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒయు విశ్రాంత ఆచార్యులు తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరవ్వగా పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కోటా శ్రీనివాస్, పెద్దమ్మ రమేష్ ముదిరాజ్, బట్టు వెంకటేశ్వర్లు, ఆజాద్,ఎస్ నాగేశ్వరరావు, శ్రీకాంత్, నెల్లి సత్య, పెంచాల సతీష్,లెనిన్, మంద నవీన్, రంజిత్, చేవెళ్ల యాదగిరి, రాకేష్, ఆసిఫ్, వేదాంత మౌర్య అన్సర్, సుమంత్, కె స్వాతి, ఉప్పల ఉదయ్ కుమార్,వినోద్, పగిళ్ల ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికిచిత్తశుద్ధి ఉంటే దేశంలో ఉన్న పేదరికం, నిరుద్యోగం, సామాజిక రాజకీయ అసమానతలు రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పదోన్నతుల ప్రక్రియకు ముందే జిహెచ్‌ఎం బదిలీలు

### టిఎస్‌జిహెచ్‌ఎంఎ వినతి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పాఠశాల విద్యలో పదోన్నతుల ప్రక్రియ చేపట్టడానికి ముందు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయు(జిహెచ్‌ఎం)లనుబదిలీ చేయాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ (టిఎస్‌జిహెచ్‌ఎంఎ) సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రాజగంగారెడ్డి, ప్రధానకార్యదర్శి గిరిధర్‌గౌడ్ మాట్లాడారు. 2023–24లో స్కూల్ అసిస్టెంట్‌లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఇతర జిల్లాల్లో పదోన్నతి కల్పించారని తెలిపారు. దీనివల్ల సొంత జిల్లా నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. కావున, ముందుగానే సీనియర్ ప్రధానోపాధ్యాయులను బదిలీ చేసి, వీరందరికీ సొంత జిల్లాల్లో పనిచేసే అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు కె.దామోదర్‌రెడ్డి, కె.కృష్ణచారి, శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, రఘునందన్ చారి, ప్రసూన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబుపై విమర్శలు : టిడిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ సిఎం, టిడిపి అధినేత చంద్రబాబును బూచిగా చూపించి, రాజకీయ లబ్ధిపొందాలనుకుంటున్న కల్వకుంట్ల కవితకు ఆయనను విమర్శించే స్థాయికాదని పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో సాయిబాబా మాట్లాడుతూ బనకచర్లపై రాజకీయంగా లబ్ధి పొందేందుకు కవిత మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, శ్యామ్ సుందర్, అనిల్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



## 48 గంటల్లోగా బిసి బిల్లు తేకుంటే రాష్ట్ర బంద్

### రాష్ట్ర ప్రభుత్వానికి జాజుల, చిరంజీవులు హెచ్చరిక



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి 48 గంటల్లోపు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో అన్ని బిసి సంఘాలను కలుపుకొని రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు హెచ్చరించారు. అటు కాంగ్రెస్, ఇటు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బిసిలను మోసం చేస్తున్నాయని వారు మండిపడ్డారు. బిసిల పట్ల నిర్లక్ష్య వైఖరి మారకపోతే వంటావార్పు, రహదారుల దిగ్బంధనం వంటి నిరసన కార్యక్రమాలతో బిసిల సత్తా ఏంటో చాటుతామన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానికలో బిసిలకు 34శాతం ఉన్న రిజర్వేషన్లను 18శాతం తగ్గించిన ఘనత ఆ పార్టీదేనని విమర్శించారు. ఇప్పుడు బిసిల గురించి మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీకి లేదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బిసిల రిజర్వేషన్లపై ఆలోచించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరపాలనడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నదని వారు ఆరోపించారు. ఏ రాజకీయ పార్టీతో తమకు సంబంధం లేదని, బిసిల రిజర్వేషన్ల సాధన తమ లక్ష్యమని ఈ సందర్భంగా జాజుల, చిరంజీవులు అన్నారు. సమావేశంలో బిసి సంఘం నేతలు బాలగోని బాల్‌రాజుగౌడ్, చామకూర రాజు, కె.వి.గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం గురించి ప్రజలలో అవగాహన



**ప్రజాపక్షం/యాచారం :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శిగా గోదాసు రాములు నియామక పత్రం అందచేసినట్లు సమాచార హక్కు చట్టం జాతీయ అధ్యక్షులు చంటి తెలిపారు. హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో నియామక పత్రం ఇచ్చినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని ప్రతి పౌరుడికి తెలియజేయాలని గోదాసు రాములు తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రకారం 30రోజులలో సమాచారం ఇవ్వాల న్నారు. ప్రభుత్వ వ్యవస్థలలో పారదర్శకత పెంచడం కోసం జవాబుదారి విధానాన్ని మేరుగు పర్చాలన్నారు రాజ్యాంగ కల్పించిన హక్కును నిరాకరించే అధికారం అధికారులకు గానీ ఏ శాఖకు గానీ లేదని తెలిపారు.తనపై ఎంతో నమ్మకం ఉంచి ఆ పదవిని కట్టబెట్టిన చంటికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.


## ప్రణాళిక బద్ధంగా కాలనీల అభివృద్ధి : రాగుల



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** డివిజన్‌లోని ప్రతి కాలనీలను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ, జైహింద్ బాబు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తునామన్నారు. అభివృద్ధి పనులను కాలనీ సంక్షేమ వాసులు సహాకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, కాలనీ వాసులు మకుంద రాజ్, పడమటి జైపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, క్రాంతి కుమార్, నరసింహారెడ్డి, జగదీష్, ఉప్పు వెంకటేష్, పురుషోత్తం, నరేందర్ పాల్గొన్నారు.

## మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆర్యవైశ్య సంఘానికి చెందిన పలువురు మహిళలు శుక్రవారం టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ టీ నగర్ కాలనీలోని నివాసంలో జరిగిన చేరికల కార్యక్రమంలో మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో ప్రధాన్యత కల్పిస్తుందన్నారు. ఆర్టీసీలో బస్సులను మహిళలు కేటాయించడంతో పాటు, మహాలక్ష్మి క్యాటీన్లు ఏర్పాటు తదితర ఉపాధి కల్పన ఏర్పాట్లతో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో నీల విజయలక్ష్మి , వరలక్ష్మి , శ్రీలత, బాలమణి, కవిత, శ్రీదేవి, గాయత్రి, కావ్య, లీలావతి, సుమశ్రీ, అనసూయ, కవిత తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ డైరెక్టర్లు కంచర్ల కవిత, ఓరుగంటి నరేష్, కర్మాఘాట్ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం తూకంలో కోతలు సహించేదిలేదు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం తూకంలో కోతలు విధిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ ఆర్‌డిఓ ఎన్ఆర్ సరిత నేతృత్వంలో రెవిన్యూ అధికారుల సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం గ్రామీణ పేదలు ఎంతో అశగా ఎదురు చూస్తున్నారని, ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటిల్లో మొత్తం 26వేల ధరఖాస్తులు ప్రజల నుండి రేషన్‌కార్డుల కోసం వచ్చాయని వివరించారు. రేషన్ తూకాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రణాల ప్రకారం సన్న బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. అధికారులు సమయంలో పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని పేర్కొన్నారు. అధికారులు తప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తే ఉపేక్షించేది లేదని..అక్రమ దంగాలను వదులుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రతి డాక్యుమెంట్‌ను నిశితంగా పరిశీలించాలని, చిల్కమర్రి భూ మోసంపై బాధిత రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వివరించారు.

**మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా...** మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శంకర్ వివరించారు. మున్సిపల్ పరిధిలోని 15,21వార్డుల్లో సాధారణ నిధులు రూ.25లక్షలతో సిసిరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.



### పూరి జగన్నాథ రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పూరి జగన్నాథ స్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఆర్‌టిసి కాలనీలో పూరి జగన్నాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్నాథ స్వామి రథచక్రాలతో నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడు సుభిక్షంగా ఉండాలని, రైతులు, కర్షక కార్మికులు అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, చెన్నయ్య, విశ్వం, బస్వం, జమృద్ ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, అందె మోహన్, కొప్పునూరి ప్రవీణ్, అప్పి, లింగారెడ్డిగూడ అశోక్, బచ్చలి నరేష్, శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.

మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## రూ.217కోట్లు రైతుల ఖాతాలో జమ:అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాలోని రైతులకు 217కోట్లు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. వికారాబాద్‌లోని మిల్లర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి డెలివరీ చేయుట గురించి రబి2024–25 సంవత్సరానికి సంబంధించిన 98,220 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. వరి ధాన్యం రైస్‌గా మార్చి వెంటనే సిఎంఆర్‌కు తరలించాలని అన్నారు. 8769 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యమును రైతుల నుంచి కొనుగోలు చేశామని వాటిని తిరిగి రేషన్‌కార్డులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైన ప్రభుత్వ ఆదేశాలను ఉల్లఘించినట్లయితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



## పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో చిన్న,మధ్య తరహ,ప్లాస్టిక్ రంగ పరిశ్రమల అభివృద్ధి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ(సిపెట్)లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైజింగ్ ఎక్సెలరేటింగ్ ఎంఎస్ఎంఇ ప్రోగ్రాం(ర్యాంప్)లో భాగంగా ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ మధుకర్‌బాబు, నరేంద్రబాల్దవా, సిపెట్ ప్రిన్సిపల్ డైరెక్టర్ బి రవి, ఆంజనేయశర్మ, శ్రీకర్, కిరణ్‌కమార్, జెసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

### టిపిసిసి ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌కు వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఉద్దెమర్రి మాజి సర్పంచ్ దోసకాయల వెంకటేష్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్ ఉద్దెమర్రిలో అర్హులైన నిరుపేదలకు అదనంగా ఇందిరమ్మ మంజూరు చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దెమర్రి గ్రామానికి మొదటి విడతలో 22 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని ఆ ఇండ్లకు ముగ్గులు పోసి నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. ఇంకా గ్రామంలో అదనంగా 82 మంది ఇండ్లు లేనివారు ఉన్నారని వారికి రెండవ విడతలో ఇండ్లు మంజూరు చేయాలని టిపిసిసిని కోరారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ పట్టా బాల్‌నర్సింహా, నల్ల ప్రభాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకటగిరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా హరిశంకర్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఆర్యవైశ్య మహాసభ ఉమ్మడి శామీర్‌పేట మండల అధ్యక్షుడిగా అలియాబాద్‌కు చెందిన గట్టు హరిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని జగ్గంగూడ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదె రమేష్‌గుప్త, జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చు నాగేష్‌కుమార్‌లు ఎన్నిక అధికారులుగా వ్యవహరించారు. అధ్యక్షుడుగా గట్టు హరిశంకర్, వర్కింగ్ ప్రసిడెంట్ గంగిశెట్టి గణేష్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు విశ్వేశ్వర్‌గుప్త, ఆర్యవైశ్యులు నాగరాజు, చంద్రశేఖర్, మణిగండ్ల కిష్టయ్య, గంగిశెట్టి శ్రీనివాస్, మర్యాల వీరేషం, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

**ప్రజాపక్షం/దుండిగల్ :** రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లంపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గీతాంజలి స్కూల్లో చదివే అభిమన్ను రెడ్డి(6) బాబుని వాళ్ళ అమ్మ స్కూటీ మీద తీసుకొని వస్తుండగా టిప్పర్ కింద పడి బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వీరు మల్లంపేటలోని ఆకాశ లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. బాబు గీతాంజలి ఇంటర్నేషనల్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. బాబుని స్కూటీపై ఎక్కించుకుని ఇంటి నుండి బయలుదేరి మార్గమధ్యంలో పల్లవి స్కూల్ జంక్షన్ దగ్గరికి చేరుకొనగా స్కూటీని టిప్పరు ఢీ కొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మరణించాడు. టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





## షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

### రూ.పదివేలు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వెస్ట్ గాంధీ నగర్ రోడ్ నంబర్1లో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం కావడంతో తెలుసుకున్న నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వారిని పరామర్శించి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానని, ప్రభుత్వం నుండి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్న...

# నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమిద్దాం

**జులై 2న చలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి**

**ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్**



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** భారతదేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) మేడిపల్లి మండల సమితి ఆధ్వర్యంలో జులై 2న చలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్ తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ, నరేంద్ర మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే, మన దేశ ప్రతిష్టను మోదీ తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మోదీ ట్రంప్ మాటలను సైతం ఖండించలేదని అన్నారు. భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసిన మోదీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ ప్రయోజనాలను కాపాడతామని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం వాస్తవానికి, ఇటువంటి కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ముందు లొంగిపోయారని మండిపడ్డారు. మోదీ అమెరికా సందర్శించినప్పుడల్లా కోట్లాది రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తారు. హౌడీ మోడీ, నమస్తే ట్రంప్ వంటి ప్రజా దుర్వినియోగ కార్యక్రమాలు చేపడుతున్నారే తప్ప, భారతదేశంలో యువతకు అవసరమైన నిర్దిష్ట ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని వారు ధ్వజమెత్తారు. ట్రంప్‌ను ప్రపంచ అధ్యక్షుడుగా చేసేందుకే మోదీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మోదీ, ట్రంప్ వల్ల ఆయా దేశాలకు ఒరిగిందేమి లేదని వారు ఉద్ఘాటించారు. అందుకే ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చామని, రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున యువజన సంఘ శ్రేణులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడిపల్లి మండల అధ్యక్షులు నాగరాజ్, కార్యదర్శి మణిదీప్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, మేడిపల్లి మండల సమితి నాయకులు కౌశిక్, మొన్న, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసేదెప్పుడు?

**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**



**ప్రజాపక్షం/బోడుప్పల్:** తెలంగాణలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మేడిపల్లి మండల ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్య పేద వారికి అందని ద్రాక్షగా మారిందని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను అంగడి సరుకుగా మార్చాయని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, బుక్స్ ఫీజులంటూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణలో శ్రీ చైతన్య, నారాయణ ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలకి విద్యాశాఖ అధికారులు వత్తాసు పలకడం ద్వారా వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, కనీసం వాటిని నియంత్రించే చర్యలు కూడా తీసుకోవడం లేదన్నారు. విద్యా సంస్థల్లో ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు చేపట్టవద్దంటూ అనేక జిఒలు ఉన్నా వాటిని తుంగలోతొక్కి వారి సొంత చట్టాలను అమలు చేస్కుంటూ, విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, వారి రక్తాన్ని జలగల్లా పట్టి పీడిస్తు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కూడా పేదవాడు విద్యను కొనుక్కునే స్థానంలో ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను ధ్వంసంచేసి పాలకులు చోద్యం చూస్తున్నారని, ప్రభుత్వ విద్యారంగానికి కావాల్సిన నిధులు, నియామకాలు చేపట్టకుండా, మౌలిక వసతులు కల్పించకుండా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టాలు తెచ్చినా వాటిని అమలు చేయడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందారని, వారు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి వారు చేస్తున్న ఫీజుల దోపిడీకి సహకరిస్తున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలపై ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు విద్యాసాగర్, మనోహర్, ఆదిత్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నేడు దేవరయాంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని శామీర్‌పేట ఎఇ రాఘవేందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి కొత్తపేట్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు గోదాములు, ఫూల్‌సింగ్ ఏరియా, లిటిల్ ఇంగ్లాం డ్, ఉషాగ్రీన్ పార్క్, జెబి గంగా విహార్ ఏరియా, అలాగే 11కెవి డిఎంసి ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు గోదాములు, గ్రీన్ ల్యాండ్స్, అర్కెల గూడెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

## నూతన మున్సిపల్ కమిషనర్‌గా రాజేష్



**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా పి రాజేష్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శుక్రవారం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యదవ్,కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, కీసర ఆలయ ధర్మకర్త అమర్‌లు మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి,రాజేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్, సహకార బ్యాంక్ డైరెక్టర్ ఉదయ్ రెడ్డి, కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షులు కోరుబోతు నాగరాజ్, మాధవరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షులు శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షులు ఫరూక్, మమ్మద్ యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, మల్లేష్ యాదవ్, మేకల సునీల్, శివ, గోదా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ బంగారం విక్రేతల అరెస్ట్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నకిలీ బంగారాన్ని విక్రయించేందుకు వచ్చిన ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎ స్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని కుషాయిగూడ చక్రీపురంలోని ప్రియ స్మైల్ డెంటల్ క్లినిక్‌కు ముగ్గురు ఆగ్రాకు చెందిన దేవేందర్‌కుమార్(65),రవి(30),గంగుబాయి(45)లు వచ్చి ఆసుపత్రిలో చికిత్స చేసుకుని తమ వద్ద డబ్బులు లేవు బంగారం ఇస్తామని కిలో బంగారం ఉన్నదని దాన్ని 6 లక్షల రూపాయలకు విక్రయిస్తామని తెలిపారు. బంగారాన్ని



తనిఖీ చేయగా నకిలీదని తెలింది. దీంతో డాక్టర్ ప్రియాంక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి

### వైద్యాధికారులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మరమ్మతు పనులను త్వరితగతిని పూర్తి చేయాలని వైద్యఅధికారులను కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. శుక్రవారం సాయత్రం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి అవసర విభాగాలను ఏర్పా టు చేసుకొని ప్రజలకు వైద్య సేవలను అందించే విధంగా ఆసుపత్రి తీర్చిదిద్దుకునే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రి మరమ్మతులు పంచాయతీరాజ్ ఇ ఇ రమేష్ కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివరెడ్డి పెట్‌లో గల గోదామును పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న గోదాముకు సంబంధించి మరమ్మతు పనులను పూర్తిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదన పు కలెక్టర్ సుధీర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, పిఆర్ ఇఇ ఉమేష్. జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

**పూడూర్:** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండల పరిధిలోని చన్గోముల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ దవాఖానను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తనిఖీ చేసి ఆసుపత్రిలో జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. ఎంపిడిఒ పాండును అడిగి తెలుసుకున్నారు.పెండింగ్‌లో గల మరమ్మత్తులను త్వర గా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అంతకుముందు వికారాబాద్ నుండి చేవెళ్ల వేళ్లే రోడ్డు నుండి మిర్జాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డును జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ పరిశీలించారు. పూడూర్ మండల నుండి మీర్జాపూర్ రోడ్డు పనులను ఇఇ పిఆర్ ఉమేష్ మెయిన్‌రోడ్డు నుండి గ్రామ వరకు రోడ్డు అంచనా వ్యాయాయన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.రోడ్డు 305 వెడల్పుతో 1.3 కిలోమీటర్ 80లక్షలు ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు. రోడ్డు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు.

గ్రామానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శి గ్రామంలో వీధి లైట్లు, చెత్త సేకరణ ట్రాక్టర్ రోజువారీగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్ , డిఆర్‌డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** అనంతగిరి స్వదేశీ దర్శన్ ప్రాజెక్టులో భాగంగా అనంతగిరి గుట్టపై పర్యాటకులకు త్రాగునీరు వసతి కల్పించడానికి రూ.6కోట్ల నూతన త్రాగునీరు సరఫరా పథకానికి వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలోని కద్చర్ల గుట్టపై జిల్లా కలెక్టర ప్రతీక్‌జైన్‌తో కలిసి శంకుస్థాపన చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ మండలానికి చెందిన 30మంది లబ్ధిదారులకు సిఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు వైద్య చికిత్సలో ఆర్థిక భారం తగ్గుదల

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సిఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన ఎల్ఒసి చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుల సమక్షంలో ముగ్గురు లబ్దిదారులకు సిఎంఆర్‌ఎఫ్ నిధుల ద్వారా మంజూరైన రూ.3,50,000/– ఎల్ఒసి చెక్కులను లబ్ధిదారుల కుటుంబసభ్యులకు పంపిణీ చేశారు. లబ్దిదారులు వివరాలు: అముల్లా తస్లీం, రోడ్డమిస్త్రీ నగర్ నివాసి రూ.2,00,000/–, బేసన్ గౌరి బాయి, గాంధీ నగర్ నివాసి రూ.75,000/– , గుద్దితి రామాంజనేయులు, ద్వారకా నగర్, చింటల్ నివాసి రూ. 75,000/ విలువ గల చెక్కులను ప్రభుత్వ సహాయం అవసరమైన వారికి సకాలంలో అందేలా చూసే ప్రయత్నంలో భాగంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద నిరంతరం కృషి చేస్తున్నారని, ఈ నిధుల ద్వారా లబ్దిదారులకు వైద్య చికిత్సలో ఆర్థిక భారం నుంచి ఉపశమనం కలుగుతుందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 131 డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.ఎం గౌరీష్, 125 డివిజన్ పార్టీ అధ్యక్షులు విజయ్ రామి రెడ్డి, ఉద్యమకారుడు కస్తూరి బాలరాజు, సురేందర్ రెడ్డి, కళ్ళెం శ్రీనివాస్ గౌడ్, రంజాన్ పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్ అన్నారు. శుక్రవారం కుషాయిగూడ శ్రీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపట్ల సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసి జగన్ విచ్చేసి వర్షాకాలంలో వ్యాప్తిస్తున్న సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియాపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరిసర ప్రాంతాలలో వర్షం నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎస్ సుదర్శన్, ఎంటమాలజీ ఎఇ డి రమేష్, స్కూల్ ప్రధానాచార్యులు రాధిక, నరేందర్‌రెడ్డి, లక్ష్మి , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బస్తీ దవాఖానకు వీల్‌చైర్ అందజేత


**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీలోని బస్తీ దవాఖానకు వీల్ చైర్‌ను అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన రామచంద్రయ్య కుమారుడు, కాలనీ మాజీ ప్రెసిడెంట్ ఆర్. వెంకటేష్ దేవస్థాన కమిటీ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్ చేతుల మీదుగా వీల్ చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బస్తీ దవాఖానకు వీల్ చైర్ అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## ఏషియన్ 'కూలీ' హక్కులు

సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా వస్తున్న 'కూలీ' సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నారు. రజనీకాంత్, నాగార్జునలతో పాటు సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతి హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు ఇందులో కీలకమైన పాత్రల్లో కనిపిస్తారు. ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్స్(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో) విడుదల చేయనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, టీజర్లు సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి.



## 'మైసా' ఫస్ట్ లుక్ రిలీజ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో చేస్తున్న హర్రర్ సినిమా మైసా. అన్‌ఫార్ములా ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. అజయ్, అనిల్ సయ్యపు రెడ్డి ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో హై బడ్జెట్‌తో నిర్మించనున్నారు. సాయి గోపా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రష్మిక మందన్న కొలిగ్స్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి తెలుగు లుక్, పోస్టర్‌ను లాంచ్ చేశారు. 'కుబేర' కో యాక్టర్ ధనుష్ తమిళ్ పోస్టర్, 'చావా' కో యాక్టర్ విక్కీ కౌశల్ హిందీ పోస్టర్‌ను విడుదల చేశారు. దుల్కర్ సల్మాన్ మలయాళ పోస్టర్‌ను, శివరాజ్ కుమార్ కన్నడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'మైసా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్ 'ఇంతకు ముందు ఎప్పుడూ చూడనిది' అనే పదానికి నిర్వచనంలా వుంది. రష్మిక ఇంటెన్స్ లుక్ కట్టిపడేసింది. సాంప్రదాయ చీరలో, ముక్కుపుడక, ఆభరణాలతో రష్మిక ఆదివాసీ మహిళగా కనిపించారు. ఆమె ఇంటెన్స్ లుక్, రక్తపు మరకలున్న రూపం, ఆమె చేతిలో గట్టిగా పట్టుకున్న వెపన్ అన్నీ ఒక పవర్ ఫుల్ పాత్రను తెలియజేస్తున్నాయి. టైటిల్, ఫస్ట్ లుక్ అందరిలోనూ ఆసక్తిని రేపాయి. 'మైసా అనేది రెండు సంవత్సరాల కష్టం ఫలితం. కథ, ప్రపంచం, కళా దృక్పథం, పాత్రలు – ప్రతీ అంశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాం. ఇప్పుడు ఈ కథను ప్రపంచానికి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం' అని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపారు. ఈ సినిమా ఆదివాసీ తెగల ప్రపంచాన్ని ఆధారంగా చేసుకుని రూపొందిన అద్భుతమైన ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా వుండబోతోందని దర్శకుడు చెప్పారు. 'ఓర్పు ఆమె ఆయుధం. ఆమె గర్జన వినిపించేందుకు కాదు.. భయపడించేందుకు! రష్మిక మందన్నను మైసా పాత్రలో చూడండి, ఆమె అవతార్ ఇదే' అని నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది.



## కల్కికి ఏడాది

ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకోన్ ప్రధాన పాత్రలో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా కల్కి2898ఏడీ. పాన్ ఇండియాగా తెరకెక్కిన ఈ సినిమా పాన్ వరల్డ్ కలెక్షన్లను సొంతం చేసుకుంది. ప్రముఖ నిర్మాత సి. అశ్వినీ దత్ నిర్మించిన ఈ సినిమా 27 జూన్ 2024లో థియేటర్లలో విడుదలైంది. ఇటీవల ఈ సినిమా దర్శకుడు నాగ్ అశ్విన్‌కు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుతో ఉత్తమ దర్శకుడి అవార్డు లభించింది. కల్కి సినిమా పార్ట్ 2 ఇంకా రావలసి ఉంది. కల్కి సినిమా విడుదలై ఏడాది అవుతున్న సందర్భంగా కల్కి సినిమా పోస్టర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమాకు సంబంధించిన పలువురు కల్కి ఏడాది అయిన సందర్భంగా ఈ పోస్టర్ ను తమ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

## జూలై 4న ఫీనిక్స్



మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఫీనిక్స్'. ఏకే బ్రేవ్ మ్యాన్ పిక్చర్స్ ఈ సినిమాని సమర్పిస్తోంది. జూలై 4న ఈ చిత్రం థియేటర్ లో విడుదల కానుంది. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం యాక్షన్‌తో పాటు భావోద్వేగాలను మిళితం చేస్తూ, కొత్త హీరోకి సరైన లాంచింగ్ మూవీగా తెరక్కించారు. .ఈ సినిమాకి సామ్ సిఎస్ సంగీతాన్ని అందిస్తుండగా, వెల్‌రాజ్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కెఎల్ ఎడిటర్ అందిస్తున్నారు.ఇది సూర్య సేతుపతి పూర్తి స్థాయిలో హీరోగా నటిస్తున్న తొలి చిత్రం కాగా, గతంలో నానుమ్ రౌడీ ధాన్, సింధుబాద్ వంటి చిత్రాల్లో సూర్య సేతుపతి చిన్న చిన్న పాత్రల్లో కనిపించాడు. ఫీనిక్స్‌తో పూర్తి స్థాయి హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలోని ఇంధ వంగికో, పాటను విడుదల చేశారు.

## 'లవ్ జాతర' ఫస్ట్ లుక్




అంకిత్ కొయ్య, మానస చౌదరి హీరో హీరోయిన్లుగా యూజీ క్రియేషన్స్ బ్యానర్ లో 'సమ్మతమే' ఫేమ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి రూపొందిస్తున్న చిత్రానికి 'లవ్ జాతర' టైటిల్ ఖరారు చేశారు. ప్రొడ్యూసర్ కంకణాల ప్రవీణ నిర్మిస్తున్న ఈ చిత్ర టైటిల్ అనౌన్స్ మెంట్ తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే టైటిల్‌కు తగినట్లే పూర్తిగా లవ్ ఎంటర్ టైనర్‌గా 'లవ్ జాతర' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, సుజాత సిద్ధార్థ్ డీవోపీగా వ్యవహరిస్తున్నారు. 'లవ్ జాతర'కు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే తెలియజేస్తామని నీరంతా ప్రవీణ్ అన్నారు.

## 'కిల్లర్'గా ఎస్‌జె సూర్య

మల్టీ టాలెంటెడ్ యాక్టర్ ఎస్‌జె సూర్య పది ఏళ్ల విరామం తర్వాత మళ్లీ దర్శకునిగా రీఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రానికి 'కిల్లర్' అనే టైటిల్ నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో ఎస్‌జె సూర్య హీరోగానే కాకుండా, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా తానే సమకూరుస్తున్నారు. ఈ చిత్రం ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ గోకులం మూవీస్ అధినేత గోకులం గోపాలన్ నేతృత్వంలో ఎస్‌జె సూర్యా సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, మలయాళ, కన్నడ తదితర భాషలలో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన గొకులం మూవీస్, ఈ సినిమాతో తమిళ సినీ రంగంలో కూడా తన సత్త చాటనున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు వి.సి. ప్రవీణ్, బైజు గోపాలన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కృష్ణమూర్తి వ్యవహరిస్తున్నారు. అజిత్ తో 'వాలి', పవన్ కళ్యాణ్ తో 'ఖుషీ', 'న్యూ' వంటి క్లాసిక్ హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎస్‌జె సూర్య, ఈ సినిమా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఐదు భాషలలో విడుదల కానుంది. .'కిల్లర్' ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకునే స్థాయి సినిమా ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. దేశవ్యాప్తంగా ప్రతిభ గల నటులు, సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రంగా రూపొందించబోతున్నాం' అని గోకులం గోపాలన్ తెలిపారు. త్వరలోనే ఈ చిత్ర తారాగణం, సాంకేతిక బృందం కథా నేపథ్యం వంటి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించనున్నారు.



## సోషియోఫాంటసీగా 'దీర్ఘాయుష్మాన్ భవ'



ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా సోషియో ఫాంటసీ ప్రేమకథతో తెరకెక్కిస్తున్న సినిమా 'దీర్ఘాయుష్మాన్ భవ'. కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లు. ఎం.పూర్ణానంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం త్రిపుర క్రియేషన్స్ పతాకంపై వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని జులై 11న విడుదల చేయబోతున్నట్లు నిర్మాత వంకాయలపాటి మురళీకృష్ణ తెలిపారు. చక్కటి ఫ్యామిలీ కథాశంతో రెండున్నర గంటలపాటు వినోదభరితంగా ఈ సినేమా నిర్మించామన్నారు. సోషియో ఫాంటసీ కావడంతో గ్రాఫిక్స్ కు ప్రాధాన్యం ఇచ్చాం. ఏ పాటకు ఆ పాట ఆహ్లాదభరితంగా ఉంటుందని అన్నారు. యూత్ తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించామని చెప్పారు.

## 'ఉప్పు కప్పురంబు' మ్యూజిక్ ఆల్బమ్ విడుదల

భారత దేశంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన ప్రైమ్ వీడియో, తాజా తెలుగు ఒరిజినల్ సినిమా 'ఉప్పు కప్పురంబు' సినిమా మ్యూజిక్ ఆల్బమ్‌ను మార్కెట్ లో విడుదల చేసింది. బిలీవ్ ఇండియా లేబుల్ ద్వారా విడుదలైన ఈ ఆల్బమ్‌లో మూడు ప్రత్యేకమైన పాటలు ఉన్నాయి. ఈ పాటలు చిత్రంలో చూపించే చిన్న పట్టణ జీవితం, హాస్యం, భావోద్వేగాలు అన్నింటినీ మనస్సుకు హత్తుకునేలా ఆలపించారు. ఈ చిత్రానికి స్వీకార్ అగస్తి సంగీతం అందించగా, రవికృష్ణ విస్సాప్రగడ, ఎస్. అత్తావుర్ రహీం, రఘురాం ద్రోణావజ్జల పాటలు రాశారు. సీన్ రోల్డన్, అనురాగ్ కులకర్ణి, ఆంటోని దాసన్, గానంతో పాటలు ఇంకా హృద్యంగా మారాయి.ఒకవైపు నోమిలాలా అనే పాట ఉత్సవాన్ని పాడుతుంటే, యాడున్నావో అనే పాట ఒక తల్లి, బిడ్డ మధ్య సెంటిమెంట్ ను తెలియజేస్తుంది.




# రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ అంగీకరించలేదు

## 'సోషలిస్ట్, లౌకిక' పదాలను సమీక్షించాలనడం రాజ్యాంగ ఆత్మపై ఉద్దేశపూర్వక దాడే : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ అంగీకరించలేదని కాంగ్రెస్ ఆరోపించింది. రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిస్ట్, లౌకిక' అనే పదాలను సమీక్షించాలని పిలుపునివ్వడం బాబాసాహెబ్ అంబేద్కర్ న్యాయమైన, సమ్మిళితమైన, ప్రజాస్వామ్య భారతదేశం కోసం చేసిన దార్శనికతను కూల్చివేయడానికి చాలా కాలంగా జరుగుతున్న కుట్రలో భాగమని మండిపడింది. ఆర్‌ఎస్‌ఎస్ సూచన మన రాజ్యాంగ ఆత్మపై ఉద్దేశపూర్వక దాడి అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. 'సోషలిస్ట్', 'లౌకిక' అనే పదాలను రాజ్యాంగ ప్రవేశికలో సమీక్షించాలని ఆర్‌ఎస్‌ఎస్ పిలుపునిచ్చిన మరుసటి రోజున కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. వాటిని అత్యవసర పరిస్థితి సమయంలో చేర్చారని, బిఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో ఎప్పుడూ భాగం కావు అని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ భారత రాజ్యాంగాన్ని ఎప్పుడూ అంగీకరించలేదన్నారు. నవంబర్ 30, 1949 నుండి రాజ్యాంగ రూపకల్పనలో పాల్గొన్న డాక్టర్ అంబేద్కర్, నెహ్రూ, ఇతరులపై దాడి ఆర్‌ఎస్‌ఎస్ చేసిందన్నారు. రాజ్యాంగం మనుస్మృతి నుండి ప్రేరణ పొందలేదని ఆర్‌ఎస్‌ఎస్ వాఖ్యానించిందని జైరామ్ ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పదేపదే కొత్త రాజ్యాంగం కోసం పిలుపునిచ్చాయని దుయ్యబట్టారు. ఇది 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో మిస్టర్ (నరేంద్ర) మోడీ ప్రచార నినాదం కూడా అని అన్నారు. భారత ప్రజలు ఈ నినాదాన్ని నిర్ణయాత్మకంగా తిరస్కరించారని గుర్తుచేశారు. అయినప్పటికీ రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని మార్చాలనే డిమాండ్లను ఆర్‌ఎస్‌ఎస్ పర్యావరణ వ్యవస్థ చేస్తూనే ఉందని రమేష్ పేర్కొన్నారు. ప్రముఖ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త లేవనెత్తిన అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి నవంబర్ 25, 2024న స్వయంగా తీర్పు ఇచ్చారని ఆయన అన్నారు. దీనిని చదవడానికి ఇబ్బంది పడమని ఆయనను అభ్యర్థించడం చాలా కష్టమవుతుందా? రమేష్ అన్నారు. ఆ తీర్పు కాపీని కూడా ఎక్స్‌ల పంచుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి భావజాలం భారత రాజ్యాంగానికి ప్రత్యక్ష వ్యతిరేకం అని కాంగ్రెస్ ఆరోపించింది.

'సోషలిస్ట్, లౌకిక అనే పదాలను ప్రవేశిక నుండి తొలగించాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే బహిరంగంగా పిలుపునిచ్చారు. ఇదికేవలం సూచన కాదు, ఇది న రాజ్యాంగం ఆత్మపై ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం' అని కాంగ్రెస్ పేర్కొంది. రాజ్యాంగాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నానికైనా కాంగ్రెస్ అడ్డు గోడగా నిలుస్తుంది, జై సంవిధాన్ అని పార్టీ పేర్కొంది.

### ఆర్‌ఎస్‌ఎస్‌పై లాలూ ప్రసాద్ విమర్శలు

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)పై ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. సామాజిక న్యాయం, మత సామరస్యం తనకు మార్గదర్శక సూత్రాలని చెప్పే బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ఆర్‌ఎస్‌ఎస్‌ను కులతత్వ సంస్థగా అభివర్ణిస్తూ ఎక్స్‌లో తన బాధను వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితి సమయంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం 'సోషలిస్టు, లౌకిక' పదాలను ప్రవేశికలో చేర్చినందున, ఆర్‌ఎస్‌ఎస్ 'సర్కార్యవా' హోసబాలే ఈ రెండు పదాలను తొలగించాలని సూచించిన వార్తల క్లిప్పింగ్‌ను ఆయన సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. దీనిపై లాలూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ 'దేశంలోని అత్యంత కులతత్వ, ద్వేషపూరిత సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని మార్చాలని పిలుపునిచ్చింది' అని ఆరోపించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు రాజ్యాంగం, అందులో పేర్కొన్న రిజర్వేషన్లపై దృష్టి పెట్టే ధైర్యం లేదని మండిపడ్డారు.

# నెల రోజుల పాటు 'ఆపరేషన్ ముస్కాన్'

## పోస్టర్ ఆవిష్కరించిన సిఐడి ఎడిజి చారుసిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తప్పిపోయిన, అనాథలైన, అక్రమ రవాణా చేయబడుతున్న పిల్లలను గుర్తించి, రక్షించి, వారికి పునరావాసం కల్పించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ చేపట్టిన నెలరోజుల జాతీయ కార్యక్రమమైన ఆపరేషన్ ముస్కాన్11 తెలంగాణ రాష్ట్రంలో జూలై 1 నుండి జూలై 31, 2025 వరకు నిర్వహించనున్నామని సిఐడి అదనపు డిజి చారుసిన్హా తెలిపారు. ఈ మేరకు 'ఆపరేషన్ ముస్కాన్' పోస్టర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ ఆపరేషన్‌కు మహిళా భద్రతా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారు సిన్హా, నేతృత్వం వహిస్తూ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయడానికి 706 మంది పోలీసు సిబ్బందితో కూడిన 121 సబ్‌డివిజనల్ పోలీసు బృందాలను ఏర్పాటు చేమని చారుసిన్హా తెలిపారు. ఈ బృందాలు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఆరోగ్య శాఖ, జిల్లా శిశు సంరక్షణ యూ నిట్లు, శిశు సంక్షేమ కమిటీలు, వివిధ స్వచ్ఛంద సంస్థలతో సమన్వయంతో పని చేస్తాయని తెలిపారు. సరైన కార్యాచరణ, సమన్వయం కోసం చారు సిన్హా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్, తెలంగాణ న్యాయ సేవాధికారం, కార్మిక శాఖ, విద్యా శాఖ, ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ, బాలల గృహాలు, సెల్, బాలల రక్షణ నిపుణులు, అంతర్జాతీయ జస్టిస్ మిషన్, దివ్య దిశ, మై ఛాయిసెస్ ఫౌండేషన్, స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్లు మానవ అక్రమ రవాణా నిరోధక బృందాలు, సబ్‌డివిజనల్ ముస్కాన్ బృందాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో బాల కార్మికులు, బాల భిక్షాటన వంటి సమస్యలపై చర్చించారు. బాలల రక్షణ మరియు పునరావాసానికి సంబంధించి ఇంటర్‌ఏజెన్సీ సమన్వయం, రెస్క్యూ ప్రోటోకాల్‌లు, చట్టపరమైన పునరావాస ప్రక్రియలు, డేటా నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

# మొబైల్ ఫోన్ యాప్ ద్వారా ఓటింగ్..

**పాట్నా:** మొబైల్ ఫోన్ యాప్ ద్వారా ప్రజలు తొలిసారి ఓటు వేయనున్నారు. ఈ విధానానికి అనుమతి ఇచ్చిన తొలి రాష్ట్రంగా బిహార్ నిలిచింది. ఆ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ ఈ విషయాన్ని శుక్రవారం తెలిపారు. మూడు జిల్లాల్లోని ఆరు మున్సిపల్ కౌన్సిల్ పదవులకు శనివారం పోలింగ్ జరుగనున్నది. పోలింగ్ బూత్‌కు వెళ్లలేని వారికి ఈ కొత్త ఓటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని దీపక్ ప్రసాద్ చెప్పారు. ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన యాప్ ద్వారా ఓటు వేయవచ్చన్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు, వలస ఓటర్లు, శారీరక లేదా ఇతర కారణాల వల్ల పోలింగ్ కేంద్రానికి చేరుకోలేని వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని ఓటు వేయవచ్చని వివరించారు. మొబైల్ ఫోన్ యాప్ ద్వారా ఓటింగ్ గురించి జూన్ 10 నుంచి 22 వరకు అవగాహన ప్రచారం నిర్వహించినట్లు వెల్లడించారు. కాగా, ఈఓటింగ్ కోసం నమోదు చేసుకోవాలనుకునే ఓటర్లు తమ మొబైల్‌లో eSECBHR యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ తెలిపారు. ఈ యాప్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ ఫోన్‌లకు మాత్రమే అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఇప్పటికే పేరు నమోదు చేసుకున్న ఫోన్ నంబర్‌కు ఈ యాప్‌ను లింక్ చేయాలని అన్నారు.

# రాజ్యాంగ వ్యతిరేకి ఆర్‌ఎస్‌ఎస్

(మొదటి పేజీ తరువాయి)

డి.రాజా పేర్కొన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తమ అజెం డా సాధనలో దూకుడు ప్రదర్శిస్తున్నాయన్నారు. సామ్యవాదం (సోషలిజం), లౌకికవాదం (సెక్యులరిజం) పదాలు చట్టబద్ధమైనవి, వాటిని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించిందని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో భారత్ ఎప్పుడు కూడా లౌకిక దేశంగానే ఉండాలని, ప్రజాస్వామిక గణతంత్రంగా వర్ధిల్లాలని, మతరాజ్యం కారాదని అంబేద్కర్ స్పష్టంచేశారని రాజా తెలిపారు. అందుకోసమే 'హిందూ రాష్ట్ర'ను తిరస్కరించారని అన్నారు. హిందూ రాష్ట్ర సాధన జరిగితే దేశానికి పెద్ద విపత్తు అని హెచ్చరించాన్నారు. సామ్యవాదం గురించి ప్రస్తావిస్తూ 'రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు కొందరు సభ్యులు ఈ పదాన్ని ఎందుకు పెట్టారంటూ గొడవ చేశారు. అప్పుడు అంబేద్కర్ వారికి ఆదేశిక సూత్రాలు (డైరెక్టివ్ ప్రిన్సిపల్) వివరించారు. అవి సోషలిజం తప్ప మరేమీ కాదని చెప్పారు' అని రాజా తెలిపారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నేత హోసాబలే ఈ వ్యాఖ్యల తొలగింపునకు డిమాండ్ చే యడాన్ని తప్పుపట్టారు. 'ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏం కావాలో అందరికీ తెలుసు. రాజ్యాంగానికి అది విరుద్ధమన్నది జగమెరిగిన సత్యం. అందుకే లోక్‌సభ ఎన్నికలప్పుడు '400 పార్' (400 సీట్లకుపైగా) అన్నారు. కాబట్టే రా జ్యాంగాన్ని పరిరక్షించడమన్న అంశం ప్రతిపక్షాలకు ఎన్నికల ప్రచారాంశంగా మారింది' అని రాజా అన్నారు. రాజ్యాంగాన్ని మార్చి, ప్రజాస్వామిక అంశాలను తొలగించాలనే సంఘ్ బిజెపి డిజైన్ నుంచే ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకుడి నోట ఆ మాటలు వచ్చాయని దీపాంకర్ భట్టాచార్య వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్, సెక్యులర్ పదాల తొలగింపునకు దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసినప్పటికీ... ఆర్‌ఎస్‌ఎస్ మళ్లీ అదే డిమాండ్ చేస్తున్నదని దుయ్యబట్టారు. 1975లో తాత్కాలిక ఎమర్జెన్సీ వల్ల ప్రజాస్వామ్యం విలువ దేశానికి తెలిసివచ్చిందన్నారు. 1977లో ఎమర్జెన్సీని భారత ఓటర్లు తిరస్కరించారని గుర్తుచేశారు. 2024 ఎన్నికల ఫలితాల్లోనూ రాజ్యాంగంపై దాడులను ఉపేక్షించేది లేదన్న సందేశం స్పష్టమైందన్నారు. మోదీషా పాలనలో అప్రకటిత శాశ్వత ఎమర్జెనీ ఉందని, దీనిని తిరస్కరించేందుకు దేశ ప్రజలు కంకణబద్ధులై ఉన్నారని భట్టాచార్య పేర్కొన్నారు.

# ఇప్పట్లో ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం ఇరాన్ తన అణు అభివృద్ధి కార్యకలాపాలను పరిమితం చేయాలి. యురేనియం శుద్ధి స్థాయిని తగ్గించాలి. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఎఇఎ) తన యంత్రాంగాన్ని తనిఖీలకు అనుమతించాలి. అందుకు ప్రతిగా ఇరాన్‌పై విధించిన ఆంక్షలను అమెరికా, ఐరోపా దేశాలు తొలగించాయి. ఇరాన్ ఆర్థికంగా ఊపిరి పీల్చుకోగలిగింది. అయితే, డొనాల్డ్ ట్రంప్ 2018లో తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు జెసిపిఒఎ నుంచి వైదొలిగారు. 'అత్యధిక ఒత్తిడి' పదేరుతో ఇరాన్‌పై మళ్లీ కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలతో జెసిపిఒఎకి విలువలేకుండాపోయింది. ఇప్పుడు మరోసారి చర్చల పేరుతో ట్రంప్ హడావుడి చేస్తుండగా, అమెరికా వైకరిని ఇరాన్ నమ్మడం లేదు. అమెరికా ఒప్పందం నుంచి వెనక్కి తగ్గిన విధానం ద్వారా అగ్రరాజ్యంపై ఇరాన్ పెట్టుకున్న నమ్మకానికి పెద్ద దెబ్బ తగిలిందనేది వాస్తవం. అందుకే, ఇప్పుడు ఏదైనా కొత్త ఒప్పందంపై ఇరాన్ అప్రమత్తంగా ఉంది. అణు చర్చలు ఇప్పట్లో జరగవని స్పష్టం చేయడం వెనుక బలమైన కారణం ఉంది. అమెరికా విశ్వసనీయతను కోల్పోయింది. ఏకపక్ష నిర్ణయాలతో ఒప్పందాలను నిర్లక్ష్యం చేస్తున్నది. అణ్వాయుధాల తయారీ జరుగుతున్నదని ఆరోపిస్తూ, ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడులకు మద్దతనివ్వడం, స్వయంగా అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించడం వంటి చర్యలు ఇరాన్ సహా అనేక దేశాలను అప్రమత్తం చేశాయి. ఇజ్రాయెల్ దాడులు, ఆ వెంటనే అమెరికా బాంబుల వర్షం వంటి పరిణామాలు ఎంత హఠాత్తుగా చోటు చేసుకున్నాయో, అంతే హఠాత్తుగా ట్రంప్ శాంతి మంత్రం జరిపించడం ప్రారంభించారు. ఇరాన్‌తో అణు చర్చలు తిరిగి ప్రారంభమవుతాయని ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగానే స్పందించింది. ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో తమదే విజయమని ప్రకటించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయొతుల్లా ఖమేనీ, అమెరికాపైన కూడా విమర్శలు కురిపించారు. అమెరికాకు చెంపెట్టు సమాధానం ఇచ్చామని వ్యాఖ్యానించారు. ట్రంప్ ఆర్భాటంగా చేస్తున్న ప్రకటనలు వాస్తవ రూపం దాల్చే అవకాశాలు ఇప్పట్లో లేవని ఇరాన్ మంత్రి అబ్బాస్ చేసిన ప్రకటన స్పష్టం చేస్తున్నది.

# రూ.59,884 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పెరగగా ఇది 2023–24లో రూ.20,339 కోట్లకు, 2024–25లో రూ.20,569 కోట్లకు గణనీయంగా వృద్ధి చెందిందని అన్నారు. అలాగే సరుకు రవాణా లోడింగ్, 2022–23లో 131.8 మిలియన్ టన్నులు, 2023–24లో 141.1 మిలియన్ టన్నులు, 2024–25లో 144.1 మిలియన్ టన్నుల గరిష్ట స్థాయికి చేరుకుని నూతన రికార్డులు సృష్టించదని అన్నారు.

### 960 కి.మీ ట్రాక్‌ను జోడించాం..

ఇక తాను పదవి బాధ్యతలు చేపట్టిన ఈ మూడేళ్ల కాలంలో కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ మొదలైన వాటి రూపంలో మొత్తం 960 కిలోమీటర్ల ట్రాక్‌ను జోడించడం ద్వారా జోన్ నెట్‌వర్క్ విస్తరణలో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. ఇంజనీరింగ్ రంగంలో, దక్షిణ మధ్య రైల్వే దాని అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టులలో కొన్నింటిని అమలు చేసింది. వీటిలో గూడూరు సమీపంలో జోన్ యొక్క పొడవైన 2.2 కిలోమీటర్ల రైలు ఫ్లైఓవర్ నిర్మాణం మరియు కాజీ పేట బైపాస్ ప్రాజెక్ట్‌లో భాగంగా కాజీపేట సమీపంలో దాని మొట్టమొదటి రైలుఅండర్‌రైలు నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగింది. మూలధన వ్యయం కూడా మూడు సంవత్సరాలలో మొత్తం రూ.47,050 కోట్ల రికార్డు స్థాయికి చేరుకుంది.

### రూ.6,500 కోట్లతో 119 స్టేషన్ల పునరాభివృద్ధి

దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.6,500 కోట్ల అంచనా వ్యయంతో 119 స్టేషన్లను సమగ్ర పునరాభివృద్ధి కోసం గుర్తించింది. ఈ పరివర్తన చొరవలో భాగంగా సికింద్రాబాద్, తిరుపతి, నెల్లూరు, హైదరాబాద్, విజయవాడ, కాచిగూడ, నాందేడ్ ఔరంగాబాద్ మరియు జల్నా వంటి ప్రముఖ స్టేషన్లలో పునరాభివృద్ధి పనులు పురోగతిలోఉన్నాయన్నారు. బేగంపేట, కరీంనగర్ మరియు వరంగల్ వంటి మూడు అమృత్ స్టేషన్లు ఇప్పటికే పునరాభివృద్ధి చేయబడి ప్రారంభించబడ్డాయి. ఈ స్టేషన్లు అత్యాధునిక ప్రయాణీకుల సౌకర్యాలు మరియు మెరుగైన వసతులు అందిస్తున్నాయి. సరుకు రవాణా మరియు మల్టీమోడల్ లాజిస్టిక్స్ సామర్థ్యాలను మరింత మెరుగుపరిచే పదమూడు గతి శక్తి కార్గో టెర్మినల్స్ ప్రారంభించబడ్డాయన్నారు. మూడేళ్లలో 396 ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను ప్రారంభించడంతో దక్షిణ మధ్య రైల్వే దేశంలో రెండవ అతిపెద్ద ఎలక్ట్రిక్ లోకోలు గల జోన్‌గా నిలిచిందన్నారు. భద్రతను మెరుగుపరిచే దిశగా , జోన్‌లో 234 మానవసహిత లెవల్ క్రాసింగ్‌లను తొలగించి, 32 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 204 రోడ్ అండర్ బ్రిడ్జిలను నిర్మించామన్నారు. వేగాన్ని గంటకు 130 కిలోమీటర్లకి పెంచామని సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునీకరణ మరొక ప్రధాన అంశం. ఈ రంగంలో 289 రూట్ కిలోమీటర్లను ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ కిందకు తీసుకువచ్చామన్నారు. 128 స్టేషన్లలో ఆధునిక ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్‌ను ప్రారంభించారు. అలాగే గత మూడేళ్లలో 8,800 కోచ్‌లు, 20,000 వ్యాగన్‌ల పి.ఓ.ఎచ్ అవుట్‌టర్న్‌ను సాధించామన్నారు. స్క్రాప్ డిస్పోజల్ ద్వారా వచ్చే ఆదాయం2022–23లో రూ.391 కోట్లు, 2023–24లో రూ.451 కోట్లు, 2024–25లో రూ.501 కోట్లతో స్థిరమైన పెరుగుదలను నమోదుచేశామని తెలిపారు.. ఇది జోన్ ప్రారంభం నుండి ఇప్పటివరకు అత్యధికంగా నమోదైంది.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com